ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 104 పేజీలు: 10+4 వెల: 6.50

ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల కేసులో ఎన్ఐఎ ఛార్జిషీటు
కదులుతున్న బస్సులో ఢిల్లీలో మరో గ్యాంగ్‌రేప్ 3



## ప్రధాని మోడీతో బ్రిక్స్ విదేశాంగమంత్రుల భేటీ 2



## కేరళం సిఎంగా సతీశన్ 5

ఎంపిక చేసిన కాంగ్రెస్ హైకమాండ్
రేస్ నుంచి తప్పుకొన్న వేణుగోపాల్, రమేశ్ చెన్నితల
సోమవారం ప్రమాణం చేసే అవకాశం

# విచారణకు రండి

జూలై 31న హాజరు కావాలని కెటిఆర్‌కు ఎసిబి సమన్లు



## ఫార్ములా కార్ రేసు కేసులో అరవింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డికి కూడా సమన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే14:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏసీబీ కోర్టు ఈ కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకుని, నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై నమోదైన కేసులో ఇప్పటికే ఏసీబీ అభియోగపత్రం దాఖలు చేసింది. తాజాగా ఆ ఛార్జ్‌షీట్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించడం కీలకంగా మారింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థను చేర్చింది. ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణ కోసం విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈఓకు నిధులు బదిలీ చేసిన వ్యవహారంపై ఈ కేసు నమోదైంది. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు రూ.55 కోట్లను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ గుర్తించింది. ఈ నిధుల బదిలీ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతులు, విధివిధానాలు పాటించకుండా చెల్లింపులు జరిగాయా అనే అంశంపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. పలువురు అధికారుల వాంగ్మూలాలు కూడా నమోదు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ద్వారా అభియోగపత్రం సిద్ధం చేసి కోర్టులో >>2

## ఇరాన్‌కు అణ్వాయుధం ఒప్పుకోం

హార్ముజ్ జలసంధి సైనికీకరణకు వ్యతిరేకం
శిఖరాగ్ర చర్చల్లో ట్రంప్, జిన్‌పింగ్



బీజింగ్‌లో ట్రంప్, జిన్‌పింగ్

**బీజింగ్, మే 14:** ఇరాన్‌కు ఎప్పటికీ అణ్వాయుధం ఉండకూడదనే అంశంపై అమెరికా, చైనా ఏకాభిప్రాయానికి వచ్చాయి. గురువారం చైనా >>2

# మోడీ ఫెయిల్

## నీట్ రద్దు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

ఆయన హయాంలోనే 93 పేపర్లు లీక్
ఆందోళనలో 2 కోట్ల మంది విద్యార్థులు
ఆ మంత్రిపై ఎందుకు చర్యల్లేవు?
కేంద్రం తీరుపై సిఎం రేవంత్ ఆగ్రహం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే14:** నీట్ యూజీ 2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గత పదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిరక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిరక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళనవ్యక్తం చేశారు. ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమ పిల్లలను నీట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ చేయించారని.. వారిఆశలన్నీ గల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డెకేడ్" శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్‌యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసినెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్‌నెట్, నీట్‌పిజి రద్దు అయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను >>2



గురువారం బికనీర్‌లో ఆటోలో వెళ్తున్న కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మెఘావాల్

బైక్ ఎక్కిన మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్
కాలినడకన సెక్రెటేరియట్‌కు మంత్రి రాణె
ఢిల్లీలో రెండు రోజులు వర్క్‌ఫ్రం హోం: సిఎం



# పొదుపు మంత్రం!

**ముంబయి, మే 14:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన తన అధికారిక నివాసం నుంచి విధాన్ భవన్‌కు బైక్‌పై ప్రయాణించారు. ఇంధనాన్ని ఆదా చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఫడ్నవీస్ ఈ విధంగా తన వంతు కార్యాచరణ అమలుచేసారు. గురువారం జరిగిన శాసనమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఫడ్నవీస్ బీజేపీ నేత, మంత్రి ఆశీష్ >>2

## కాన్వాయ్ తగ్గించుకోవాలని గవర్నర్ శుక్లా నిర్ణయం 2

# ధాన్యం కొనుగోళ్లకు 22 వేల కోట్లు

హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు
వచ్చే 15 రోజుల పాటు లారీలు, డిసిఎంలు ధాన్యం రవాణా కోసం వినియోగం
సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి



గురువారం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంత్రులు ఉత్తమ్, పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనీ సాంబ శివరావు, వైరాఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65 >>2



## భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై నేడు నిర్ణయం

ముందస్తు బెయిలు విచారణ వారం వాయిదా

**హైదరాబాద్, మే14,ప్రభాతవార్త:** కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనయుడు బండి భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారంకు, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజుల పాటు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. భగీరథ్ తరుపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ బాదితురాలు వయస్సుపై స్పష్టలేదని చార్జ్‌షీటులో ఆమె వయస్సుకు జిహెచ్ఎంసి జారీచేసిన పుట్టినతేది సర్టిఫికెట్‌లో 2008 అని ఉందని పాన్‌కార్డులో 2010 ఉందని తెలిపారు. 2021లో డ్రైవింగ్ చేస్తూ బాదితురాలు పట్టుబడగా అప్పుడు >>2

# 'దోస్త్' సీట్ల కేటాయింపు

తొలి విడతలో 56,147 మంది ఎంపిక
కామర్స్‌లో అత్యధికంగా 23,214 మందికి సీట్లు
తెలుగు మీడియంలో 1131 మందికే
రెండో విడతకు నేటి నుంచి రిజిస్ట్రేషన్లు
దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 14:** డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2026 మొదటి విడతలో 56,147 మందికి సీట్ల కేటాయింపు చేశారు. వారిలో కామర్స్ విద్యార్థులు అత్యధికంగా 23,214 మంది ఉన్నారు. మొత్తం సీట్ల కేటాయింపులో కామర్స్ విద్యార్థులు 45 శాతానికి పైగా ఉన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 23 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. దోస్త్-2026 మొదటి విడత సీట్ల కేటాయింపు వివరాలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి గురువారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, దోస్త్ అధికారులు వసుంధర, విజయరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిన దోస్త్ ఛైర్మన్, కళాశాల విద్య కమిషనర్‌తోపాటు కళాశాల విద్య జాయింట్ డైరక్టర్లు ఇతర సీసీఈ ఉన్నతాధికారులు ఎవరూ హాజరు కాలేదు. మొదటి విడత సీట్ల కేటాయింపు సందర్భంగా దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. 84,610 మంది విద్యార్థులు దోస్త్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.వారిలో ఫేజ్-1లో 61,543 మంది వెబ్ ఆప్షన్లను ఇవ్వగా.. అందులో 56,147 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేసినట్టు తెలిపారు. వెబ్ ఆప్షన్లు తక్కువగా ఇచ్చిన విద్యార్థుల్లో 5396 మందికి మొదటి విడతలో సీట్లు కేటాయించలేదన్నారు. మొదటి ఆప్షన్ ఇచ్చిన వారిలో 36,634 మందికి సెకండ్ ఆప్షన్ ఇచ్చిన 19,513 మందికి సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు కేటాయింపులో.. ఆర్ట్స్‌లో 8,415మందికి, కామర్స్‌లో 23,214 మందికి, లైఫ్‌సైన్సెస్‌లో 9,815 మందికి, >>2




గురువారం హైదరాబాద్‌లో సీట్ల వివరాలను వెల్లడిస్తున్న దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తదితరులు



## 30 నుంచి 'సర్'

దశల వారీగా ఓటర్ల జాబితా సవరణలు
తెలంగాణలో అక్టోబరు 1న తుది జాబితా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే14:** కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్-సర్)మూడో దశకు సంబంధించి కీలక ప్రకటన వెలువరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి దశలవారీగా చేపట్టనున్నట్లు గురువారం >>2



## రెండు రోజుల్లో అండమాన్‌కు 'నైరుతి'

### వడగాడ్పుల మధ్య చల్లటి కబురు చెప్పిన వాతావరణ అధికారులు

**న్యూఢిల్లీ,మే 14:** అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలకు అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. రానున్న రెండురోజుల్లో నైరుతి రుతుపవనాలకు వాతావరణం అనుకూలంగా ఉందని, మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు అండమాన్‌ను తాకొచ్చని తెలిపింది. తుపాను వలయం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని, రాబోయే 48 గంటల్లో >>2

# అండమాన్‌కు 'నైరుతి'

>> మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు మండిపోతున్నాయి. కొన్నిచోట్ల అకాల వర్షాలు పడుతున్నప్పటికీ, కాసేపటికి లేదా మరుసటి రోజు ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లో నైరుతీ రుతుపవనాలు రానున్నయని వాతావరణ శాఖ తెలిపింది. మే 16 నాటికి నైరుతి రుతు పవనాలు అండమాన్ నికోబార్ చేరుకోవచ్చని అంచనా వేసింది. వాతావరణ శాఖ ప్రకారం, ఈనెల 13 నుంచి 19 వరకు అండమాన్ నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపాను వలయం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని, రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని పేర్కొన్నది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు మండిపోతున్నాయి. కొన్నిచోట్ల అకాల వర్షాలు పడుతున్నప్పటికీ కాసేపటికి లేదా మరుసటి రోజు ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రానున్నయని వాతావరణ కేంద్రం తెలిపింది. మే 16నాటికి నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ చేరుకోవచ్చని అంచనా వేసింది. వాతావరణ కేంద్రం వివరాల ప్రకారం మే 13 నుంచి 19 వరకు అండమాన్ నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# మోడీ ఫెయిల్

>> ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## ఇరాన్‌కు అణ్వాయుధం ఒప్పుకోం

>> రాజధాని బీజింగ్‌లో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీలో ఈమేరకు ఇరుదేశాలు పరస్పర అంగీకారానికి వచ్చాయి. ప్రపంచ దేశాలకు ఇంధన వనరుల సరఫరా నిరాటంకంగా జరిగేందుకు హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. హర్మూజ్ జలసంధి మార్గంపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, మరింత అమెరికన్ చమురును కొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తిని కనబర్చారు. హర్మూజ్ జలసంధి సైనికీకరణను, దాని వినియోగానికి సుంకాన్ని విధించే ఏ ప్రయత్నాన్నైనా వ్యతిరేకిస్తామని ట్రంప్‌నకు ఆయన స్పష్టం చేశారు. అమెరికన్ వ్యాపారాలకు చైనాలో మార్కెట్ అవకాశాలను విస్తరించడం సహా ఆర్థిక సహకారాన్ని పెంపొందించే మార్గాలపైనా వీరిద్దరు చర్చించారు. ట్రంప్, జిన్‌పింగ్ చర్చలపై గురువారం అమెరికా వైట్‌హౌస్ ఈ వివరాలతో ప్రకటన విడుదలచేసింది. అమెరికన్ వ్యాపారాలకు చైనాలో మార్కెట్ ప్రవేశాన్ని విస్తరించడం, అమెరికన్ పరిశ్రమలలో చైనా పెట్టుబడులను పెంచడం, ఇరుదేశాల ఆర్థిక సహకారాన్ని పెంపొందించే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. అనేక అతిపెద్ద అమెరికన్ కంపెనీల ప్రతినిధులు ఈ ద్వైపాక్షిక సమావేశాల్లో కొంత భాగానికి హాజరయ్యారు. అమెరికాలోకి ఫెంటానిల్ పూర్వగామి రసాయనాల ప్రవాహాన్ని అడ్డుకోవడంలో సాధించిన పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో కలిసికట్టుగా పనిచేయాలనే దానిపై ఇరువురు మాట్లాడుకున్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను కొనడాన్ని పెంచాలని చైనా ప్రెసిడెంట్‌కు ట్రంప్ సూచించారు అని వైట్‌హౌస్ ప్రకటించింది. గత వందేళ్లలో ఎన్నడూ చూడని పరివర్తన ప్రపంచవ్యాప్తంగా వేగవంతమవుతోంది. అంతర్జాతీయ పరిస్థితి అస్థిరంగా, అల్లకల్లోలంగా ఉంది. చైనా అమెరికా సంబంధాల స్థిరమైన, పటిష్టమైన అభివృద్ధికి చైనా కట్టుబడి ఉంది. చైనా అమెరికా ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పరస్పరం ప్రయోజనకరమైనవి. ఇరుపక్షాలకూ లాభదాయకమైనవి. ఆర్థికం, వాణిజ్యం, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలు, శాంతిభద్రతలు వంటి రంగాలలో ఇరు దేశాలు పరస్పర మార్పిడి, సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. చైనా అమెరికా సంబంధాలలో తైవాన్ సమస్య అత్యంత ముఖ్యమైన అంశం. దీన్ని సరిగ్గా పరిష్కరిస్తే ద్వైపాక్షిక సంబంధాలు సంపూర్ణ స్థిరత్వాన్ని పొందుతాయని లేకపోతే అమెరికా, చైనా మధ్య ఘర్షణలు, సంఘర్షణలు తలెత్తి, మొత్తం సంబంధాలు తీవ్ర ప్రమాదంలో పడతాయని ట్రంప్‌తో కలిసి బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్ వేదికగా చేసిన ప్రసంగంలో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ హెచ్చరించారు. ట్రంప్, నేను చైనాఅమెరికా సంబంధాలు, అంతర్జాతీయ, ప్రాంతీయ పరిణామాలపై లోతైన చర్చలు జరిపామని చైనాఅమెరికా సంబంధమే ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన ద్వైపాక్షిక సంబంధం అని మేమిద్దరం విశ్వసిస్తున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. పరస్పర సహకారం వల్ల చైనా, అమెరికా రెండూ లాభపడతాయి, ఘర్షణ వల్ల రెండు దేశాలూ నష్టపోతాయి. మన రెండు దేశాలు ప్రపంచానికి మరింత శాంతి, శ్రేయస్సు, పురోగతిని తీసుకురావడానికి, వ్యూహాత్మక స్థిరత్వంతో కూడిన నిర్మాణాత్మక చైనా అమెరికా బంధాన్ని నిర్మించుకోవడానికి నేను, ట్రంప్ అంగీకారానికి వచ్చామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో ఉన్న గోల్డెన్ రూమ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారిక విందు ఇచ్చారు. ఈ విందులో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లతో పాటు ప్రముఖ వ్యాపారవేత్తలు ఎలాన్ మస్క్, జెన్సన్ హువాంగ్, టిమ్ కుక్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా ప్రాజెక్టులు వెలవెల

## అడుగంటిన శ్రీశైలం, సాగర్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల జీవనాడి కృష్ణమ్మ విలవిలలాడుతోంది. ఎండలు మండిపోతుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం రోజురోజుకూ పాతాళానికి పడిపోతోంది. అటు శ్రీశైలం, ఇటు నాగార్జున సాగర్ జలాశయాల్లో నీరు అడుగంటిపోవడంతో రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పవన్న ఆందోళన మొదలైంది. శ్రీశైలం ప్రాజెక్టు దాదాపు ఖాళీ అవుతోంది. ఈ డ్యామ్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 39.2 టీఎంసీలు మాత్రమే డ్యాంలో మిగిలి ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించి 810 అడుగుల వద్ద నీటిమట్టాన్ని డెడ్ స్టోరేజీగా పరిగణిస్తారు. అయితే ప్రస్తుతం నీటిమట్టం 817.7 అడుగుల దగ్గరే ఉంది. అంటే మరో 7 అడుగులు తగ్గితే నీటిని వినియోగించుకోవడం సాధ్యం కాకపోవచ్చు. ఇక నాగార్జున సాగర్ పరిస్థితి కూడా ఏమంతా ఆశాజనకంగా లేదు. 312.05 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 157.42 టీఎంసీల నీటి నిల్వలే ఉన్నాయి. ఇక్కడ 510 అడుగులని డెడ్ స్టోరేజీగా భావిస్తారు, ప్రస్తుతం నీటిమట్టం 524 అడుగుల వద్ద ఉంది. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 16 టీఎంసీల నీటిని కేటాయించింది. సాగర్, శ్రీశైలం అడుగంటిపోతుండటంతో సాగునీరు అందక రైతులు, ఇటు తాగునీటి సరఫరా తగ్గిపోతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసి ఎగువ నుంచి వరద పోటెత్తే వరకు నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# పొదుపు మంత్రం!

>> షెలార్‌తో కలిసి బైక్‌పై వెళ్లారు. దాంతో ఫడ్నవీస్ భద్రతా సిబ్బంది కూడా ఆయనను బైక్ లపై అనుసరించారు. ఈ ప్రయాణంలో ఫడ్నవీస్ రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 350 (స్టెల్త్ బ్లాక్ కలర్) బైక్ ను ఉపయోగించారు. ఇదే స్ఫూర్తితో మరో మంత్రి నితేష్ రాణే సచివాలయానికి ఏకంగా నడిచి రావడం విశేషం. ఇంధన పొదుపు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు కఠిన చర్యలను ప్రకటించింది. ఇందులో భాగంగా మంత్రుల కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని నిర్ణయించారు. అంతేకాకుండా మంత్రులు, ప్రభుత్వ అధికారుల విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన వాహనాలపైనా సమీక్ష జరుపుతామని స్పష్టంచేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా ఇంధన సరఫరాపై తీవ్ర ఒత్తిడినెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇంధనంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ముడిచమురు, గ్యాస్ దిగుమతులకోసం భారత్ ఆ ప్రాంతంపైనే ఎక్కువగా ఆధారపడటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టాయి. అలాగే ఢిల్లీముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఇంధన ఆదా చర్యలు చేపట్టారు. వారంలో రెండురోజులపాటు ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం అనుమతిచ్చారు. అంతేకాకుండా అధికారులకు కూడా నెలవారీ ఇచ్చే ఇంధనంలో కూడా 20% కుదించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుసైతం తన కాన్వాయ్‌ను కుదించుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రత్యేకించి బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రధానిమోడీ ఇచ్చిన పిలుపును తక్షణమే అమలులోకి తెచ్చారు.

## కాన్వాయ్ తగ్గించుకోవాలని గవర్నర్ శుక్లా నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే14:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. తన కాన్వాయ్‌ను తగ్గించుకోవాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రధాని సందేశానికి తాము మద్దతు ఇస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. వాహనాలను తగ్గించే ప్రధాని కార్యక్రమాన్ని తాము అమలు చేస్తున్నట్లు చెప్పారు. లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలను తగ్గించామని అన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు.. ప్రధాని సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ కోరారు. తెలంగాణ ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కాలేజీలలో ప్రధాని మోదీ సందేశాన్ని లైన్ ఇంప్లిమెంట్ చేయాలని కోరుతున్నట్లు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

15-05-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
త్రయోదశి ఉ.8.31, చతుర్దశి తె.5.11
అశ్వని రా.8.10
వర్జ్యం : సా.4.34-సా.6.00,తె.4.41-ఉ.6.07
దు.ఉ.8.11-ఉ.9.03,2) మ.12.29-రా.1.21
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ముక్కుమీద కోపాన్ని అదుపులో ఉంచుకోవలసి ఉంటుంది. మీ ఊహలకు, వాస్తవాలకు పొంతన ఉండదు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. తృప్తే జీవితంలో ముఖ్యమైనదని గుర్తిస్తారు.

**మిథునం:** నూతన విద్యలపై ఆసక్తిని చూపుతారు. భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**కర్కాటకం:** విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. దూరప్రాంత ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**సింహం:** రాజకీయ, కళారంగాల వారికి అంతంత మాత్రంగా ఉంటుంది. క్రమశిక్షణకు ప్రాధాన్యత నిస్తారు.

**కన్య :** అనేకాంకాశాలు ఈ రోజు మీకు అనుకూలంగానే ఉన్నాయని చెప్పవచ్చు. సంతానపరంగా సంతృప్తి కలిగి వుంటారు.

**తుల :** కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. మీకు రావలసిన ఋణాలు వివాదస్పదమవుతాయి. వస్త్రలాభం.

**వృశ్చికం:** కోర్టు కేసులు ఓ కొల్కి వస్తాయి. నిపుణులతో కలసి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం అన్ని విధాల శ్రేయస్కరం.

**ధనుస్సు:** పెద్దలతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**మకరం:** తొందరపాటు మాటలవల్ల సన్నిహితులను దూరం చేసుకునే సూచనలున్నాయి. సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి.

**కుంభం:** గృహ వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. కాంట్రాక్టులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

**మీనం:** పట్టుదలతో ముందుకు సాగి పనులు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రధాని మోడీతో బ్రిక్స్ విదేశాంగమంత్రుల భేటీ



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన బ్రిక్స్ విదేశాంగ మంత్రులు

**న్యూఢిల్లీ, మే 14:** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశం కొనసాగుతోంది. గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు ఈ సమావేశం జరగుతుంది. భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సులో ప్రపంచ, ప్రాంతీయ సమస్యలు, ముఖ్యంగా పశ్చిమాసియా పరిణామాలపై చర్చించనున్నారు. ఈ సమావేశాలకు హాజరైన బ్రిక్స్ విదేశాంగ మంత్రులు ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఒక్కొక్కరుగా వచ్చి వేదికపై ఉన్న ప్రధానిని కలిసి కరచాలనం చేశారు. అతనంతరం అందరు కలిసి ప్రధానితో గ్రూప్ ఫొటో దిగారు. బ్రిక్స్ విదేశాంగ మత్రుల సమావేశానికి ముందు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఢిల్లీలో పలు ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ ఉదయం చిలీ విదేశాంగ మంత్రి ఫ్రాన్సిస్కో పెరెజ్ మెకెన్నాతో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఆయన దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రొనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మోరో వీరాలతో కూడా ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. ఈ సాయంత్రం రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో కూడా జైశంకర్ సమావేశమవుతారు.

# 'దోస్త్' సీట్ల కేటాయింపు

>> ఫిజికల్ సైన్సెస్‌లో 14,394 మందితోపాటు ఇతరులు 309 మందికి సీట్లు కేటాయించారు. ఇంగ్లీష్ మీడియంలో 54,608 మందికి, తెలుగు మీడియంలో 1,131 మందికి హిందీ మీడియంలో ఏడుగురికి, ఉర్దూ మీడియంలో 396 మందికి, అరబిక్ మీడియంలో ఐదుగురికి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన వారిలో 36,302 మంది బాలికలు ఉండగా, 19,845 మంది బాలురున్నారు. రాష్ట్రంలోని 777 డిగ్రీ కాలేజీల్లో 3,60,709 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 56,147 సీట్లను కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 79 కాలేజీలకు మొదటి విడతలో సీట్లను కేటాయించ లేదన్నారు. గురుకులాల అధ్వర్యంలో కొనసాగుతున్న 79 కాలేజీలతోపాటు, నాన్ దోస్త్‌లో ఉన్న 60 కాలేజీల్లోనూ దోస్త్ ద్వారా ప్రవేశాలను జరపడం లేదని తెలిపారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు రూ.500, రూ. 1000 చెల్లించి నేటి(శుక్రవారం) నుంచి ఈ నెల 23 వరకు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి అర్హులుగా ఉన్న వారు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ సమయంలో ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. నేటి నుంచి ఈ నెల 26 వరకు రెండో విడతలో రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. రెండో విడత సీట్ల కేటాయింపు ఈ నెల 30న చేపడతామని తెలిపారు. ఏఐఈడీపీ కోర్సులను అందిస్తున్న ప్రభుత్వ కాలేజీల్లో 11,580 సీట్లు ఉండగా వాటిలో 1379 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు తెలిపారు. మొత్తం సీట్లలో 11.91 శాతం సీట్లను కేటాయించినట్టు తెలిపారు. ప్రైవేటు కాలేజీల్లో 26,100 సీట్లు ఉండగా వాటిలో 2118 మందికి సీట్లు కేటాయించారు. 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో 290 సీట్లు ఉండగా అందులో 263 సీట్లను కేటాయించినట్టు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సుల్లో సీట్ల కేటాయింపును రెండో విడతలో చేపట్టనున్నట్టు తెలిపారు. అటానమస్ కాకుండా కొనసాగుతున్న 116 ప్రభుత్వడిగ్రీ కాలేజీల్లో 50,760 సీట్లు ఉండగా.. మొదటి విడతలో 8079 సీట్లను కేటాయించారు. 577 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2,37,540 సీట్లు ఉండగా.. అందులో 16,633 సీట్లను కేటాయించారు.

# విచారణకు రండి

>> దాఖలు చేసినట్లు సమాచారం. ఫార్ములా ఈ కార్ రేసు కేసు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఈ అంశంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ నేతలు ఈ కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఆరోపిస్తుండగా, కాంగ్రెస్ మాత్రం ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ జరుగుతోందని చెబుతోంది.



లడక్‌లో కొత్త జిల్లా ఏర్పాటును పురస్కరించుకుని గురువారం చాంగ్‌థంగ్‌లో జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా

# ధాన్యం కొనుగోళ్లకు 22 వేల కోట్లు

>> లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లు సిద్ధంగా ఉంచిందని తెలిపారు. ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 4 వేల 800 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 45 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందన్నారు. తీవ్ర ఎండల కారణంగా కూడా కొంతమంది హమాలీలు పగటి వేళల్లో పనిచేయలేక పోతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రవాణా సమస్య పరిష్కారం కోసం వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ప్రధానంగా ధాన్యం రవాణాకే వినియోగించా లని నిర్ణయించినట్లు తెలిపారు. ఇసుక, సిమెంట్ తదితర రవాణాపై నియంత్రణ విధించి ధాన్యం తరలింపుకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి భారీగా పెరగడంతో నిల్వ సమస్య కూడా ఎదురవుతోందన్నారు. అదనపు గోదాములు, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తేమ శాతం మించకుండా, శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. క్వింటాల్‌కు ఐదు, ఆరు కిలోల వరకు అక్రమ కటింగ్‌లు చేస్తున్నారనే సమాచారం వస్తోందని, ఇది ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ప్రభుత్వం కొంత నష్టాన్ని భరించేందుకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందించడంతో రైతులు రికార్డు స్థాయిలో వరి సాగు చేశారని తెలిపారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోళ్లు కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. "చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు, కటింగ్‌లు అసలు ఉండకూడదని ఇప్పటికే కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా రైస్ మిల్లర్లు అక్రమంగా కటింగ్‌లు చేస్తే ఆయా రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో 309 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు 94,961 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా, అందులో 80 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి గోదాములకు తరలించినట్లు వివరించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తైన రెండు రోజులలోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 167 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని స్పష్టం చేశారు. జిల్లాలో పంట కోత ఆలస్యంగా ప్రారంభమైనందున ప్రస్తుతం కొనుగోళ్లు వేగం పుంజుకుంటున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల పరిమాణం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగు తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు విధించకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్న ను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చివరి గింజ వరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్, కొత్తగూడెం ఎస్పీ బి. రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొన్నారు.

# బెయిల్‌పై నేడు నిర్ణయం

>> ఆమె వయస్సు 15 ఏళ్ళుగా చూపారని కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. చార్జ్‌షీట్‌లోపాన్‌కార్డులో జిహెచ్ఎం సర్టిఫికెట్‌లో ఎందుకు ఒకే తరహాలో పుట్టినతేది ఒకేలా లేవని హైకోర్టు ప్రశ్నించింది దీనిని పోలీసులు పరిశీలించి ఆమె ఖచ్చితమైన పుట్టిన తేది ధృవీకరణ చేయాలని కోరింది. భగీరథ్‌పై ఈ కేసులో పోక్సో చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు కోర్టు ముందు వినిపించారు. యూనియన్ గవర్నమెంట్ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి అని ఆయన కోరారు. ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు శుక్రవారంనాడు మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. బండి భగీరథ్‌ను క్రిమినల్ అంటూ బాధితురాలి తరుపు న్యాయవాది సంబోధించగా ఆయన తరుపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇరువురి మధ్య వాగ్వాదంతో న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నేర నిరుపణ అయ్యే వరకు క్రిమినల్ అనకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాదులకు సంయమనం లేకపోతే పిటిషన్‌ను మరో బెంచ్‌కు మార్చుకోవాలని న్యాయమూర్తి అసహనంతో అన్నారు. న్యాయవాదులు సంయమనంతో వ్యవహరించాలని హైకోర్టు మందలించింది. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో, కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులోని సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనతో తన అభిప్రాయం కోర్టు ముందు పెట్టారు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ ప్రతిసారి నిందితుడు కేంద్రమంత్రి కుమారుడని సంబోధించాల్సి అవసరంలేదని పిపికి సూచించింది. భగీరథ్ తరపున మరో అడ్వకేట్ తన వాదనలు వినిపిస్తూ "యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు వివరించారు. బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి అని ఆయన కోరారు." ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో, ఆ వారం లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు బండి భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు.

# 30 నుంచి 'సర్'

>> తెలిపింది. ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్ హవేలి, డామన్ డయ్యూలో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ జరగనుంది. అయితే, మంచు ప్రభావిత ప్రాంతాలైన హిమాచల్‌ప్రదేశ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. ఎస్ఐఆర్ మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) ఇంటింటికీ వెళ్లి దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. వీరికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ)లు సహకరించనున్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా బిఎల్ఏలను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది. కాగా, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25 నుంచి జులై 24 వరకు బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లనున్నారు. జులై 31న ముసాయిదా జాబితా విడుదల చేసి, అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఝార్ఖండ్, మేఘాలయ రాష్ట్రాల్లో జూన్ 30 నుంచి జులై 29 వరకు పరిశీలన కొనసాగుతుంది. అక్టోబర్ 7న తుది ఓటరు జాబితా విడుదల కానుంది. అలాగే, నాగాలాండ్‌లో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు పరిశీలన ఉండగా, నవంబర్ 22న తుది జాబితా విడుదల చేస్తారు. త్రిపురలో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు ఇంటింటి పరిశీలన జరగనుంది. డిసెంబర్ 23న తుది జాబితా విడుదల చేయనున్నారు. ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాల్లో జూన్ 28 వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. జులై 5న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 4 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అనంతరం తుది జాబితా సెప్టెంబర్ 6న విడుదల కానుంది. అదేవిధంగా, దాద్రా నగర్ హవేలీ, దామన్ అండ్ దయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల్లో జూన్ 4 నుంచి జూలై 3 వరకు బీఎల్ఓలు ఇంటింటిటిక వెళ్లి పరిశీలించున్నారు. అనంతరం ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 11న ప్రకటించనున్నారు. ఉత్తరాఖండ్‌లో జూన్ 8 నుంచి జులై 7 వరకు బిఎల్ఓల పరిశీలన జరిగి, సెప్టెంబర్ 15న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు.

## కేరళం సిఎంగా ఎంపికైన విడి సతీశన్‌కు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 14:** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ...విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని అన్నారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్‌గ్రీన్ ఉన్నత స్థాయి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 14:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ శుక్రవారం సమావేశమయ్యారు. నందినగర్‌లో జరిగిన ఈ భేటీలో పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. గతంలో పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవమున్న కేటీఆర్ ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై... తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయి. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

## ఢిల్లీలోని ఎర్రకోట పేలుళ్ల కేసులో ఎన్ఐఏ ఛార్జిషీట్

### 7,500 పేజీలతో అభియోగపత్రం కోర్టుకు దాఖలు

**న్యూఢిల్లీ, మే 14:** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు సహా 10 మందికి అల్‌ఖైదాతో సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ తేల్చింది. ఈ ఘటనలో జిహాదీ కుట్రకోణం ఉన్నదని, అందుకు సంబంధించి ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు లభ్యమైనట్లు పేర్కొంది. ఈ మేరకు పటియాలా హౌజ్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో 7,500 పేజీల ఛార్జిషీటు సమర్పించింది. సాంకేతిక, ఫోరెన్సిక్ దర్యాప్తు ద్వారా భారీ జిహాదీ కుట్రను ఛేదించినట్లు ఎన్ఐఏ పేర్కొంది. ఆరు రాష్ట్రాల్లో సమగ్ర దర్యాప్తు జరిగిందని, 588 మంది సాక్ష్యాలు నమోదుచేసామని, 395కిపైగా కీలక పత్రాలు, 200కిపైగా వాంగ్మూలాలు సేకరించినట్లు అభియోగ పత్రంలో వివరించింది. కొందరు వైద్య వృత్తిలో ఉన్న నిందితులు కూడా ఏక్యూఐఎస్/ఏజీయూహెచ్ సిద్ధాంతాలకు ప్రభావితమై ఈ దాడికి పాల్పడ్డారని తెలిపింది. 2022లో శ్రీనగర్‌లో జరిగిన రహస్య సమావేశంలో తుర్కియే మార్గంగా ఆఫ్ఘనిస్థాన్‌కు వెళ్లే ప్రయత్నం విఫలమైన తర్వాత నిందితులు ఏజీయూహెచ్ ఇంటిరిమ్ పేరిట సంస్థను పునర్వ్యవస్థీకరించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పడిన భారత ప్రభుత్వాన్ని కూల్చివేసి షరియా పాలనను అమలు చేయాలనే లక్ష్యంతో "ఆపరేషన్ హెవెన్లీ హింద్" ప్రారంభించినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కొత్త సభ్యులను చేర్చుకోవడం, జిహాదీ భావజాలాన్ని వ్యాప్తి చేయడం, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేయడం, మార్కెట్లో లభించే రసాయనాలతో భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వివిధ రకాల ఐఈడీలను తయారు చేసి పరీక్షించామని ఎన్ఐఏ వెల్లడించింది. పేలుడులో ఉపయోగించిన ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ) పేలుడు పదార్థాన్ని నిందితులే రహస్యంగా రసాయనాలు సమకూర్చుకుని తయారు చేసారని తేలింది. ఢిల్లీ పోలీసుల నుంచి కేసును స్వీకరించిన ఎన్ఐఏ, డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ ద్వారా మృతుడు నిందితుడు ఉమర్ ఉన్ నబీగా గుర్తించినట్లు తెలిపింది ఘటన స్థలంతో పాటు ఫరీదాబాద్‌లోని అల్‌ఫలా యూనివర్సిటీ, జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలు, వాయిస్ విశ్లేషణకు పంపించినట్లు వెల్లడించింది. నిందితులు అక్రమంగా ఏకే47 రైఫిల్, క్రింకోవ్ రైఫిల్, దేశీయ తుపాకుల సహా సమకూర్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది జమ్ముకశ్మీర్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునేందుకు రాకెట్, డ్రోన్‌లకు అమర్చే ఐఈడీలపై కూడా ప్రయోగాలు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. ప్రత్యేక ఎంఎంఒ అనోడ్, ఎలక్ట్రిక్ సర్క్యూట్లు, స్విచ్‌లు వంటి ప్రయోగశాల పరికరాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాల్లో కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా కార్యకలాపాలను విస్తరించాలని నిందితులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ, ఈ ఉగ్ర



మాడ్యూల్‌ను ఛేదించడం ద్వారా ఆ కుట్రను భగ్నం చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించిన ఎన్ఐఏ, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొంది.

## దేశ ఆర్థిక బలోపేతానికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### ప్రధాని 10 సూచనలతో కూడిన కరపత్రాన్ని విడుదల చేసిన బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక బలోపేతం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. దేశ ఆర్థిక స్వావలంబన, జాతీయ ప్రయోజనాలు, ప్రజల భాగస్వామ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించిన సప్త సూత్రాలు అంశంపై గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రధాని నరేంద్ర మోడీ దేశ



ప్రజలకు సూచించిన 10 ప్రధాన సూచనలతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, స్వదేశీ వినియోగం, ఇంధన పొదుపు, దేశీయ పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అంశాలు భారత ఆర్థిక భవిష్యత్తును మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థిక నిపుణులు ప్రొఫెసర్ డా. కృష్ణారెడ్డి 'సప్త సూత్రాలు'పై సమగ్ర విశ్లేషణ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సవాళ్లు, విదేశీ మారక ద్రవ్య వినియోగం వంటి అంశాలను గణాంకాలతో వివరించారు. స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, ఇంధన వినియోగంలో బాధ్యత, వంటనూనె వినియోగ నియంత్రణ, సహజ వ్యవసాయం, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి అంశాలు దేశ ఆర్థిక స్థిరత్వానికి ఎలా దోహదపడతాయో విశ్లేషించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించిన సప్త సూత్రాలు కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో అమలు కావాల్సిన జాతీయ ఆర్థిక ఉద్యమమని ప్రొఫెసర్ కృష్ణారెడి పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ బిజెపి రాష్ట్ర పదాధికారులు, అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులు పాల్గొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కేవలం ప్రభుత్వం మాత్రమే కాకుండా, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎన్. రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. దేశభక్తి అంటే కేవలం ప్రాణ త్యాగం మాత్రమే కాదని, జీవించి ఉండి దేశానికి సేవ చేయడం కూడా గొప్ప దేశభక్తి అని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సూచనలు రాజకీయ అంశాలు కావని, అవి దేశ ఆర్థిక భద్రత మరియు సామాజిక బాధ్యతలకు సంబంధించినవని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా 'లోకల్ ఫర్ వోకల్' భావన తో స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా దేశీయ ఆర్థికవ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు.

## కదులుతున్న బస్సులో ఢిల్లీలో మరో గ్యాంగ్‌రేప్

**న్యూఢిల్లీ, మే 14:** దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న స్లీపర్ బస్సులో 30 ఏళ్ల మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధిత మహిళ మంగోల్‌పురిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటుంబంతో కలిసి పిటాంపురాలో నివసిస్తోంది. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. సరస్వతి విహార్ ప్రాంతంలోని బీబ్లాక్ బస్ స్టాండ్ సమీపంలో ఆమె ఈరిక్షా నుంచి దిగిన తర్వాత నడుచుకుంటూ వెళ్తుండగా ఓ స్లీపర్ బస్సు అక్కడ ఆగింది. ఆ సమయంలో బస్సు దగ్గర ఉన్న వ్యక్తిని సమయం ఎంత అయ్యిందని మహిళ అడగగా, దగ్గరకు రావాలని సంకేతం ఇచ్చిన అతడు ఆమెను బలవంతంగా బస్సులోకి లాగినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం బస్సులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కదులుతున్న వాహనంలోనే ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.

బస్సు నాంగ్లోయి వైపు కొన్ని కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత నాంగ్లోయి మెట్రో స్టేషన్ సమీపంలో మహిళను దించేసి నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడైంది. బాధితురాలు వెంటనే పోలీసులను సంప్రదించగా వారు సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రిలో బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గ్యాంగ్‌రేప్‌తో పాటు, సంబంధిత మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బీహార్ రిజిస్ట్రేషన్ కలిగిన స్లీపర్ బస్సును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్సు ప్రయాణించిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఫోరెన్సిక్ నిపుణులు బస్సులో నుంచి ఆధారాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. బస్సు కిటికీలకు కర్టెన్లు ఉండటంతో బయటివారికి లోపల ఏం జరుగుతుందో కనిపించలేదని పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా గుర్తించిన డ్రైవర్ ఉమేష్, కండక్టర్ రమేంద్రను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## మిషన్ మోడ్‌లో కొనుగోళ్లు.. రంగంలోకి మంత్రుల బృందం

### స్వయంగా కొనుగోలు కేంద్రాల సందర్శన

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** యాసంగిలో పండించిన పంటను అమ్ముకోవడానికి రైతన్న పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. తెలంగాణలో ఈ సారి వరి, మొక్కజొన్న దిగుబడి భారీగా రావడంతో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, లారీల కొరత, హమాలీల సమస్యలతో అన్నదాతలు రోడ్లపైకి వస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ అప్రమత్తమైంది. వారం, పది రోజుల్లో మిషన్ మోడ్‌లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. కేవలం ఆదేశాలతోనే సరిపెట్టకుండా మంత్రుల బృందం నేరుగా రంగంలోకి దిగింది. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించారు.



వార్త

క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండు వైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.

-ఇ. గిబ్బన్

# ప్రకృతితో చెలగాటాలొద్దు!

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపారప్రాణనష్టం, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకుదారి తీస్తున్నాయి. రుతుపవనాల గమనాన్ని కూడా మార్చివేస్తున్నాయి. అకాలవర్షాలతో జరుగుతున్న నష్టం అంతాఇంతా కాదు. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సాలకు, విపత్తులకు కారణాలవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానువుడి మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని, ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే హెచ్చరిస్తున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లుపొడవడం దురదృష్టకరం. ప్రైవేట్ వ్యక్తులే కాదు అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులను, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయ గలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో దశాబ్ద కాలంలో భారత జనాభా 150కోట్లకు పైగా చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టంచేసింది. ఇప్పటికే భారత్‌లో వేలాది ఎకరాల అడవీ భూములు మైదానాలుగా మారిపోయాయి. భారత్‌లో ప్రతిరోజూ దాదాపు మూడు వందల ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయలో ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. అడవులు తగ్గిపోయి ఆహారం దొరకక వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ కాగితాలు మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతున్నాయి. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నాయి. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. ఈ ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంత నష్టంచేకూరుస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారవర్గాలు విఫలమవుతున్నాయనేచెప్పొచ్చు. చట్టాలుచేసినా, నిబంధనలు విధించినా, ప్లాస్టిక్ వాడకాన్ని ఏమాత్రం అడ్డుకోలేకపోతున్నారు. ఇక పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతుంది. ఎన్ని చట్టాలుచేసినా, మరెందరిపై జరిమానా విధించినా, పెరుగుతున్న వాహనాల సంఖ్య రెట్టింపుస్థాయిలో కాలుష్యాన్ని పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు తదితరవన్నీ కలిసి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలాంటి ప్రదేశాల్లో వాయుకాలుష్యం ప్రమాదకరస్థాయికి చేరుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. కాలుష్యాన్ని నియంత్రించలేక ఏకంగా ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన దురదృష్టపు పరిస్థితులు నెలకొంటున్నాయి. నీటికాలుష్యం పరిస్థితి అదుపు తప్పుతున్నది. పెరుగుతున్న మురికివాడల నుంచి వెలువడుతున్న కలుషిత నీరు అంచలంచెలుగా నదుల్లోకి చేరుకొని పెద్దపెద్ద నదులనే మురికి కూపాలుగా మారుస్తున్నాయి. ఇలాంటి కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిప్రపంచంలోని తీరప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకుగురయ్యే ప్రమాదం ఉందని ఏనాటినుంచో పర్యావరణ శాస్త్రవేత్తలుహెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక సముద్రాల్లో చేస్తున్న ప్రయోగాలు కూడా ప్రకృతిని దెబ్బతీస్తున్నాయి. ఇలాప్రకృతితో మనిషి ఆటలాడుకుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగాస్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియడం లేదు. కురిస్తే అదే ప్రాంతంలో కుంభవృష్టికురవడం ఇటీవల పెరిగిపోతున్నది. అకాల వర్షాల గురించి చెప్పక్కర్లేదు. పిడుగులు, గాలివానలతో అతలాకుతలం చేస్తున్నాయి. ఇవి పోనుఉపద్రవాలు విరుచుకుపడుతున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఉపద్రవాలతో ప్రాణాలు పోగొట్టుకుంటుంటే కోట్ల సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, హైతి, న్యూజిలాండ్, నేపాల్ లాంటి ఎన్నోదేశాల్లో గత రెండు, మూడేళ్లుగా వచ్చిన భూకంపాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. సిరియాలో ఆ మధ్య వచ్చిన భూకంపం కారణంగా దాదాపుతొమ్మిది వేల మంది అసువులు బాశారు. ఆ తర్వాత మొరోకోలో వచ్చిన ప్రకంపనాలు దాదాపు నాలుగువేల మంది జీవితాలను సమాధి చేశాయి. పశ్చిమ ఆఫ్ఘనిస్థాన్‌లోవచ్చిన భూప్రకంపనాలు విలయమే సృష్టించాయని చెప్పొచ్చు. మనదేశానికి సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూప్రకంపనాల వార్తలు వింటూనేఉన్నాం. చెన్నై, ముంబాయి, కోల్‌కతా, పూణె, ఢిల్లీ లాంటి దాదాపు డెబ్భైనగరాలకు ఈ ప్రమాదం పొంచి ఉన్నట్లు శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇక వరదలు, తుఫాన్లు, అకాల వర్షాలతో వ్యవ సాయరంగం కుదేలైపోతున్నది. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ప్రధానంగా ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో విలయాలు తప్పవు.



ధైర్యంతో అన్ని సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోరాదు.

జి. ఇలియెట్



సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.

సోక్రటీస్

## ప్రజావాక్కు



### తమిళనాడు ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకోవాలి

తనకు ఓఎస్డీగా నియమించుకున్న ఒక జ్యోతిష్కుడిని , ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి అని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈరోజు ఓఎస్డీ పదవినుండి , ఆజ్యోతిష్కుడిని తొలగించి, వేరొకరిని నియమించి నేను లౌకిక పాలననుఅందిస్తానని చెప్పడం అభినందనీయం. ఎందుకంటే జ్యోతిష్యం అశాస్త్రీయం. జ్యోతిష్యం చెప్పే వాడిని ప్రోత్సహించడం, అందునా తనకుఓఎస్డీగా నియమించుకోవడం కరెక్టు కాదు అనివెంటనే తొలగించాడు. ఐతే మన రాష్ట్రంలో అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితి ఉంది. అశాస్త్రీయ బోధనలు చేసే చాగంటి కోటేశ్వరరావును సలహాదారునిగా పెట్టుకుంది. రాష్ట్రంలో దొంగబాబాలు ప్రభుత్వభూములు ఆక్రమించి ఆశ్రమాలపేరుతో మోసం చేస్తుంటే, తన్నితరిమేసి భూములను స్వాధీనం చేసుకోవలసిన ప్రభుత్వం, వారికి సాష్టాంగపడడంసిగ్గుచేటు. ముఖ్యమంత్రులందరూ విజయ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి

ఏపిలో ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో కొన్ని జిల్లాల్లో రాష్ట్ర స్థాయిలో చూస్తే ఉత్తీర్ణత శాతం తక్కువ ఉన్న చోట సంబంధిత కుటుంబాల్లో పిల్లల వెనుకబాటు ఉపాధ్యాయుల బోధనతృప్తిగా లేదనేఅభిప్రాయం ఉండొచ్చు. గానీ ఇది ఏ బడిఅయినా , తరగతి ఏదైనా విద్యార్థి వార్షిక ఫలితం కేవలం బోధనలోపం ఒక్కటే సరైన కారణంకాదు. అదేదిశల్లో బోధన విషయంలో కూడా ఉపాధ్యాయుల సంఖ్య, ఇతర వనరులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ సరిగాఉన్న పుడువిద్యార్థి బాధ్యత, పట్టుదల, తల్లితండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటేనే ఉత్సాహంతో చదువు సాగి జిల్లాస్థాయిలో కూడా ఉత్తీర్ణత ఆ బడి విద్యార్థులు పొందవచ్చు

- బొల్లోజు మేఘానాదం విశాఖపట్నం

### చిరు వ్యాపారులను బతకనిద్దాం

ప్రధాన రోడ్లకు ఇరువైపున బ్రతుకుబండి పేరుతో జీవనం సాగించేచిరువ్యాపారులను కూడా సమాజంలో బ్రతకనిద్దాం. కొందరు అధికారులు ఇలాంటి వ్యాపారులను లక్ష్యంచేసుకుని నాణ్యతపేరుతో, ధరల పేరుతో ఇతరుల వ్యాపారంసజావుగా సాగడంకొరకు తరచూఇబ్బంది పెడుతూబ్రతుకుబండినిసాగనియ్యకుండా చేస్తున్నఘటనలెన్నో ఉన్నాయి. స్వేచ్ఛగాబ్రతుకుతున్నావాళ్లను బ్రతకనీద్దాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### మానవాళికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్

ఆధునిక ప్రపంచంలోప్లాస్టిక్ వినియోగం అనివార్యమైనప్పటికీ, అది 'సూక్ష్మప్లాస్టిక్'రూపంలో మానవాళికి పెనుముప్పుగా మారింది. ఐదు మిల్లీమీటర్ల కంటే తక్కువ పరిమాణం ఉండే ఈకణాలు గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ఉత్పత్తిఅవుతుండగా, అందులో గణనీయమైన భాగం వ్యర్థాలుగా మారి పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాయి. ముఖ్యంగా భారతదేశంలో ప్లాస్టిక్ పునర్వినియోగం కేవలం 13 శాతంగానే ఉండటం ఆందోళనకరం. పెద్ద ప్లాస్టిక్ వస్తువులు ప్రకృతి ప్రభావంతో విచ్ఛిన్నమవ్వడం, కృత్రిమ వస్త్రాల వాడకం వంటి కారణాల వల్ల ఇవి వాతావరణంలో చేరుతున్నాయి. పరిశోధనల ప్రకారం, ఈ కణాలు మానవ రక్తం, ఊపిరితిత్తులు, మెదడులో కూడా కనిపిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నీట్‌ని నీట్‌గా నిర్వహించాలి

జాతీయ స్థాయిలో ఎంబీబీస్‌తో సహా మరో పది కోర్సుల్లో చేరేందుకు ప్రవేశార్హత నిర్ణయించే నీట్ యూజీ పరీక్ష ఈ సంవత్సరం పరీక్షా పత్రం లీక్ అయిన కారణంగా రద్దు కావడం అభిశంసనీయం. 23లక్షలమంది విద్యార్థులు రెండున్నరలక్షల సీట్లకోసం పోటీపడిన ఈపరీక్ష ఉన్నపళంగా రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడంవారికీ, వారి కుటుంబాలకూ ఆర్థికంగా, భావోద్వేగపరంగా ఎంతోభారం. దేశంలో వైద్య, ఇంజినీరింగ్ కోర్సులకు ఎంతో డిమాండ్. ఈపరిస్థితిని సొమ్ము చేసుకొనేలా ఇబ్బడిముబ్బడిగా కోచింగ్‌సెంటర్లు. విద్యార్థులపై తీవ్ర వత్తిడి, వారి కుటుంబాలకు ఆర్థిక భారం తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రాసిన పరీక్ష కూడా రద్దు కావడం చెప్పలేనంత నష్టం. ఒక్క లోపమూ లేకుండా ఒక్క అనుమానమూ రాని విధంగా పరీక్ష పక్కాగా నిర్వహించడం గొప్ప. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా పనిచేయాలి. నీట్‌ని నీట్‌గా నిర్వహించాలి.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### నీటి కుంటలు అవసరం

తెలంగాణా చరిత్రకంగా చూసిన తెలంగాణలో నీటి కుంటలు చెరవులతో నిండిఉంది. ఉమ్మడిరాష్ట్రంలో చెరువులు కుంటాలలోపూడికతీయక నానాటికి నీటినిల్వసామర్థ్యం తగ్గి బావి బోర్ల మీద ఆధారపడడం పెరిగింది. ఉపాధి హామీలో చిన్న నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణ, సంప్రదాయా చెరువులు కుంటలను పునరుద్ధరించి పూడిక తీసి ఆమట్టిని రైతులు పొలాలుచేలకలలోపోసుకోని ఉత్పత్తిని పెంచుకునే వీలుంటుంది.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'డెడికేటెడ్' నివేదికతో బిసిలకు న్యాయం జరిగేనా?

**డెడికేటెడ్ కమిషన్ సేకరించే డేటా, నివేదికలు, సిఫార్సులపై ప్రజలకు సామాజిక పర్యవేక్షణ హక్కుఉండాలి. కమిషన్ ప్రక్రియనుప్రజాస్వామ్య సోషల్ ఆడిటింగ్‌కు తెరవకపోతే, అది మళ్లీ పరిపాలనా గణాంకాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. సమాజం నుంచి వచ్చే విమర్శలు, అభ్యంతరాలు, ప్రత్యామ్నాయ గణాంకాలు, ఉపకులాల అనుభవాలు, తదితరం, ఇవన్నీ కమిషన్ అధ్యయనంలో భాగంకావాలి. లేదంటే కమిషన్‌లు ప్రజల జీవితాలను అధ్యయనం చేసే వేదికలుగా కాకుండా, ప్రభుత్వాలకు అవసరమైన నివేదికలు తయారు చేసే కార్యాలయాలుగానే మిగిలిపోతాయి. డెడికేటెడ్ కమిషన్ నిజంగా తన బాధ్యతను నిర్వర్తిస్తే అది కేవలం ఒక నివేదిక కాదు, చరిత్రపరంగా బయటకు నెట్టబడిన వర్గాలకు రాజకీయ స్వరం ఇచ్చే ప్రక్రియ అవుతుంది. లేదంటే అది మరో పరిపాలనా ప్రక్రియగానే మిగిలిపోతుంది.**

పాపని నాగరాజు

మన దేశంలో కుల వ్యవస్థ కేవలం ఒక సామాజిక విభజన కాదు, అది శతాబ్దాలుగా అధికారాన్ని, ఆస్తిని, విద్యను, అవకాశాలను కొద్ది వర్గాల చేతుల్లో కేంద్రీకరించిన నిర్మాణం. ఈనిర్మాణం వల్ల అనేక కులాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురయ్యాయి. ముఖ్యంగా బీసీలు కేవలం పేదరికానికే కాదు, అధికార నిర్మాణాల నుంచి వ్యవస్థీకృతంగా దూరం చేయబడటానికి కూడా గురయ్యారు. కుల వ్యవస్థలో కొన్ని వర్గాలకు పాలించే హక్కు దక్కగా, మరికొన్ని వర్గాలకు సేవ చేసే బాధ్యత మాత్రమే మిగిలింది. గ్రామ పాలన నుంచి శాసన వ్యవస్థ వరకు, విద్యాసంస్థల నుంచి ఉద్యోగ రంగాలవరకు సమాన అవకాశాలు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ వెనుకబాటుతనం వ్యక్తిగత వైఫల్యం వల్ల కాదు, కుల ఆధిపత్యం చరిత్రపరంగా నిర్మించిన అసమాన వ్యవస్థ వల్ల ఏర్పడింది. అందుకే బీసీ రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం, కులగణన వంటి అంశాలు కేవలం ఎన్నికల నినాదాలు కాదు, అధికారంలో భాగస్వామ్యం కోసం జరుగుతున్న సామాజికరాజకీయ పోరాటాలుగా మారాయి. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం 'డెడికేటెడ్ కమిషన్' అనే అంశం ప్రాముఖ్యత పొందింది. సుప్రీంకోర్టు కూడా కేవలం జనాభా ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించకూడదని, రాజకీయంగా వెనుకబాటుతనంపై శాస్త్రీయ అధ్యయనం అవసరమని స్పష్టం చేసింది. 2010లో కె. కృష్ణమూర్తి కేసు, తరువాత వికాస్ కిషన్ రావ్ గవాలీ కేసుల్లో సుప్రీంకోర్టు స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల విషయంలో 'ట్రిపుల్ టెస్ట్' విధానాన్ని తప్పనిసరి చేసింది. రాజకీయ వెనుకబాటుతనంపై ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ ద్వారా ఎంపిరికల్ డేటా సేకరించడం, ఆ డేటా ఆధారంగా మాత్రమే రిజర్వేషన్లు నిర్ణయించడం, మొత్తం రిజర్వేషన్ల సమతుల్యతను కాపాడడంవంటి నిబంధనలను కోర్టు స్పష్టం చేసింది. అంటే డెడికేటెడ్ కమిషన్ ఒకసాధారణ పరిపాలనా వ్యవస్థకాదు, అది రాజ్యాంగపరంగా అవసరమైన ప్రక్రియగా మారింది. ఈ కమిషన్ పని కేవలం ఎంత శాతం రిజర్వేషన్ ఇవ్వాలి?' అని చెప్పడం కాదు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జెడ్పీలు, కార్పొరేషన్లలో బీసీల అసలు ప్రాతినిధ్యం ఎంత ఉంది? అన్ని ఉపకులాలకు సమాన అవకాశాలు దక్కుతున్నాయా? లేక కొద్దివర్గాలకే అధికార భాగస్వామ్యం పరిమితమవుతోందా? అనే అంశాలను పరిశీలించాలి. అలాగే డెడికేటెడ్ కమిషన్ నేరుగా రిజర్వేషన్ శాతాన్ని ప్రకటించే సంస్థ కాదు. కానీ ఎంత శాతం రిజర్వేషన్‌కు శాస్త్రీయ, న్యాయపరమైన ఆధారం ఉందో ప్రభుత్వానికి సూచించే కీలక వ్యవస్థ. కమిషన్ ఇచ్చే ఎంపిరికల్ డేటా, రాజకీయ వెనుకబాటుతనం పై అధ్యయనాల ఆధారంగానే ప్రభుత్వం రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయిస్తుంది. తరువాత అది రాజ్యాంగబద్ధమా కాదా అనే అంశాన్ని న్యాయస్థానాలు పరిశీలిస్తాయి. అంటే ఈ కమిషన్ పని కేవలం సంఖ్యలు చెప్పడం కాదు, అధికార నిర్మాణంలో ఎవరు బయట ఉన్నారు? ఎందుకు బయట ఉన్నారు? అనే చారిత్రక ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం వెతకడం. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కులగణన, ఎంపిరికల్ డేటా రెండూ ఒకటి కావు. కులగణన జనాభా లెక్కలను తెలియజేస్తే, డెడికేటెడ్ కమిషన్ పరిశీలించాల్సింది రాజకీయ వెనుకబాటుతనం. అంటే జనాభాలో పెద్ద వాటా ఉన్న వర్గాలకు స్థానిక సంస్థల్లో, అధికార నిర్మాణాల్లో నిజంగా ఎంత ప్రాతినిధ్యం దక్కుతోంది? ఎంతమంది ఎన్నికైవస్తున్నారు? ఏ వర్గాలు నిరంతరం బయటే మిగిలిపోతున్నాయి? అనే వ్యత్యాసాన్ని అధ్యయనం చేయడమే కమిషన్ అసలు బాధ్యత.




ఎందుకంటే సంఖ్యల్లో ఎక్కువగా ఉండటం, అధికారంలో ఎక్కువగా ఉండటానికి సమానం కాదు. అనేక సందర్భాల్లో జనాభాలో పెద్ద వర్గాలే రాజకీయంగా అంచులకు నెట్టబడి ఉండవచ్చు. అలాగే బీసీ వర్గాల అంతర్గత అసమానతలను కూడా ఈ కమిషన్ లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. ఏబీసీడీ వర్గీకరణ ఉన్నప్పటికీ, రాజకీయ అధికారంలో మాత్రం కొన్ని నిర్దిష్టకులాలే ఆధిపత్యం కొనసాగిస్తున్నాయనే విమర్శ ఉంది. ఒకవైపు బీసీల పేరుతో రిజర్వేషన్లు కొనసాగుతున్నా, మరోవైపు కొన్ని ఉపకులాలు నిరంతరంరాజకీయ అవకాశా లకు దూరంగానే మిగిలిపోతున్నాయనే ప్రశ్నను డెడికేటెడ్ కమిషన్ నిజాయితీగా పరిశీలించాలి. కానీ వాస్తవ పరిస్థితిని చూస్తే అనేక రాష్ట్రాల్లో ఈ కమిషన్లు ప్రజాస్వామ్య అధ్య యన వేదికల్లా కాకుండా, ప్రభుత్వ నిర్ణయాలకు న్యాయ బద్ధత కల్పించే పరిపాలనా యంత్రాంగాలుగా మారుతున్నా యనే విమర్శ ఉంది. పూర్తిస్థాయి కులగణన లేకుండా అంచ నాలతో నివేదికలు ఇవ్వడం, ప్రజలకుపూర్తి డేటా అందు బాటులో లేకపోవడం, ఉపకులాల మధ్య అసమానతలను లోతుగా పరిశీలించకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నా యి. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు దిశగా ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ కూడా ఇదే చర్చకు కేంద్రంగా మారింది. ఈ నిర్ణయం బీసీ వర్గాల్లో ఆశలు పెంచినా, కమిషన్ ఉపయోగించిన గణాంకాలు ఎంత పారదర్శకంగా ఉన్నాయి? పూర్తి స్థాయి కులగణన లేకుండా రాజకీయ వెనుకబాటుతనాన్ని ఎలా అంచనా వేశారు? అన్ని బీసీ ఉపకులాల పరిస్థితిని సమానంగా పరిశీలించారా? వంటి ప్రశ్నలు వచ్చాయి. తరువాత ఈ అంశం న్యాయపరమైన వివాదాలకు వెళ్లడం ద్వారా ఒక విషయం స్పష్టమైంది అదేమంటే, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదు, దానికి విశ్వసనీయ గణాంకాలు, పారదర్శక అధ్యయనం, ప్రజల విశ్వాసం అవసరం. తెలంగాణ అనుభవం మరో ప్రమాదకరమైన వాస్తవాన్ని కూడా చూపించింది. ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కమిషన్లముందు అనేక బీసీసంఘాలు, కొంత మేధావివర్గం స్వతంత్ర సామాజిక దృక్పథంతో కాకుండా, పాలకులు కోరుకున్న పరిమితుల లోనే వ్యవహరించాయనే విమర్శలు వచ్చాయి. కొంత నాయకత్వం సమాజం వాస్తవ సమస్యలను బలంగా ముందుకు తేవడం కన్నా, అధికారవ్యవస్థకు అనుకూలంగా వ్యవహరించిందనే అసంతృప్తి బీసీ వర్గాల్లో వ్యక్తమైంది. తెలంగాణ అనుభవం మరో రాజకీయ వాస్తవాన్ని కూడా గుర్తు చేస్తోంది. పాలకవర్గాలు కేవలం కమిషన్ల ద్వారా మాత్రమే కాదు, ఉద్యమ భాష, చర్చల దిశ, మేధావుల పాత్ర, సంఘాల ప్రాధాన్యతలను కూడా ప్రభావితం చేసే ప్రయత్నంచేస్తాయి. అనేక బీసీ సంఘాలు, మేధావులు, ఆలోచనాపరులు స్వతంత్ర సామాజిక ఒత్తిడిని నిర్మించేస్థానం నుంచి క్రమంగా ప్రభుత్వ అనుకూలచర్చల పరిధిలోకి వెళ్లిపోయారనే విమర్శలు కూడా వచ్చాయి. ఎక్కడ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలి? ఎక్కడ ప్రశ్నలను నియంత్రించాలి? ఎక్కడ ప్రజలను రోడ్లపైకి తీసుకురావాలి? ఎక్కడ చర్చలను పరిమితం చేయాలి? అనే అంశాల్లో అధికార రాజకీయాలు ఎలా పని చేస్తాయో తెలంగాణ అనుభవం ఒక గుణపాఠంలా నిలుస్తోంది. ఇదేపరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే బీసీ ఉద్యమాలు తమ స్వతంత్ర రాజకీయ దిశను కాపాడుకోవాలి. కమిషన్ పనితీరులో ప్రభుత్వ పారదర్శకత ఎంత ముఖ్యమో, బీసీసంఘాలు, మేధావుల నిబద్ధత కూడా అంతే ముఖ్యమైనది. డెడికేటెడ్ కమిషన్ సేకరించే డేటా, నివేదికలు, సిఫార్సులపై ప్రజలకు సామాజిక పర్యవేక్షణ హక్కుఉండాలి. కమిషన్ ప్రక్రియనుప్రజాస్వామ్య సోషల్ ఆడిటింగ్‌కు తెరవకపోతే, అది మళ్లీ పరిపాలనా గణాంకాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. సమాజం నుంచి వచ్చే విమర్శలు, అభ్యంతరాలు, ప్రత్యామ్నాయ గణాంకాలు, ఉపకులాల అనుభవాలు, తదితరం, ఇవన్నీ కమిషన్ అధ్యయనంలో భాగంకావాలి. లేదంటే కమిషన్‌లు ప్రజల జీవితాలను అధ్యయనం చేసే వేదికలుగా కాకుండా, ప్రభుత్వాలకు అవసరమైన నివేదికలు తయారు చేసే కార్యాలయాలుగానే మిగిలిపోతాయి. డెడికేటెడ్ కమిషన్ నిజంగా తన బాధ్యతను నిర్వర్తిస్తే అది కేవలం ఒక నివేదిక కాదు, చరిత్రపరంగా బయటకు నెట్టబడిన వర్గాలకు రాజకీయ స్వరం ఇచ్చే ప్రక్రియ అవుతుంది. లేదంటే అది మరో పరిపాలనా ప్రక్రియగానే మిగిలిపోతుంది. ●

# సినిమా గ్లామర్‌తో పొలిటికల్ పవర్!

మర్రాపు వసుంధరా దేవి

దక్షిణాది రాజకీయ యవనికపై ఒక కొత్త ధ్రువతార ఉదయించింది. వెండితెరపై దళపతిగా కోట్లాది మంది నీరాజనాలు అందుకున్న విజయ్, ఇప్పుడు తమిళగ వెట్రి కళగం (టివికె) సారథిగా చెన్నై సెయింట్ జార్జ్ కోటపై జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం భారత రాజకీయ చరిత్రలో మరో అద్భుత ఘట్టం. గ్లామర్ గెలుపుగా మారడం దక్షిణాదికి కొత్త కాకపోయినా, ఈ ప్రయాణం వెనుక ఉన్న పోరాటం, గతంలో సినీ రంగం నుండి వచ్చి విఫలమైన నేతల నీడలు, మారుతున్న వారసత్వ రాజకీయాల పోకడలు ఈ విజయాన్ని మరింత అర్థవంతం చేస్తున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రను ఒకసారి సింహావలోకనం చేస్తే, 1977లో ఎంజీఆర్ సాధించిన విజయం ఒక పాఠం వంటిది. అప్పట్లో ఎంజీఆర్ నేతృత్వంలోని ఏఐఏడీఎంకే.. సీపీఎం, ఏఐఫ్బీ, ముస్లిం లీగ్ వంటి పార్టీలతో ప్రీపోల్ అలయన్స్ (ముందస్తుపొత్తు) కుదుర్చుకొని ఎన్నికల బరిలోకి దిగింది. ఆనాడు ఎంజీఆర్ చరిష్మా ఎంతలా పనిచేసిందంటే, పొత్తులు ఉన్నప్పటికీ ఏఐఏడీఎంకే ఒంటరిగానే స్పష్టమైన మెజారిటీ సాధించి స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సరిగ్గా ఐదు దశాబ్దాల తర్వాత, నేడు విజయ్ కూడా అదే తరహాలో సినిమా గ్లామర్తో రాజకీయాల్లోకి వచ్చినా, ప్రయాణం కొంత భిన్నంగా సాగింది. ఒంటరిగా పోటీచేసి ఎన్నికల్లో మెజారిటీకి కూతవేటుదూరంలో నిలబడిన విజయ్ మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకేలతో పోస్ట్‌పోల్ అలయన్స్ (ఎన్నికల తర్వాతి పొత్తు) కుదుర్చుకొని అధికార పగ్గాలు చేపట్టడం ఒక సరికొత్త వ్యూహం. నిజానికి తమిళనాడు రాజకీయాల్లో సినీ ప్రభావం ఎంజీఆర్‌తోనే మొదలుకా లేదు. ఆయనకు ప్రత్యర్థి అయిన కరుణానిధి సైతం అద్భుతమైన సినీ రచయితగా, తన కలం బలంతోనే ద్రవిడ సిద్ధాంతాలనుప్రజల్లోకి తీసుకెళ్లి ఐదుసార్లు ముఖ్యమంత్రి కాగలిగారు. దక్షిణాదిలో సినీ గ్లామర్ పొలిటికల్ పవర్గా మారిన తీరుకుఎన్టీఆర్ ప్రస్థానం ఒకనిలువుటద్దం. 1982లో తెలుగుదేశం ఆవిర్భావం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనేకాక జాతీయ స్థాయిలోనూ భూకంపం సృష్టించింది. కేవలం 9నెలల్లోనే అధికారంలోకి రావడమే కాకుండా, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతూ నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక భూమిక పోషించి, ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమై కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలవని ఎన్టీఆర్ నిరూపించారు. ఆయన చూపిన ఆ బాటలోనే తర్వాతి కాలంలో జయలలిత సైతం జాతీయ రాజకీయాలను శాసించగలిగారు. జయలలిత కేవలం నటిగా మాత్రమే కాకుండా, ఆంగ్ల భాషపై తనకున్న అద్భుతమైన పట్టుతో రాజ్యసభలో చేసిన ప్రసంగాలు జాతీయ నాయకులను సైతం ఆకర్షించేవి. ఈగ్లామర్ రాజకీయం కేవలం నటులకే పరిమితం కాలేదు. సినీ రంగానికున్న ప్రజాకర్షణ శక్తిని గుర్తించి, రాజకీయ వారసులు సైతం వెండితెరనే తమతొలి వేదికగా ఎంచుకుంటున్నారు. కర్ణాటక మాజీ ప్రధాని దేవెగౌడ మనుమడు నిఖిల్ కుమారస్వామి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధిస్టాలిన్ వంటి వారు సినిమాలద్వారా ప్రజలకు చేరువయ్యే ప్రయత్నంచేయడం ఈగ్లామర్ ప్రభావానికి నిలువుటద్దం. అయితే, వెండితెర ఇమేజ్ ఉంటేచాలు అధికారం దక్కుతుందనేభ్రమను గతంలో అనేక ఉదాహరణలు పటాపంచలు చేశాయి. తమిళనాడులో విజయకాంత్, కమలహాసన్ వంటి వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు నేటికీ చర్చనీయాంశమే. ఈ వైఫల్యాల మధ్య జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కింగ్ మేకర్గా ఎదగడం, ఉపముఖ్యమంత్రి కావడం ఒక కొత్త మలుపు. మరోవైపు, కేరళలో సినీగ్లామర్ రాజకీయం ఇప్పటికీ ప్రభావం చూపకపోవడం గమనార్హం. అక్కడ ఓటర్లు సెలబ్రిటీల కంటే సిద్ధాంతాలకే పెద్దపీట వేస్తారు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే రాజకీయాల్లోకి సినీ గ్లామర్‌తోనే వచ్చినా, ప్రజాప్రయోజనాలకు చిత్తశుద్ధితో కృషిచేసిన వారుమాత్రమే నిలదొక్కుకుంటారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, జయలలిత వంటి వారు ప్రజాహితమైన పథకాలను రూపొందించి, రాజకీయ వ్యూహాలను వంటబట్టించుకున్నారు కాబట్టే పది కాలాలపాటు ప్రజాదరణ పొందగలిగారు. విజయ్ విజయం ఈ నేపథ్యాలన్నింటినీ దాటుకుని వచ్చింది. తన అభిమాన సంఘాలను ఒక క్రమశిక్షణ కలిగిన రాజకీయ దళంగా మార్చడం విజయ్ సాధించిన అతిపెద్ద విజయం. ●

# మన తెలుగు మనకే పరాయి అవుతోందా?

తిప్పర్తి శ్రీనివాస్

'దేశభాషలందు తెలుగు లెస్స' అని గర్వంగా చెప్పుకునే తెలుగు సమాజం నేడు ఒక చేదు నిజాన్ని ఎదుర్కొంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పదో తరగతి ఫలితాలు వెలువడిన ప్రతిసారి గణితం, సైన్స్ వంటి కఠినమైన సబ్జెక్టుల కంటే తెలుగులోనే ఎక్కువ మంది విద్యార్థులు విఫలమవుతున్న దృశ్యం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి తప్పిన విద్యార్థుల్లో దాదాపు 41.3 శాతం మంది కేవలం తెలుగులోనే తడబడ్డారంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతుంది. తెలంగాణలోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపించడం మరింత కలవరపెడుతోంది. ఇది కేవలం పరీక్షల మార్కుల సమస్యకాదు. ఇది ఒక భాష, ఒక సంస్కృతి, ఒక జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. మాతృభాషపై పిల్లలకు పట్టు తగ్గిపోవడం అంటే వారి ఆలోచనా విధానం, భావ వ్యక్తీకరణ, సంస్కృతి మూలాలపై ప్రభావం పడటమే. తెలుగు నేలపై తెలుగు భాషే క్రమంగా పరాయి అవుతుందా అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటి ఆంగ్ల మాధ్యమంపై పెరిగిన మోజు. నేటి తల్లిదండ్రుల్లో చాలామంది పిల్లల భవిష్యత్తు పూర్తిగా ఇంగ్లీష్‌పైనే ఆధారపడి ఉందని నమ్ముతున్నారు. అందుకే చిన్నప్పటి నుంచే పిల్లలను ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇంట్లో కూడా తెలుగుకు బదులుగా ఇంగ్లీష్ మాట్లాడాలని ప్రోత్సహించడం వల్ల పిల్లలకు మాతృభాషతో సహజ అనుబంధం తగ్గిపోతోంది. మరోవైపు విద్యావ్యవస్థలో కూడా తెలుగు బోధనకు ప్రాధాన్యం తగ్గుతోంది. అనేక పాఠశాలల్లో తెలుగును కేవలం పరీక్ష కోసం చదివే ఒక సబ్జెక్టుగా మాత్రమే చూస్తున్నారు. భాషపై ప్రేమ పెంచేలా బోధన జరగడం తగ్గిపోయింది. పద్యాల సౌందర్యం, కథలలోతు, తెలుగు సాహిత్యంలో ఉన్న మానవీయ విలువలు విద్యార్థుల మనసులను తాకే విధంగా బోధించే పరిస్థితులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. డిజిటల్ యుగం ప్రభావం కూడా ఈ పరిస్థితిని మరింత తీవ్రమైంది చేసింది. పిల్లలు ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, వెబ్ సిరీస్‌లు, వీడియో గేమ్‌లతో గడుపుతున్నారు. అందులో ఎక్కువ కంటెంట్ ఇంగ్లీష్ లేదా హిందీలో ఉండటంతో తెలుగు చదివే అలవాటు తగ్గిపోతోంది. ఒకప్పుడుఇంటింటా కనిపించిన చందమామ, బాలమిత్ర, వార పత్రికలు ఇప్పుడు పిల్లల చేతుల్లో కనిపించడం అరుదైపోయింది. మాతృభాష అనేది కేవలం సంభాషణ సాధనం



మాత్రమే కాదు. అది మన సంస్కృతి, భావోద్వేగాలు, సంప్రదాయాల నిలయం. పిల్లలు తమ మాతృభాషలో బలంగా ఉంటేనే ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత మెరుగుపడుతుందని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు కూడా తమ మాతృభాషలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. జపాన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు తమ భాషలద్వారానే సాంకేతికంగా ఎదిగాయి. కానీ మనం మాత్రం ఇంగ్లీష్ లేకుంటే భవిష్యత్తే లేదన్న భావనలో మునిగిపోతున్నాం. తెలుగు భాషపై పట్టు కోల్పోతున్న విద్యార్థులు క్రమంగా తెలుగు సాహిత్యం నుంచి కూడా దూరమవుతున్నారు. గురజాడ, శ్రీశ్రీ, విశ్వనాథ, సినారె, దాశరథి వంటి మహాకవుల ఆలోచనలను ఆస్వాదించే అవకాశాన్ని కోల్పోతున్నారు. భాషను కోల్పోవడం అంటే చరిత్రను, మూలాలను కోల్పోవడమే. ఈ పరిస్థితిని మార్చడం అసాధ్యం కాదు. కానీ అందుకు కుటుంబం, పాఠశాల, ప్రభుత్వం, సమాజం అందరూ కలిసి కృషి చేయాలి. మార్పుమొదట ఇంటినుంచే ప్రారంభంకావాలి. తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులోమాట్లాడాలి. తెలుగు కథలు చెప్పాలి. పుస్తకాలు చదివే అలవాటు పెంచాలి. భాషపై గౌరవం ఇంట్లోనే పెరుగుతుంది. పాఠశాలల్లో తెలుగు బోధనను మరింత ఆసక్తికరంగా మార్చాలి. కథా వేదికలు, పద్యపఠనాలు, వ్యాసరచన పోటీలు, నాటికలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో భాషపై మమకారం పెంచాలి. తెలుగు ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం కూడా మాతృభాష పరిరక్షణపై స్పష్టమైన విధానాలు అమలు చేయాలి. తెలుగు భాషలో డిజిటల్ కంటెంట్‌ను పెంచాలి. పిల్లలకు నచ్చే యానిమేషన్లు, యాప్‌లు, ఈబుక్స్, ఆడియో కథలు అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రజా వ్యవహారాల్లో తెలుగుకు మరింత ప్రాధాన్యం కల్పించాలి. మీడియా కూడా తన బాధ్యతను గుర్తించాలి. టెలివిజన్, యూట్యూబ్, సోషల్ మీడియా వేదికల్లో నాణ్యమైన తెలుగు కార్యక్రమాలు పెరగాలి. తెలుగు మాట్లాడితే వెనుకబాటు అనే అపోహను సమాజం పూర్తిగా తొలగించాలి. ఒక భాష చనిపోవడం అంటే కేవలం కొన్ని పదాలు మాయమవడం కాదు. ఒక జాతి ఆత్మ నిశ్శబ్దం కావడం. తెలుగు వంటి సుసంపన్నమైన భాష మన చేతుల్లోనే బలహీనపడటం నిజంగా బాధాకరం. పదో తరగతి ఫలితాలు మనకు ఒక హెచ్చరిక గంటలా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మేలుకోకపోతే రాబోయే తరాలు తెలుగును కేవలం ఒక సబ్జెక్టుగా మాత్రమే చూసే ప్రమాదం ఉంది. ఇంగ్లీష్‌ను నేర్చుకోవడం అవసరం. కానీ మాతృభాషను మరిచిపోవడం అభివృద్ధి కాదు. ప్రపంచంతో పోటీ పడే సామర్థ్యాన్ని ఇంగ్లీష్ ఇస్తే, మనసుకు మూలాలు ఇచ్చేది మాత్రం మాతృభాషే. తెలుగు బతికితేనే తెలుగు సంస్కృతి బతుకుతుంది. తెలుగు నిలిస్తేనే మన ఆత్మగౌరవం నిలుస్తుంది. అందుకే ప్రతి తెలుగు మనిషి తనలో తాను ఒక ప్రశ్న వేసుకోవాలి. మన పిల్లలకు ఆస్తులు ఇస్తున్నాం, కానీ అమ్మ భాషను అందిస్తున్నామా?అని. ●

# కేరళం సిఎం పదవికి సతీశన్ ఎంపిక



## రేస్ నుంచి తప్పుకొన్న వేణుగోపాల్, రమేశ్ చెన్నితల

## పది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు తెర

## సోమవారం ప్రమాణం చేసే అవకాశం

**తిరువనంతపురం,మే 14:** కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ కూటమికి 102 సీట్లు వచ్చినా కాంగ్రెస్‌లో ఉన్న లుకలుకల కారణంగా సిఎం పదవి ఎంపికలో విపరీత జాప్యం జరిగింది. అయినా కూడా సిఎం పదవి చివరకు సతీశన్‌నే వరించింది. హైకమాండ్ విడి సతీశన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. దీనితో ఇప్పటివరకూ రేసులో ఉన్న రమేష్ చెన్నితల, ఎఐసిసి నాయకుడు కెసివేణుగోపాల్‌లు తప్పుకున్నట్లయింది. కేరళ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రతిపక్ష నేత విడి సతీశన్‌ను ఎంపిక చేస్తూ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు దీప్‌దాస్ మున్షీ, ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ ఈ ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో కేరళ కాంగ్రెస్‌లో ఒక తరం మారిపోయిందని, కొత్త శకం ఆరంభమైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సిఎం రేసులో ఉన్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా ఫోన్ చేసి, సతీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో కూడా రాహుల్ సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించిన సతీశన్‌కు సిఎం బాధ్యతలను ఆ పార్టీ అధిష్ఠానం అప్పగించింది. సతీశన్ వయసు 61 ఏళ్లు. ఆయనేమీ సడెన్‌గా సిఎం కాలేదు. దశాబ్దాలుగా తన స్థానాన్ని రాజకీయాల్లో సుస్థిరం చేసుకున్నారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమతో ఆయన రాణించారు. ఎర్నాకుళం జిల్లా నెట్టూరులో ఆయన మే 31, 1964లో జన్మించారు. ఆయన తండ్రి పేరు వదసెరి దమోదర మీనన్. ఆయన ఫారెస్ట్ శాఖ అధికారి. తల్లి పేరు విలాసిని అమ్మ. సతీశన్ న్యాయ విద్యలో పట్టభద్రుడు. రాజకీయాల్లోకి రాకముందే ఆయన అడ్వకేట్ గా చేశారు. విద్యార్థి దశలోనే సతీశన్ రాజకీయాలు చేశారు. తీవరలోని ఎస్‌హెచ్ కాలేజీలో యూనియన్ ఆఫీస్‌బేరర్‌గా చేశారు. ఎంజీ యూనివర్సిటీ యూనియన్‌కు చైర్మెన్‌అయ్యారు. ఎన్‌ఎస్‌యూఐలో జాతీయ కార్యదర్శిగా చేశారు. పారవూరు నియోజకవర్గం సతీశన్‌కు కంచుకోట. రెండు దశాబ్దాలుగా ఆయన ఆ స్థానం నుంచి గెలుపొందుతున్నారు. 1996లో తొలిసారి ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ సమయంలో ఆ నియోకవర్గం సీపీఐ పట్టున్న సీటుగా భావించారు. సీపీఐ అభ్యర్థి రాజు చేతిలో వెయ్యి ఓట్లతో ఆయన పరాజయం చవిచూశారు. ఓడినా ఆయన ఆ నియోజకవర్గాన్ని వీడలేదు. పట్టుదలతో తన కేడర్‌ను నిర్మించుకున్నారు.

ఇక ఆ తర్వాత పారవూరు ఏకంగా కాంగ్రెస్ సీటుగా మారిపోయింది. 2001, 2006, 2011, 2016, 2021, 2026 ఎన్నికల్లో ఆయన ఆ స్థానం నుంచే ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటల వల్ల సతీశన్ చాన్నాళ్లు సైలెంట్‌గా ఉండిపోయారు. కేఎస్‌యూ ప్రెసిడెంట్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, కెపిసిసి ప్రెసిడెంట్ అయ్యే సందర్భాలను అనేక సార్లు ఆయన మిస్సయ్యారు. కేరళ అసెంబ్లీలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అండ్ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా చేశారు. తమిళనాడుకు ఏఐసీసీ సెక్రటరీ ఇంచార్జ్‌గా చేశారు. కెపిసిసి వైస్ ప్రెసిడెంట్‌గా అయిదేళ్లు చేశారు. 2016 ఊమెన్ చాందీ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ విప్‌గా చేశారు. 2021లో యుడిఎఫ్ దారుణంగా ఓడింది. ఆ సమయంలో సీనియర్ నేతలను పక్కనపెట్టి, సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా ప్రకటించారు. కేరళ రాజకీయాల్లో ప్రత్యేక పేరును సతీశన్ సంపాదించారు. ఊమెన్ చాందీ సర్కారు ఉన్న సమయంలో అసెంబ్లీలో సతీశన్ 33 వాయిదా తీర్మానాలను ఇచ్చారు. ఇది కేరళ అసెంబ్లీలో ఓ రికార్డు క్రియేట్ చేసింది. ఫ్యాక్షన్ రాజకీయాలకు భిన్నంగా తన ఎన్నికల ప్రచారాల్లో సమస్యలపై ఫోకస్ పెట్టి ప్రసంగించారు.

వాస్తవాలతో ప్రత్యర్థులపై ఆయన దాడి చేసేవారు. యుడిఎఫ్‌లో ఉన్న లుకలుకలను రూపుమాపే ప్రయత్నం చేశారు. బలమైన పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు సతీశన్ చాలా సమర్థుడిగా ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు భావించారు. ప్రతిపక్ష నేతగా యుడిఎఫ్‌కు గట్టి పోటీ ఇచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యుడిఎఫ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కేరళలో 20 స్థానాల్లో యుడిఎఫ్ 18 స్థానాలు గెలుచుకున్నది. 2025 లోకల్ బాడీ ఎన్నికల్లో కూటమి విజయంలోనూ సతీశన్ కీలక పాత్ర పోషించారు. తిరక్కకర, పుత్తుపల్లి, నీలాంబుర్ ఉప ఎన్నికల్లో యుడిఎఫ్ విజయం కోసం శ్రమించారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం, సిఎం విజయన్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నించారు. కేరళ ప్రతిపక్ష నేతగా సతీశన్ అంచలంచెలుగా ఎదిగారు. పార్టీ పరంగా రాజకీయమైన కఠిన నిర్ణయాలను ఆయనే తీసుకున్నారు. సతీశన్ కెరీర్‌లో కొన్ని వివాదాలు కూడా ఉన్నాయి. పునర్జని ప్రాజెక్టు కోసం ఆయన విదేశీ నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2018 వరద బాధితుల కోసం ఆ నిధులను సేకరించారు. చూరల్‌మాలా ముండక్కై డిజాస్టర్ బాధితుల కోసం సేకరించిన డబ్బును ఎన్నికల ప్రచారం కోసం వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి.



# దౌత్యబంధం కంటే వ్యాపార ప్రయోజనాలే ముఖ్యం

## ట్రంప్ వెంట దిగ్గజ బిజినెస్ టైకూన్లు చైనాకు...

**వాషింగ్టన్, మే 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈసారి ఆయన పర్యటన కేవలం రాజకీయ, దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల అధినేతలు ఆయనతో కలిసి చైనా బాట పట్టడం ఈ పర్యటన ప్రాధాన్యాన్ని అమాంతం పెంచేసింది. టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్, ఎన్విడియా అధినేత జెన్సెన్ హువాంగ్, యాపిల్ చీఫ్ టిమ్ కుక్, బ్లాక్‌రాక్ సిఇఒ లారీ ఫింక్‌తో పాటు మెటా, వీసా, గోల్డ్‌మన్ శాక్స్, బోయింగ్, మాస్టర్‌కార్డ్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు ట్రంప్ వెంట ఉన్నారు. ఇంత భారీ వ్యాపార సామ్రాజ్యం ట్రంప్‌తో కలిసి చైనాకు ఎందుకు వెళ్లిందనే ప్రశ్నకు, ఉద్రిక్తంగా ఉన్న అమెరికాచైనా సంబంధాల మధ్య దాగివున్న ఆర్థిక ప్రయోజనాలే సమాధానంగా కనిపిస్తోంది. 2017లో ట్రంప్ జరిపిన చైనా పర్యటనకు, ఇప్పటి పర్యటనకు స్పష్టమైన తేడా ఉంది. గతంలో భారీ వాణిజ్య ఒప్పందాలు, ఆర్భాటాలపై దృష్టి సారించగా, ఈసారి పర్యటన మరింతగా నిర్దేశిత లక్ష్యంతో సాగుతోంది.

ట్రంప్‌తో వెళ్లిన అనేక కంపెనీలు చైనాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వ్యాపార, నియంత్రణ సమస్యలను పరిష్కరించు కోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ పర్యటనలో పాల్గొనే కంపెనీలకు సాధించగల స్పష్టమైన అభ్యర్థన ఉండాలనేది ఒక నిబంధనగా పెట్టారు. పర్యటన సమయంలో లేదా ఆ తర్వాతైనా ఒక కచ్చితమైన ఒప్పందం, రెగ్యులేటరీ ఆమోదం లేదా వ్యాపార పురోగతి సాధించాలనే లక్ష్యంతోనే ఈ సిఇఒలు వచ్చారు. ఇది కేవలం మొక్కుబడి పర్యటన కాదని, బీజింగ్ నుంచి ఏదో ఒకటి సాధించుకోవడానికే వచ్చారని స్పష్టమవుతోంది. ఈ బృందంలో ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్ ఉండటం అత్యంత కీలకం. అమెరికా ఎగుమతి నియంత్రణల కారణంగా తమ అధునాతన హెచ్200 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) చిప్‌లను చైనా మార్కెట్లో విక్రయించడానికి ఎన్విడియా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎఐ మార్కెట్ అయిన చైనాలో అనుమతులు సంపాదించడం ఎన్విడియా దీర్ఘకాలిక ప్రగతికి అత్యంత ముఖ్యం. మరోవైపు టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్‌కు కూడా చైనాలో భారీ వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్ అయిన చైనాలో తమ ఫుల్ సెల్ఫ్‌డ్రైవింగ్ (ఎఫ్ఎస్‌డీ) వ్యవస్థ వినియోగాన్ని విస్తరించేందుకు టెస్లా అనుమతుల కోసం ఎదురుచూస్తోంది.

సోలార్ పరికరాల కోసం కూడా టెస్లా చైనా సరఫరాదారులపై ఆధారపడి ఉంది. యాపిల్ సిఇఒ టిమ్ కుక్‌కు చైనా ఒక కీలకమైన తయారీ కేంద్రం, అదే సమయంలో అతిపెద్ద వినియోగదారుల మార్కెట్. మెటా సంస్థ కూడా ఒక ఏఐ స్టార్టప్ కొనుగోలు విషయంలో చైనా అధికారుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఆర్థిక దిగ్గజాలైన వీసా, మాస్టర్‌కార్డ్ సంస్థలు చైనాలో కఠినంగా నియంత్రించబడిన చెల్లింపుల మార్కెట్లో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవాలని ఆశిస్తున్నాయి. గోల్డ్‌మన్ శాక్స్, సిటీ గ్రూప్ వంటి వాల్‌స్ట్రీట్ సంస్థలు కూడా చైనా ఆర్థిక మార్కెట్లలోకి మరింత లోతుగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పర్యటన కేవలం కార్పొరేట్ కంపెనీలకే కాదు, ట్రంప్‌కు కూడా రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో అవసరం.

## యుడిఎఫ్ గెలుపు లక్షలాది పార్టీ కేడర్ విజయం

### సిఎం ఎంపిక ప్రకటన వెనువెంటనే సతీశన్ స్పందన

**తిరువనంతపురం,మే 14:** కేరళం 13వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసిన విడి సతీశన్ తొలిస్పందనలోనే అందరినీ ఆకట్టుకున్నారు. యుడిఎఫ్ సాధించిన భారీ విజయం ఏ ఒక్క వ్యక్తిదో కాదని, ఇది టీమ్ యుడిఎఫ్, లక్షలాది మంది పార్టీ కార్యకర్తల విజయమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవిపై కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు అధిష్ఠానం తెరదించిన కొన్ని గంటల తర్వాత సతీశన్ మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ నాకు భారీ బాధ్యతను అప్పగించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి నా హృదయ పూర్వక కృతజ్ఞతలని ఆయన తెలిపారు. పార్టీలో ఐక్యతను చాటేలా, యుడిఎఫ్ గెలుపునకు ప్రధాన కారకులు కెసి వేణుగోపాల్, రమేష్ చెన్నితల అని పేర్కొన్నారు. చెన్నితలను నానాయకుడు అని అభివర్ణిస్తూ, ఆయనతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌తో కలిసి పనిచేస్తానని చెప్పారు. ఒక్క వ్యక్తి ఏమీ చేయలేడు అని నొక్కి చెప్పిన సతీశన్, కేరళ పాలన కోసం అందరినీ కలుపుకొనిపోయే విస్తృత బృందాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మనం భారీ సవాళ్లను ఎదుర్కొంటున్నాం. నూతన కేరళ నిర్మాణానికి ప్రజల సహాయ సహకారాలు కావాలి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎంపికలో జరిగిన జాప్యంపై స్పందిస్తూ, ప్రతి ఎమ్మెల్యే, సీనియర్ నేతతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని చెప్పిన సతీశన్ మంత్రివర్గ కూర్పు, ప్రమాణస్వీకార తేదీపై మిత్రపక్షాలతో చర్చించాక పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని, గవర్నర్‌తో సంప్రదించి ప్రమాణస్వీకార తేదీని ఖరారు చేస్తామని సతీశన్ వివరించారు.

# కేరళం సిఎం ఎంపికపై రమేష్ చెన్నితల అసంతృప్తి



## కేబినెట్‌లో చేరకూడదని నిర్ణయం

**తిరువనంతపురం, మే 14:** కేరళం సిఎంగా విడి సతీశన్ ఎంపికపై ముందునుంచి రేసులో ఉన్న సీనియర్‌నేత రమేష్ చెన్నితల తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఆయన అనుయాయులు చెపుతున్నారు. సిఎం పదవి కోసం పోటీపడ్డ అభ్యర్థుల్లో ఆయన కూడా ఒకరు. తనకు కాకుండా సతీషన్‌ను సిఎంగా ఎంపిక చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిఎం ఎంపికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీయే నేరుగా రమేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. అయినప్పటికీ రమేష్ తన అసంతృప్తిని బయటపెట్టారు. తాజా సమాచారం ప్రకారం ఆయన పార్టీ లెజిస్లేటివ్ మీటింగ్‌కు హాజరుకావడం లేదు. క్యాబినెట్‌లో కూడా చేరకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. సీనియారిటీకి పార్టీలో ప్రాధాన్యం లేదని ఆయన ఆవేదన చెందుతున్నట్లు ప్రచారం. ఆయన సన్నిహితులు మాత్రం రమేష్ ఎలాంటి అసంతృప్తికి లోనవడం లేదని చెబుతున్నారు. ఆయన హైకమాండ్ వద్ద ఎలాంటి అసంతృప్తి వ్యక్తం చేయలేదని అంటున్నారు. కేరళలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి ముందుగా లెజిస్లేటివ్ పార్టీ నేతను ఎన్నుకుంటారు. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం ఎప్పుడు కొలువుదీరేది తెలుస్తుంది. కేరళ సిఎం ఎంపిక విషయంలో కాంగ్రెస్ అధిష్టానం తర్జనభర్జనలు పడింది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కలిసి అనేక చర్చల అనంతరం సీఎంను ఎంపిక చేశారు. 140 అసెంబ్లీ సీట్లున్న కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమికి 102 సీట్లు దక్కాయి. అందులో కాంగ్రెస్ పార్టీకి 63 సీట్లు దక్కాయి.

# వాన్స్ కోసం ట్రంప్ రహస్య లేఖ?



**వాషింగ్టన్, మే 14:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించి ఓ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. విదేశీ పర్యటనలకు వెళ్లే ప్రతిసారీ.. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కోసం ఆయన ఒక రహస్య లెటర్ రాసి ఉంచుతారట. ఈ విషయాన్ని వైట్‌హౌస్ అధికారి సెబాస్టియన్ గోర్కా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గోర్కా పేర్కొన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. ట్రంప్ విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు రిజల్యూట్ డెస్క్‌లో ఉపాధ్యక్షుడు వాన్స్ కోసం సీక్రెట్ లెటర్ ఉంచుతారని గోర్కా పేర్కొన్నారు. ఆ పర్యటనలో తనకు ఎద్దైనా జరిగితే.. దేశాన్ని ముందుకు నడిపించేందుకు అవసరమైన సమగ్ర సూచనలను అందులో వెల్లడిస్తారన్నారు. ట్రంప్ చైనా పర్యటన నేపథ్యంలో విదేశీ శక్తులు ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే, గోర్కా వీటిని కొట్టిపడేశారు. వారు ట్రంప్‌ను ఏదైనా చేస్తారనే భయం తనకు లేదని, ఆయన చాలా సురక్షితంగా ఉన్నారన్నారు.

ఇదిలా ఉండగా.. ట్రంప్‌పై ఇప్పటికే అనేకసార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. 2024 పెన్సిల్వేనియాలోని ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ప్రసంగిస్తుండగా.. ఓ యువకుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి ఓ తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా.. ఓ దుండగుడు ఫెన్సింగ్ వద్ద తుపాకీతో వచ్చాడు. భద్రతా బలగాలు దీన్ని గుర్తించి అతడిపై కాల్పులు జరిపారు. ఇటీవలే వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటన నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సహా కీలక నేతలు తృటిలో తప్పించుకున్నారు.

## తమిళనాడు ఉద్యోగులకు విజయ్‌సర్కార్ గుడ్‌న్యూస్

**చెన్నై, మే 14:** తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం గురువారం తీపికబురు చెప్పింది. వారి కరవు భత్యాన్ని (డిఎ) 2 శాతం పెంచుతూ నిర్ణయించింది. దీంతో డిఎ 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు డిఎను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన నేపథ్యంలో, అదే ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం తన ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ డిఎ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.1,230 కోట్ల అదనపు భారం పడనుందని అధికారులు అంచనా వేశారు. అయినప్పటికీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల నుంచి ఇది కొంత ఉపశమనం కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. పెంచిన డీఏ, బకాయిల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం త్వరలో పూర్తిస్థాయి ఉత్తర్వులు జారీ చేయనుంది.

# కలవరపెడుతోన్న హాంటా వైరస్

**శాంటియాగో, మే 14:** క్రూజ్ నౌక ఎంవి హాండియస్‌లోని ప్రయాణికులు హంటావైరస్ బారిన పడటంతో ఇటీవల యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ఈ వైరస్ కారణంగా మరణాల రేటు కూడా అధికంగా ఉండటం భయాందోళనలు రేకెత్తించింది. ఈ వైరస్‌కు వ్యాక్సిన్ కూడా లేకపోవడంతో వ్యాప్తిని కట్టడి చేసే చికిత్సపై శాస్త్రవేత్తలు పరిశోధనలు ప్రారంభించారు. అయితే, హంటాకు దశాబ్దం క్రితమే వ్యాక్సిన్ రావాల్సి ఉండగా.. నిధుల కొరతతో నాటి ప్రయత్నాలు ఆగిపోయినట్లు తెలిసింది. ఈ మేరకు వ్యాక్సిన్ ప్రయోగాల్లో భాగమైన చిలీ శాస్త్రవేత్తలు అంతర్జాతీయ మీడియాతో నాటి తమ అనుభవాలను పంచుకున్నారు.

చిలీలోని ఓ యూనివర్సిటీలో వైరాలజీ శాస్త్రవేత్త మరియా జోస్ బరియా నేతృత్వంలోని బృందం హంటా వైరస్‌పై ప్రయోగాలు చేపట్టింది. ముఖ్యంగా మనుషుల నుంచి మనుషులకు సోకే ఆండిస్ అనే రకం హంటా వైరస్‌ను ఎదుర్కొనే యాంటీబాడీ సామర్థ్యాలపై ఈ శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. ఈ క్రమంలోనే 2016లో వీరు తమ ప్రయోగాల్లో కీలక ముందడుగు సాధించారు. జంతువులపై ఈ యాంటీబాడీలను పరీక్షించగా అవి సత్ఫలితాలనిచ్చాయి. తర్వాత మనుషులపై ప్రయోగాల కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా

### టీకాకు నిధుల తంటా

ముందుకెళ్లలేకపోయామని శాస్త్రవేత్త మరియా జోస్ గుర్తుచేసుకున్నారు. హ్యూమన్ ట్రయల్స్ కోసం దాదాపు 7 మిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు ఆమె తెలిపారు. నిధుల కోసం ఎన్నో అంతర్జాతీయ సంస్థలను సంప్రదించామని తెలిపారు. ఈ క్రమంలోనే కొవిడ్ మహమ్మారి వచ్చి తమ ప్రయత్నాలకు ఆటంకం కలిగించిందని పేర్కొన్నారు. ఒకవేళ తక్షణమే నిధులు అందినా.. వ్యాక్సిన్ ప్రయోగాలు పూర్తయ్యేందుకు కనీసం 12 నుంచి 24 నెలల సమయం పడుతుందని

# తమిళనాట రెబెల్స్‌కు ముందున్న కష్టకాలం

## మరో ఏడుగురికోసం సంప్రదింపులు..

**చెన్నై, మే 14:** తమిళనాట రాజకీయాల్లో సంచలన ప్రకంపనలు సృష్టించిన అన్నా డిఎంకె రెబెల్స్‌కు ముందుముందు క్లిష్టపరిస్థితులు తప్పవని పళనిస్వామి వర్గం బాహాటంగానే విమర్శిస్తోంది. ప్రభుత్వం నిలబడినప్పటికీ, పార్టీ విప్‌ను ధిక్కరించిన రెబల్ ఎమ్మెల్యేల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వారి ముందు చట్టపరంగా, రాజకీయంగా ఐదు ప్రధాన అవకాశాలు, సవాళ్లు ఉన్నాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అన్నాడిఎంకే శాసనసభా పక్షంలోని 47 మంది సభ్యులలో మూడింట రెండొంతుల మంది (32 మంది) ఏకమైతేనే చీలికకు చట్టబద్ధత లభిస్తుంది. ప్రస్తుతం రెబల్స్ సంఖ్య 25 మాత్రమే. ఇపిఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే వారందరిపై అనర్హత వేటు పడే ప్రమాదం ఉంది. అనర్హత నుంచి తప్పించుకోవాలంటే రెబల్ వర్గానికి మరో ఏడుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. మ్యాజిక్ 32 సంఖ్యను చేరుకుంటే, వారు తమను తాము అసలైన అన్నాడిఎంకేగా ప్రకటించుకోవచ్చు లేదా మరో పార్టీలో విలీనం కావచ్చు. ఒకవేళ 25 మందిపై అనర్హత వేటు పడితే ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరుగుతాయి. ఇది ముఖ్యమంత్రి విజయ్‌కు తన బలాన్ని 118కి పెంచుకోవడానికి ఒక అవకాశం. అదే సమయంలో ఇపిఎస్, డిఎంకేలకు ఇది పుంజుకోవడానికి మరో మార్గం. అనర్హత వేటు కోసం ఎదురుచూడకుండా, రెబల్ ఎమ్మెల్యేలు స్వయంగా రాజీనామా చేసి టివికెలో చేరి ఆ పార్టీ గుర్తుపై పోటీ చేయవచ్చు. అధికార పార్టీ అండదండలతో ఇది వారికి లాభించవచ్చు. అనర్హత వేటు పడితే రెబల్స్ కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ చాలా కఠినంగా ఉండటంతో, కోర్టుల జోక్యం పరిమితంగానే ఉంటుంది. అవసరమైన సంఖ్యాబలం లేకుండా కేవలం సిద్ధాంతపరమైన విభేదాల పేరుతో ఉపశమనం పొందడం దాదాపు అసాధ్యం. దీంతో రెబల్స్ భవిష్యత్తు ప్రస్తుతం కత్తి మీద సాములా మారింది.

# సంక్షిప్తంగా..

## చార్‌ధామ్ యాత్రలో అనారోగ్యంతో 38 మంది మృతి

**డెహ్రాడూన్, మే 14:** ఉత్తరాఖండ్‌లో ఛార్‌ధామ్ యాత్ర ప్రారంభించి 26 రోజులు అవుతోంది. అయితే ఇప్పటికే ఆ యాత్రకు బయలుదేరిన భక్తుల్లో 38 మంది మృతిచెందినట్లు తెలిసింది. వివిధ రకాల ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆ మరణాలు సంభవించాయని ఉత్తరాఖండ్ అధికారులు చెప్పారు. ఏప్రిల్ 19వ తేదీన ఛార్‌ధామ్ యాత్ర మొదలైంది. ఆ రోజున గంగోత్రి, యమునోత్రి ఆలయాలను ఓపెన్ చేశారు. ఆ తర్వాత ఏప్రిల్ 22, 23 తేదీల్లో కేదార్‌నాథ్, బద్రీనాథ్ టెంపుల్స్ తెరిచారు. కేవలం కేదార్‌నాథ్‌లోనే అత్యధికంగా 21 మంది ప్రాణాలు విడిచినట్లు స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ తన నివేదికలో పేర్కొన్నది. ఇక బద్రీనాథ్‌లో ఏడుమంది మరణించినట్లు తెలిసింది. గంగోత్రి, యమునోత్రిలో అయిదేసి మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు.

## నల్లకోటుతో న్యాయవాదిగా కోర్టుకు వచ్చిన మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మే 14:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేడు కోల్‌కతా హైకోర్టులో విచారణకు హాజరయ్యారు. న్యాయవాదిగా నల్ల కోటు ధరించి ఆమె కోర్టుకు వచ్చారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై దాఖలైన కేసు విచారణ కోసం ఆమె నేడు కోర్టుకు హాజరయ్యారు. 15 ఏళ్ల టిఎంసి పాలన ముగిసిన తర్వాత జరిగినదాడులు, రాజకీయ ప్రతీకార చర్యలపై వస్తున్న ఆరోపణలను ఎదుర్కోవడానికి ఆమె స్వయంగా రంగంలోకి దిగడం విశేషం. సీనియర్ నేత కళ్యాణ్ బెనర్జీ కుమారుడు శీర్షణ్య బందోపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా ఈ విచారణ జరుగుతోంది. న్యాయం, రాజ్యాంగ విలువల కోసం తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని నిరూపించడా నికి మమత ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

## రైలులో మహిళా చిరువ్యాపారిపై సిబ్బంది దౌర్జన్యం

**ముంబయి, మే 14:** రైలులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలైన చిరు వ్యాపారిపై రైల్వే సిబ్బంది దౌరన్యాన్ని చూపిస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. రియా ఘోష్ అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఈ క్లిప్‌లో ఓ వృద్ధురాలు రైలు కంపార్ట్‌మెంట్‌లో చేతులు జోడించి నిస్సహాయంగా నేలపై కూర్చొని ఉండటం కనిపించింది. రైల్వే సిబ్బంది ఆమెతో దురుసుగా ప్రవర్తించగా, సిబ్బంది ఒకరు ఆమెను తోసి పడేయడం, మరో సందర్భంలో ఆమె చీరను పట్టుకుని లాగడం వీడియోలో కనబడుతోంది. ఈ వేధింపులకు అసలు కారణం ఏమిటనేది ఇంకా తెలియరాలేదు. వృద్ధురాలు అంతటి క్షోభ అనుభవిస్తున్నా చుట్టూ ఉన్న ప్రయాణికులు మౌనంగా చూస్తూ ఉండిపోవడం వీడియోలో స్పష్టంగా ఉంది.

## శబరిమల కేసు విచారణ పూర్తి, తీర్పు వాయిదా

**న్యూఢిల్లీ, మే 14:** శబరిమల ఆలయంతో సహా వివిధ మతపరమైన ప్రదేశాల్లో మహిళల పట్ల వివక్ష, మతస్వేచ్ఛపై దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు వాయిదావేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును 16రోజులపాటు విచారణ జరిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు సి.ఎస్. వైద్యనాథన్, అభిషేక్ సింఘ్వి, ముకుల్ రోహత్గీ, ఇందిరా జైసింగ్‌ల వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. విచారణకు ముందు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం వయస్సున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని సమర్థించాలని కేంద్రం లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేసింది.

## అమెరికాలో పెరిగిపోతున్న శాండ్‌విచ్ జనరేషన్

**వాషింగ్టన్, మే 14:** అమెరికాలో లక్షలాది మంది తీవ్రమైన ఆర్థిక, మానసిక, వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటూ, మరోవైపు పిల్లల ఆలనాపాలనలో మునిగిపోవడంతో వారి జీవితాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. శాండ్‌విచ్ జనరేషన్‌గా పిలుస్తున్న ఈ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల అమెరికా సెనేట్ కమిటీ ఆన్ ఏజింగ్ ప్రత్యేక విచారణ చేపట్టింది. వీరికి ఫెడరల్ ప్రభుత్వం నుంచి మరింత మద్దతు అవసరమని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. సెనేట్ కమిటీ చైర్మన్ రిక్ స్కాట్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 11 మిలియన్ల మంది అమెరికన్లు వృద్ధ తల్లిదండ్రులు, పిల్లల బాధ్యతలతో సతమతమవుతున్నారని తెలిపారు. వీరిలో ప్రతి ఐదుగురిలో ఒకరు తమ ఉద్యోగ వేళలు తగ్గించుకోవడం లేదా పూర్తిగా మానేయడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్‌చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యంకు నియామకపత్రాన్ని అందజేస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

## బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి శ్రీధర్‌బాబు

### ప్రతి గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం : మంత్రి కొండా సురేఖ

### రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడిగా బసవరాజు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), మే 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బ్రాహ్మణుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ వసంత విహార్‌లో బాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో వారు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ నూతన చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యంలతో వారు ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సమాజంలోని అన్నివర్గాల మాదిరిగానే బ్రాహ్మణుల్లో కూడా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని, అలాంటి నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపడుతోందన్నారు. అర్చక వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల సంక్షేమం కోసం ప్రతిగ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం మూడు వందల కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని వెల్లడించారు. నూతన చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ అఖిల భారత సంయుక్త కార్యదర్శి సురేందర్‌జైన్, చిత్రంలో విహెచ్‌పి ప్రచార ప్రముఖ్ రావినూతల శశిధర్ తదితరులు

## రాష్ట్రంలో గోరక్ష చట్టం అమలు చేయాలి: విహెచ్‌పి

**హైదరాబాద్ (గన్‌ఫౌండ్రి), మే 14 ప్రభాతవార్త:** తెలంగాణలో గోరక్ష చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని విశ్వహిందు పరిషత్ గోరక్ష విభాగం డిమాండ్ చేసింది. గురువారం అబిడ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోరక్ష్ విభాగ్ అఖిల భారత సహకారదర్శి ఆకారపు కేశవరాజు, విశ్వహింద్ పరిషత్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ రావినూతల శశిధర్, తెలంగాణ అధ్యక్షులు నరిసింహమూర్తి, సహకారదర్శి జి.రమేష్, గోరక్ష విభాగ కన్వీనర్ సుబాష్‌చందర్‌లతో కలిసి విశ్వహింద్‌పరిషత్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌జైన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విశ్వహిందు పరిషత్ గోరక్ష ఆద్వర్యంలో గోవులను రక్షించేందుకుగాను అనేక ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో గోవులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి గోరక్ష చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బక్రీద్ పండుగ వచ్చిందంటే తెలంగాణలో గోవులను ఇష్టానుసారంగా వధించడం జరుగుతుందన్నారు. గోవుల రక్తం రహదారులపై పారుతుందన్నారు. ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. గోవధను ప్రభుత్వం నిలిపి వేసేలా చట్టం తీసుకురావాలని లేనిపక్షంలో గోరక్ష దళ్ రంగంలోకి దిగుతుందని హెచ్చరించారు. తామే గోవులను రక్షించుకుంటామన్నారు. గోవులను అడ్డు అదుపు లేకుండా గోవులను హత్య చేయడం జరుగుతుందన్నారు. గోవులను రక్షించేందుకు విహెచ్‌పి, భజరంగ్‌దళ్ ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి గోరక్ష చట్టం అమలు చేయాలని విన్నవించ నున్నట్లు చెప్పారు. డిఎంకె శాసనసభ్యులు ఉదయ్ స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యాలపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాధికారంలో బిసిల న్యాయమైన వాటాకు కేంద్రంపై ఒత్తిడి తెద్దాం

### ప్రభుత్వ సలహాదారుగా హనుమంతరావు బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం బిసిల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌లు పెంచడంతోపాటు పాలనలోవారి భాగస్వామ్యం పెంచడానికి కట్టుబడది ఉందని, బిసిలకు రాజ్యాధికారంలో న్యామైన వాటా కోసం కేంద్రంపై కలిసికట్టుగా ఒత్తిడి పెంచాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు నూతనంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ సలహాదారునిగా గురువారం వి.హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతరావుకు మాజీమంత్రి జానారెడ్డి బి బి సి సంక్షేమ, రవాణా మంత్రిపొన్నం ప్రభాకర్, రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి ఓ బి సి చైర్మన్ ఎమ్మెల్యే శంకరయ్య చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్ ఠాకూర్ తెలంగాణరాష్ట్ర చైర్మన్లు వైస్ ఛైర్మన్లు జిల్లా అధ్యక్షులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. విహెచ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆలోచనా విధానాలు అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలకు సమాన న్యాయం అందించేందుకు వనరులలోవాటా పొందేలా విధానాలు ఆచరిస్తోందని తెలిపారు.

# దయనీయంగా తెలంగాణ రైతుల పరిస్థితి

### రికార్డు స్థాయి కొనుగోళ్లు అంటూ అబద్ధపు ప్రచారం

### బిజెపి శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ మాత్రం రికార్డు స్థాయి కొనుగోళ్లు అంటూ అబద్ధపు ప్రచారంతో రైతులను మోసం చేస్తుందని బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నిర్మల్‌లో జరిగిన జరిగిన మహా ధర్నాలో ఆయన మాట్లుడుతూ, కోతకు వచ్చిన పంట రైతుల కళ్ల ముందే తడిసిపోతుంటే, గిట్టరబాటు ధర లేక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే, ప్రభుత్వం మాత్రం ప్రకటనలతో కాలక్షేపం చేస్తుందని ఆగ్రహం వక్తం చేశారు. ఆదిలాబాద్ నుంచి గద్వల్ వరకు, నిజామాబాద్ నుంచి మహబూబాబాద్ వరకు ఎక్కడ చూసిన రైతు గోసే వినిపిస్తుందని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. వరి విషయంలో 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉండగా, ప్రభుత్వం 90 లక్షల టన్నులు కొనుగోలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు కేవలం 17.28 లక్షల టన్నులే కొనడం సివిల్ సప్లై శాఖ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. మే నెల సగం గడిచినా 80శాతానికి పైగా కొనుగోళ్లు పెండింగ్‌లో ఉండటం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిస్తుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి తేమ శాతం పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొడుతున్నారని మండిపడ్డారు. మక్క జోన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని పేర్కొన్నారు. మద్దతు ధర రూ.2400 ఉండగా, మార్క్‌ఫెడ్ జాప్యం చేయడం వల్ల దళారులు రూ.1600 కే కొనుగోలు చేస్తూ రైతులను క్వింటాలుకు దాదాపు రూ.800 నష్టపోతున్నారని, పొద్దుతిరుగుడు సైతం అదే పరిస్థితి నెలకొందన్నారు. తూకం వేసిన ధాన్యం 15 రోజుల పాటు కేంద్రాల్లో నిల్వ ఉండే పరిస్థితికి ముగింపు పలకాలని, ధాన్యాం సేకరణ కేంద్రాల నుంచి గిడ్డంగుల వరకు జిపిఎస్ ఆధారిత పారదర్శక రవాణా వ్యవస్తను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుపై ఒక్క రూపాయ భారం పడకుండా గన్నీ బ్యాగులు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. రైతు కన్నీరు ఈ ప్రభుత్వాన్ని క్షమించదని, అన్నదాతను మోసం చేసిన ప్రతి నిర్ణయానికి ప్రభుత్వం ప్రజల ముందు సమాధానం చెప్పాలన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భారత్-ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్ ప్రారంభం

### విసి ఆచార్య అల్దాస్ జానయ్య

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** వాతావరణ అనుకూల వ్యవసాయం, డిజిటల్ వ్యవసాయ సాంకేతికతలు, ప్రిసిషన్ ఫార్మింగ్, నవకల్పనలు, స్థిరమైన వ్యవసాయ విధానాల్లో భారత్-ఆస్ట్రేలియా దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో భారత్-ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ప్రారంభమైంది. ఈ వేదిక ద్వారా రెండు దేశాల విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమలు, ఇతర భాగస్వామ్య సంస్థల మధ్య సంయుక్త పరిశోధనలు, పైలట్ ప్రాజెక్టులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్, చార్లెస్ స్టర్ట్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెంగళూరు సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్‌సిఓఈఎఫ్‌పీఓ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో 'ఇండియా-ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించాయి.

ఈ సదస్సులో భారత్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమల భాగస్వాములు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా భారత్‌లో ఆస్ట్రే లియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ మాట్లాడుతూ... రైతులు వాతావరణ మార్పుల ప్రభా వాన్ని ఎదుర్కొ నేందుకు భారత్-ఆస్ట్రేలియా భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ విశ్వవిద్యా లయ విసి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. విద్యా సంస్థలు, పరిశ్రమలు, సాంకేతిక నిపుణులు, రైతుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయ ప్రతినిధి డాక్టర్ విశాల్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో వాస్తవ సమస్యల పరిష్కారానికి అంతర్జాతీయ శాస్త్రీయ భాగస్వా మ్యాలు ఎంతో అవసరమన్నారు.

చార్లెస్ స్టర్ట్ యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్ మైకేల్ ఫ్రెండ్ మాట్లాడుతూ... పరిశోధన, ఆవిష్కరణల ద్వారా స్థిరమైన, వాతావరణ అనుకూల వ్యవసాయ అభివృద్ధికి ప్రపంచస్థాయి భాగస్వామ్యాలు అవసరమని పేర్కొన్నారు. భారత్-ఆస్ట్రేలియా స్మార్ట్ ఫార్మ్ నెట్‌వర్క్ ద్వారా స్మార్ట్ వ్యవసాయ సాంకేతికతలు, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలు, సంయుక్త ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం లభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# అన్ని రంగాల్లో బిసిలు ముందుకు రావాలి

### యుపిఎస్‌సితోపాటు ఐఎఎస్, ఐపిఎస్‌లు, డాక్టర్లు, అడ్వకేట్‌లు కావాలి

### బిసి గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన మంత్రులు పొన్నం, వాకిటి



గురువారం హైదరాబాద్‌లో బిసి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) నిర్వహించే పోటీ పరీక్షలతోపాటు అన్నింటిలోనూ బలహీన వర్గాల బిడ్డలు ఉండాలని, బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఐఎఎస్, ఐపిఎస్‌లుగా, డాక్టర్లు, అడ్వకేట్‌లు కావాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు లక్ష్యాన్ని నిర్దేశించేలా చేయాలని, భవిష్యత్ పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాల్లో ఉండేలా ప్రోత్స హిం చాలన్నారు. బంజా రా హిల్స్ కొమురంభీం భవన్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో బీసీ గురు కులాలు, సంక్షేమ హాస్టల్లో అత్యు త్తమ మార్కులు సాధిం చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. కార్య క్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహా దారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాల మయాదేవి, డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్ రావు, ఎం జెపి సెక్రటరీ సైదులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లా డుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బీసీ గురు కుల, హాస్టల్ విద్యార్థుల్లో ప్రతిభా పురస్కారాలు అందుకుం టున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ, పేద, వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కృషి, పట్టుదలతో అద్భుత ఫలితాలు సాధించడం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 508 మంది ప్రతిభా వంతులైన విద్యార్థులను సన్మానించడం జరుగుతోందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఈసారి పదవ తరగతి ఫలితాల్లో ఫలితాల్లో చరిత్ర సృష్టించా యన్నారు. వచ్చే సంవత్సరం మరిన్ని ర్యాంకులు సాధించాలన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు లేకుంటే నేను మంత్రి అయ్యేవాడిని కాదని, ఇటీవల విద్యా కమిషన్ కూడా విద్యార్థి సంఘాల ఎన్నికలు జరపాలని చెప్పిందన్నారు. ఎంజేపి సెక్రటరీ గురుకుల హాస్టల్ లో చదివారని, బుర్ర వెంకటేశం, సిఎస్ రామకృష్ణ హాస్టల్‌లలోనే చదివి వచ్చారన్నారు.

# వానకాలం సాగుకు విత్తనాలు సిద్ధం

### తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** వానాకాలం సాగు కోసం 4 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఆదేశించారు. వ్యవసాయ శాఖ నిర్దేశించిన వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించి ఆయా రకాలకు అవసరమైన విత్తనాలను ముందస్తుగా సమకూర్చుకోవాలని సూచించారు.

ఈ మేరకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో సాగయ్యే ప్రధాన పంటలైన వరి, కంది, పెసర, మినుము పచ్చిరొట్ట విత్తనాల సరఫరాపై విస్తృతంగా చర్చించారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా నేపథ్యంలో సుమారు 15 లక్షల క్వింటాళ్ల విత్తన అవసరమవుతాయని, ఇందులో 4 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందు బాటులో ఉంచనుంద న్నారు. అదే సమయంలో ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ ద్వారా తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు 1.04 లక్షల క్వింటాళ్ల ఇండెంట్ అందిన నేపథ్యంలో రానున్న రెండు వారాల్లో అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయిలో విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

అదేవిధంగా పంట మార్పిడిలో భాగంగా ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం పథకం కింద రాయితీపై సరఫరా చేస్తున్న కంది, పెసర, మినుము విత్తనాలను మే నెలాఖరులోగా రాష్ట్రంలోని అన్ని మండలాలకు చేర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి మేనేజర్లు, ప్రాంతీయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'తుమ్మిడిహెట్టి'కి మహారాష్ట్ర అనుమతులకు బిజెపి బాధ్యత తీసుకోవాలి

### కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం కూలేశ్వరంగా తయారైంది: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం కోసం సమయం అభ్యర్థిస్తూ లేఖ రాసినా ఇప్పటి వరకు స్పందించలేదని ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చినప్పుడు తుమ్మిడిహట్టి అనుమ తుల పైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సభలో ప్రస్తా వించి ఉంటే సమస్యకు పరిష్కారం లభించేదనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.

సిఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లా డుతూ కేంద్రంలో, మహారాష్ట్రలో కూడా బిజెపి ప్రభు త్వాలే ఉన్నాయని అందుకు బిజెపి నాయకులు బాధ్యత తీసుకోవాలనీ ఆయన సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు ప్రాణహితపై ప్రాజెక్టుపై మాట్లాడటంలేదని ప్రశ్నించారు. తుమ్మడిహట్టి వద్ద బ్యారేజీ కట్టాలని మా ప్రభుత్వం నిర్ణయించిందనీ మహారాష్ట్రలో చర్చలు జరిపి ఒప్పించామని తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కెసిఆర్ బేగంపేట విమానాశ్రయం నుంచి విజయోత్సవ ర్యాలీ తీశాడని గుర్తుచేశారు. తుమ్మడిహట్టిని వదిలేసి కాళేశ్వరం కడితే అది కూలేశ్వరమై లక్షకోట్ల రూపాయలు గోదావరి పాలయ్యాయనీ ఎద్దేవా చేశారు.

తుమ్మిడిహట్టితో తక్కువ ఖర్చుతో ఆదిలాబాద్, కరీంనగర్ మెదక్, రంగారెడ్డి, చేవేళ్ల వరకు అతి తక్కువ ఖర్చుతో గ్రావిటి ద్వారా నీళ్ల ఇచ్చే అవకాశం ఉందనీ వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేస్తే తమ వైపు ముంపు ఉంటుందని మహారాష్ట్ర అంగీకరించలేదు కానీ 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే ముంపు ఉండదని నివేదికలు ఇచ్చారని తెలిపారు. 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే 100 టిఎంసి నీళ్లను లభ్యత ఉంటుందనీ 16 లక్షల ఎకరాలకు నీళ్ల అందించవచ్చనీ ముంపుకూడా తక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. తుమ్మడిహట్టి దగ్గర 1000 ఎకరాల లోపే మహా రాష్ట్ర భూములు ముంపునకు గురవుతున్నాయి. బిఆర్ఎస్ నాయకులు కొందరు బిజెపిలోని తమ శ్రేయోభిలాషులతో కలిసి తుమ్మడి హట్టి పైన కుట్ర చేస్తున్నారనీ ఆది అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే తుమ్మడి హట్టి పైన తెలంగాణ ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందనీ, కాలువలు కూడా చాలా వరకు 2014 నాటివరకు తవ్వినామని గుర్తుచేశారు.

కాళేశ్వరం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందనీ, కెసిఆర్ అనాలోచిత నిర్ణయాల వల్ల నష్టం జరిగిందనీ, కాళేశ్వరాన్ని ఎటిఎంను బిఆర్ఎస్ నాయకులు మార్చుకున్నారనీ అన్నారు. మేడిగడ్డ కూడా పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. బిజెపి నాయకులు తక్షణమే మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ ఇప్పించాలని డిమాండ్ చేశారు.



## ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రధాని మోడీ 'సప్త సూత్రాల'ను ఆచరించాలి

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్

**హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోదీ దేశ ఆర్థిక భద్రత కోసం సూచించిన 'సప్త సూత్రాలు – సప్త పరివర్తన' గురించి ప్రజలకు అవగాహన కల్పిం చాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ అభివృద్ధి రేటు దెబ్బతినకుండా, భవిష్యత్ ఆర్థిక సవాళ్లను ముందుగానే ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ సప్త సూత్రాలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి ఏటా సుమారు 700 బిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతుండగా, ఎగుమతులు దాదాపు 400 బిలియన్ డాలర్ల వరకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. దేశ కుటుంబ పెద్దగా ప్రధాని మోదీ సూచించిన సప్త సూత్రాల్లో ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని, ప్రతి ఏటా దాదాపు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతోంది. దీని విలువ సుమారు రూ.5.5 లక్షల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఇందులో 95 శాతం వ్యక్తిగత వినియోగానికే ఉపయోగపడుతోంది. దీని వలన 56 లక్షల కోట్ల విలువ విదేశీ మారక ద్రవ్యం మిగులుతుందన్నారు. కేవలం 25 శాతం బంగారం కొనుగోళ్లు తగ్గించినా భారీగా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేయవచ్చన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ దిగుమతులపై భారత్ భారీగా ఖర్చు చేస్తోంది. మనం 11 లక్షల కోట్ల క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటాం. 20శాతం వాడకం తగ్గినా 3, 4 లక్షల కోట్ల పొదుపు అవుతుందన్నారు. కరోనా సమయంలో విజయవంతంగా అమలైన "వర్క్ ఫ్రమ్ హోమ్" విధానాన్ని సాధ్యమైనంత వరకు కొనసాగిస్తే ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందన్నారు. కనీసం 25 వర్క్ ఫ్రేమ్ హోమ్ చేసిన 12,000 కోట్ల విదేశీ కరెన్సీ మిగులుతుందన్నారు. దేశంలో వంటనూనె వినియోగం 20 తగ్గించిన 40వేల కోట్ల విదేశీ మారక ద్రవ్య ఆదా అవుతుందన్నారు. భారతీయులు దాదాపు 2.8 లక్షల కోట్లు విదేశీ విహార యాత్రలకు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. దేశ నాయకులు, ముఖ్య మంత్రులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముందుగా ప్రధానమంత్రి అందించిన ఈ సూత్రాలను పాటిస్తే ప్రజలు కూడా అనుసరిస్తారని కోరారు. భారతదేశం ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని డాక్టర్ నర్సయ్యగౌడ్ కోరారు.

## తాగునీటి విడుదలకు కెఆర్ఎంబి ఆదేశాలు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** వేసవి తాగునీటి అవసరాల కోసం నీటి విడుదలపై కృష్ణా యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 12న కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయించిన మేరకు ఇరు రాష్ట్రాలకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. నాగార్జునసాగర్ నుంచి తెలంగాణకు 16 టీఎంసీలు, శ్రీశైలం నుంచి 4.5 టీఎంసీలు కలిపి మొత్తం 21 టీఎంసీలు, ఏపీకి సాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కృష్ణా జలాల కేటాయిం పులపై తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాల నడుమ కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ మంగళవారం సమావేశమై కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుత వేసవి తీవ్రతను పరిగణలోకి తీసుకున్న బోర్డు.. ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడాలని, సాగునీటికి మళ్లించకూడదని ఇరు రాష్ట్రాలకు స్పష్టం చేసింది. రానున్న ఆగస్టు 15 వరకు కేటాయింపులు జరపాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఎంపిహెచ్ఎ పోస్టుల ఫలితాలు విడుదల

### 1,931 పోస్టులకు ప్రొవిజనల్ జాబితా రిలీజ్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎఎన్ఎం) పోస్టుల పరీక్ష ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం విడుదల చేసింది. 1,931 పోస్టుల భర్తీకి ప్రొవిజనల్ జాబితాను రిక్రూట్‌మెంట్ విడుదల చేసింది. ఈ పోస్టులకు 24,268 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా వారిలో 20,600 మంది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌కు హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల మేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సర్వీస్ వెయిటేజ్‌ను 30 మార్కుల నుంచి 20 మార్కులకు పరిమితం చేశారు. అభ్యర్థుల సీబీటీ మార్కులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సేవలకు సంబంధించిన వెయిటేజ్ మార్కులతో కూడిన ప్రొవిజనల్ జాబితాను విడుదల చేశారు. అభ్యర్థులు తమ వివరాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18 నుంచి 22 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అభ్యంతరాలు ఒక్కసారి మాత్రమే నమోదు చేసే అవకాశం ఉండటంతో అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలని బోర్డు సూచించింది. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పులకు లోబడి నియామకాలు ఉంటాయని రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నందమూరి బాలకృష్ణ.

## బసవతారకంలో అందుబాటులోకి డిజిటల్ పాథాలజీ

### వ్యవస్థను ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 14, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ భారతదేశంలోనే తొలిసారిగా 240 స్లైడ్ స్కానర్‌తో కూడిన అత్యాధునిక డిజిటల్ పాథాలజీ వ్యవస్థను రోగుల సేవలోకి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఐసీఐసీఐ ఫౌం డేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, పేదలకు ప్రపంచస్థాయి వైద్యసేవలను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఆస్పత్రి ఎప్పటికప్పుడు ఆధునిక వైద్య సాంకేతికతలను ప్రవేశపెడుతోందన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతలు, ప్రభుత్వాలు, పారిశ్రామిక వేత్తలు, ప్రవాస భారతీ యులు అందిస్తున్న సహకారం కీలకమని తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్ ఆస్పత్రి విస్తరణతోపాటు తుళ్లూరులో నిర్మిస్తున్న కొత్త ఆస్పత్రి అభివృద్ధికి కూడా దాతలు ముందుకు రావాలని కోరారు. లాబొరేటరీ మెడిసిన్, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ సుశీల కోదండపాణి మాట్లాడుతూ, ఈ వ్యవస్థ ద్వారా రక్త పరీ క్షలు, కణజాల పరీక్షల అనంతరం స్లైడ్‌లను డిజిటల్ రూపంలోకి మార్చి వైద్యు లకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. 80 రెట్లు విస్తరించి పరిశీలించ గలిగే ఈ సాంకేతికతతో వ్యాధులను మరింత వేగంగా, కచ్చితంగా గుర్తించ వచ్చని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, జెఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ టీఎస్ రావు, డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ కల్పనా రఘు నాథ్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక్కరోజులోనే 100 మందికిపైగా మృతి

### ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షం..

### తుఫాను సృష్టించిన బీభత్సం

**లక్నో, మే 14:** ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన కుంభవృష్టి తుపాను గాలులకు ఒక్కరోజులోనే 100 మందికిపైగా చనిపోయారు. అనేక చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూడా కూలిపోయి అనేక ఇళ్లు కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించి వారికి 24 గంటల్లోనే ఆర్థిక సాయం అందించాలని ఉత్తర్వులు జారీచేసారు. అత్యధికంగా మరణాల్లో ప్రయాగ్‌రాజ్‌లోనే 21 మంది చనిపోయారు. భదోహిలో 18, మీర్జాపూర్‌లో 15, ఫతేపూర్‌లో 10, ఉన్నవ్, బదౌన్‌లో ఆరుగురుచొప్పున, ప్రతాప్‌ఘర్, బరేలీ,లో నలుగురేసి చొప్పున, సీతాపూర్, రాయ్‌బరేలీ, చందౌలిల్లో ఇద్దరుచొప్పున చనిపోయినట్లు యోగి సర్కారు ప్రకటించింది. కాన్పూర్‌లోని దేహత్; హర్దోయి, సంభాల్‌లలో ఇద్దరు చనిపోయారు. కౌశాంబి, షాజహాన్‌పూర్; సోన్‌భద్ర, లఖింపూర్‌లలో ఒక్కొక్కరు చొప్పున భారీ వర్షాలకు చనిపోయినట్లు తెలిపారు. ముందురోజు సాయంత్రమే హటాత్తుగా వాతావరణం మారిపోయింది. మేఘావృతం కావడంతోపాటు అనేక ప్రాంతాల్లో దుమ్ముతుపాను చెలరేగిపోయింది. అనేకమంది చెట్లు, ఫ్లైఓవర్లకింద తలదాచుకున్నారు. అత్యంత వేగమైన గాలులు హోర్డింగ్‌లు, టిన్‌షెడ్లువంటి వాటిని ఎగరేసుకనిపోయాయి. అనేక రోడ్లు స్తంభించిపోగా వాహనాలు కూడా చెట్టుపడిపోవడంతో ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ఇళ్లుకూలిపోవడంతో శిథిలాలనుంచి వారిని వెలికి తీయడం కూడా కష్టం అయింది. తుపానుధాటికి బరేలీజిల్లాలోని బామియానా గ్రామంలో 200 మీటర్ల ఎత్తుకు ఎగిరి చేలల్లో పడినట్లు గుర్తించారు.

## సతీశన్‌కు శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** కేరళం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న విడి సతీశన్‌కు టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజా స్వరంగా నిలిచిన నాయకుడు సతీశన్ అని ఆయన కొనియాడారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన నేతలకు ఎప్పటికప్పుడు గుర్తింపు లభిస్తుందనే విషయాన్ని కేరళ ముఖ్యమంత్రి ఎంపిక మరోసారి స్పష్టం చేసిందనీ ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వి. హనుమంతరావుని సచివాలయంలో కలిసి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

## సిబిఎస్ఇ 12వ తరగతి ఫలితాల్లో నారాయణ విద్యార్థుల అద్భుత ప్రతిభ

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** సీబీఎస్ఈ 12వ తరగతి బోర్డు పరీక్షా ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు మరోసారి తమ అకడమిక్ నైపుణ్యాన్ని చాటుకుంటూ అద్భుత ఫలితాలను సాధించారు. 500 మార్కులకు గాను 494 మార్కులు సాధించి భూమిజ (కర్ణాటక) టాపర్‌గా నిలిచింది. ఆర్. జస్వంత్ రామ్ (ఆంధ్రప్రదేశ్), సోహమ్ పెద్నే కర్ (మహారాష్ట్ర) ఇద్దరూ 492 మార్కులు సాధించి నారాయణ విద్యాసంస్థల ఘనతను చాటారు. 485 ఆపైన మార్కులు 27 మంది సాధించారు. నారాయణ విద్యా సంస్థల మొత్తం ఉత్తీర్ణతా94.8శాతంగా నమోదయ్యిందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూర నారాయణ, పి. శరణి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ..నారాయణలో దశాబ్దాల పరిశోధనతో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కరికులము అందిస్తున్నట్లు తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వివిధ స్టేట్ బోర్డుల ఉత్తమ పద్ధతులను మిళితం చేసి, విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. ఇదే వారిని పోటీ ప్రపంచంలో రాణించేలా చేస్తుందన్నారు. పి. శరణ్ నారాయణ మాట్లాడుతూ .. నారాయణ మైక్రోషెడ్యూల్ విధానం వల్ల చదువు క్రమ పద్ధతిలో, ఆసక్తికరంగా సాగుతుందన్నారు. అలాగే ప్రతి సబ్జెక్టును చిన్న చిన్న అంశాలుగా విభజించి అకడమిక్ క్యాలెండరుకు అనుగుణంగా బోధిస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక మెంటరింగ్, డౌట్ క్లారిఫికేషన్ సెషన్స్ ద్వారా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. 47 ఏళ్ల చరిత్ర కలిగిన నారాయణ విద్యాసంస్థలు, ప్రతి ఏటా కొత్త మైలురాళ్లను అధిగమిస్తూ, విద్యార్థుల కలలను సాకారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఈ అద్భుత విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి. సింధూర నారాయణ, పి. శరణి పొంగూరు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ అందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇక ఇంటర్ ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్ పరీక్షలు

### గణితం, ఆర్ట్స్ విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్

### 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు

### ఫస్టియర్‌లో సిలబస్ మార్పులు.. జూన్ 1 నాటికి విద్యార్థులు కొత్త బుక్స్ పంపిణీ

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకపై ఇంటర్మీడియట్‌లో సైన్స్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ) విద్యార్థులకు మొదటి సంవత్సరంలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. దాంతోపాటు గణితం, హ్యూమానిటీస్, లాంగ్వెజెస్‌లకు ఇంటర్నల్ అసెస్ మెంట్‌ను నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. వీటిని 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సిలబస్‌లో మార్పులు చేశామని, మారిన సిలబస్‌కి సంబంధించిన పుస్తకాలను జూన్ 1 నాటికి విద్యార్థులకు అందజేయ నున్నట్టు బోర్డు సెక్రటరీ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్‌ను నిర్వహించి వార్షిక పరీక్షల సమయంలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కులు కేటాయించనున్నారు. మ్యాథ్స్‌లోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్(ఏబిఎల్)ను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మ్యాథ్స్‌లో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ థియరీ పరీక్షలను నిర్వహించనుండగా.. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ఒక్కో ఏడాదికి 15 మార్కులను కేటాయించనున్నారు. అలాగే హ్యుమానిటీస్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు 20 మార్కులను కేటాయిస్తారు. ఫైనల్ థియరీ పరీక్షలను ఇకపై 100 మార్కులకు బదులుగా 80 మార్కులకే నిర్వహించ నున్నారు. భాషా విభాగాల్లోనూ థియరీకి 100 మార్కు లకు బదులుగా ఇకపై 80 మార్కులకు వార్షిక పరీక్షలకి నిర్వహించనుండగా.. 20మార్కులు ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనున్నట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది. ఈ మార్పులను 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సోమవారం ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ నెల 12 నుంచి ఇంటర్ అడ్మిషన్లకు అనుమతించిన నేపథ్యంలో ఇంటర్ విద్యలో మార్పులను ఇంటర్ బోర్డు ప్రకటించింది.

## తెలుగు భాషకు ఆకాశవాణి సేవ చిరస్మరణీయం

### ఎమ్మెల్సీ, ప్రముఖ గాయకుడు గోరేటి వెంకన్న

### వీనులవిందుగా ఆకాశవాణి పల్లె పాటల పండుగ

**హైదరాబాద్ (నాంపల్లి), మే 14, ప్రభాతవార్త :** ఆకాశవాణి ఆవిర్భావ 90 వసంతాల వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సందర్భంలో అశేష సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులకు పల్లె పాటల పండుగ ప్రత్యేక కార్యక్రమంతో వీనులవిందు చేసింది. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగిన ఈ పండుగకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ, ప్రముఖకవి, గేయరచయిత, గాయకుడు గోరేటి వెంకన్నతోపాటు ఆకాశవాణి తెలంగాణ క్లస్టర్ హెడ్ బానోతు హరిసింగ్, దూరదర్శన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్వీ రమణ, ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ న్యూస్ ఎం.ఎస్.మహేష్, టి.ప్రసన్న, ఇంఛార్జ్ ప్రోగ్రామ్ హెడ్ సీమకుమారి, రామ్‌గోపాల్, నిహార, నీలిమా, బిక్షాకేతావత్, శాంతిశ్రీ, సాంబశివరావు, లావణ్య, వీర్న, సందీప్ పాల్గొని జ్యోతిప్రకాసనంచేసి పల్లె పాటల పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా గోరేటి వెంకన్న ఒకప్పుడు గ్రామాల్లో విద్యుత్ లేకపోయినా రేడియోధ్వని మాత్రం వినిపించేదని, రైతుకు వ్యవసాయ సలహాలు, విద్యార్థికి విజ్ఞానం, గృహిణికి వినోదం ఇలా అందరికీ సమస్తాన్ని ఆకాశవాణి అందిం చిందని, ఆకాశ వాణి ముఖ్యంగా తెలుగు భాష వికాసానికి, జాన పద కళల పరిరక్షణకు, సాహిత్య ప్రచారానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొని యాడుతూ పలు పల్లె పాటలు అద్భుతంగా ఆల పించి ఉర్రూత లూగించారు. బానోత్ హరిసింగ్ ప్రారంభోప న్యాసంలో ఆకాశవాణి 90ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. ప్రముఖ జానపద గాయకుడు గడ్డం రమేష్ కంఠం నుండి పలు జానపద, పల్లెపాటలు జాలువారగా ఏనుగుల నరసయ్య బృందం వారి ఒగ్గుకథలు ఆహుతులను ఎంత గానో అలరించి తన్మయుల్ని చేశాయి. ఈ సంద ర్భంగా ఆకాశవాణి రాష్ట్ర రీజినల్ ఛానల్ మేనేజర్ బానోతు హరిసింగ్ మాట్లాడుతూ ఆకాశవాణి ఆవిర్భావ 90 వసంతరాల సంబరాలు గత సంవ త్సరం జూన్ నుండి అనేక సృజన్మాతక కార్యక్రమాలను రూపొందించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




గోరేటి వెంకన్నను సత్కరిస్తున్న హరిసింగ్, రమేష్ తదితరులు

## 15 రోజుల్లో మొక్కజొన్న కొనుగోలు పూర్తి చేయాలి

### రవాణా, గోనె సంచులు అందుబాటులో ఉంచాలి: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 14:** రాష్ట్రంలో మొక్కజొన్న పంటను 15 రోజుల్లోగా సేకరణ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే నాణ్యమైన ప్రతి మొక్కజొన్న గింజను సేకరించాలి. రవాణా చేసేందుకు తగిన వాహనాలు,హమాలీలు,గోనె సంచులు,నిల్వ స్థలం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సేకరణ కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని చెప్పారు. వర్షం నుంచి పంటను కాపాడి రోజువారీ కొనుగోలు నివేదికలను సమర్పించాలని చెప్పారు.వాహనాలు,లాజిస్టిక్స్ సహాయం అందించడంలో విఫలమైన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల వరకు అధికారులు రాష్ట్రంలో రోజు సగటున 40వేల నుంచి 45వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరణ చేశారు. ఇప్పటి వరకు 9.87 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, గోదాముల్లో 4.93 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ సామర్థ్యం ఉంది. ఇక రోజువారీగా 50వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొనుగోలు చేసిన పంటను నిల్వలు 11.67 లక్షల మెట్రిక్ టన్నులు కాగా గతం కంటే అదనపు నిల్వలు 1.80లక్షల మెట్రిక్ టన్నులు పెరిగింది. గోదాముల్లో నిల్వ చేయబడిన పరిమాణ 4.93లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 6.50లక్షల మెట్రిక్ టన్నులకు చేశారు. సరఫరాదారుల ద్వారా రవాణా పెరగడంతో గోనె సంచుల పరఫరా కూగా గణనీయంగా పెంపు జరిగింది. హ్యాండ్లింగ్,రవాణా కాంట్రాక్టర్లతో సమన్వయంతో గోదాము పాయింట్ల వదద్ద హామాలీ ఏర్పాట్లు బలోపేతం చేశారు. రవాణా శాఖ సహకారంతో వాహనాలను సమీకరించడం జిల్లా సరిహద్దుల్లో పర్యవేక్షక అధికారులను నియమించడం ద్వారా వాహనాల కొరత గణనీయంగా తగ్గింది. అర్హులైన రైతులందరూ ఎలాంటి అసౌకర్యం లేకుండా తమ మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు అమ్ముకునేలా జిల్లా కలెక్టర్లు ప్రతిరోజూ కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు.

## స్వామినాథన్ కమిషన్ సిఫారసులు బుట్టదాఖలు

### పెరిగిన సాగు వ్యయాలకు సరిపోని కనీస మద్దతు ధరలు

### రైతుల ఆదాయాన్ని పెంచే సంకల్పం

### కేంద్ర ప్రభుత్వానికి లేదు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** రైతు సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)లు ప్రకటించడం కాదని, ఆ ధరకు కొనుగోలు చేయడమే అసలు రైతు సంక్షేమమని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రతి పంటలో కనీసం 75 శాతం దిగుబడిని కేంద్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పంటల మద్దతు ధరల పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల శ్రేయస్సు కోసం మొక్కజొన్న, జొన్న పంటలను కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని గుర్తు చేశారు. కేంద్రం చేతులెత్తేయడంతో పంట కొనుగోళ్లతో ఏటా రూ. 4000 కోట్ల భారం రాష్ట్రంపై పడుతోందన్నారు. 2026-27 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతుల ఆశలను పూర్తిగా నీరుగార్చాయని స్పష్టం చేశారు. స్వామినాథన్ కమిషన్ స్పష్టంగా సూచించినట్లుగా సంపూర్ణ ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం లాభం కలిపి ఎంఎస్‌పి నిర్ణయించాలన్నారు. ఈ మూల సూత్రాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి తుంగలో తొక్కిందని మంత్రి తుమ్మల మండిపడ్డారు. రైతుల కోసం మద్దతు ధరలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో మాత్రం రైతులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. సాధారణ వరి ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.2,441గా నిర్ణయించడం ద్వారా గత ఏడాదితో పోలిస్తే కేవలం రూ.72 మాత్రమే పెంచారని, ఇది కేవలం 3 శాతం పెరుగుదల మాత్రమేనని, ఎరువులు, కార్మిక చార్జీలు, విత్తనాలు, డీజిల్, విద్యుత్ ఖర్చులు భారీగా పెరిగిన పరిస్థితుల్లో ఈ పెంపు రైతులకు ఏమాత్రం ఉపశమనం కలిగించదని స్పష్టం చేశారు.ఇక మొక్కజొన్న మద్దతు ధరనును క్వింటాల్‌కు రూ.2,410గా నిర్ణయించి కేవలం రూ.10 మాత్రమే పెంచారని తీవ్రంగా విమర్శించారు.

## ఆక్టోపస్ పనితీరును సమీక్షించిన డిజిపి సివి ఆనంద్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 14:** రాష్ట్రంలోని కౌంటర్ టెర్రర్ ఫోర్స్ ఆక్టోపస్ పనితీరు, శిక్షణ కార్యకలాపాలు, ఆపరేషనల్ సన్నద్ధ తను రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సివి ఆనంద్ గురువారం క్షుణ్ణంగా సమీక్షించారు. ఇబ్రహీంపట్నంలోని ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన డిజిపి క్యాంపస్‌లోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, శిక్షణ విభాగం, ఆపరేషనల్ సౌకర్యాలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమాం డోలు, అధికారులతో ముఖాముఖి మాట్లాడి, ఏవైనా అవాంఛనీయ ఉగ్రవాద సంఘటనలు ఎదురైతే వాటిని తిప్పికొట్టేందుకు సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (స్వాట్) బృందాల పనితీరును, శిక్షణ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆపరేషన్స్ (ఆక్టోపస్ గ్రేహౌండ్స్) డిజి డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా డిజిపికి పలు అంశాలపై వివరణ ఇచ్చారు. ఆపరేషనల్ టీమ్స్ నిర్వహిస్తున్న రెగ్యులర్ కార్యకలాపాలు, కీలక సంస్థలు, సున్నిత ప్రాంతాల్లో కాలాను గుణంగా చేపడుతున్న మాక్ ఎక్సర్‌సైజులు, ఉగ్రవాద వ్యతిరేక పోరాట విన్యాసాలు,అత్యాధునిక ఆయుధాల వినియోగంలో కమాండోలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ గురించి వివరించారు.

అనంతరం అధికారులను ఉద్దేశించి డిజిపి సివి ఆనంద్ మాట్లాడుతూ.. ...కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందిం చుకోవడానికి వివిధ రకాల భవన సముదాయాలు, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే రీతిలో మాక్ ఆపరేషన్లు నిర్వహించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

## లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణ దూకుడు

### 145 బిలియన్ డాలర్ల పర్యావరణ వ్యవస్థగా ఆవిర్భావం

### రెండేళ్లలో రూ. 84,000 కోట్ల పెట్టుబడులు

### పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త:** తెలంగాణ జీవ శాస్త్రాల పర్యావరణ వ్యవస్థ (లైఫ్ సైన్సెస్ రంగం) ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించిందని, గత రెండేళ్లలో రూ.84,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. దాదాపు 145 బిలియన్ డాలర్ల విలువను చేరుకోవడం ద్వారా రాష్ట్ర చరిత్రలోనే అత్యంత వేగవంతమైన విస్తరణగా రికార్డు సృష్టించిందని కొనియాడారు. నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీలోని కార్యక్రమాల ద్వారా తదుపరి వృద్ధి దశకు తెలంగాణ చేరువలో ఉందని పేర్కొన్నారు. అంచనా వేసిన పెట్టుబడుల్లో అధికభాగం ఇప్పటికే ప్రారంభమైనప్పటికీ గ్రీన్ ఫార్మా సిటీ కోసం కుదుర్చుకున్న సుమారు రూ. 20,000 కోట్ల విలువైన పెట్టుబడి అవగాహన ఒప్పందాలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ (టిఎల్ఎస్ఎఫ్) 7వ బోర్డు సమావేశం గురువారం నగరంలో జరిగింది. ఈ సందర్భంగా లైఫ్‌సైన్సెస్ రంగంలో తెలంగాణ సాధించిన వృద్ధిపై టిఎల్ఎస్ఎఫ్ సీఈఓ ఎం. నాగప్పన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. లైఫ్‌సైన్సెస్ రంగానికి గడిచిన రెండేళ్లు ఒక కీలక మలుపు అని చెప్పారు. తెలంగాణలో 2016 నుండి జీవశాస్త్రరంగం దాదాపు మూడు రెట్లు అభివృద్ధి చెందిందన్నారు. దీంతో ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, మెడికల్ టెక్నాలజీ, హెల్త్ టెక్ ఆవిష్కరణలలో ప్రపంచంలోని అగ్రశ్రేణి లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా హైదరాబాద్ నిలిచిందన్నారు. అమెరికా తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక ప్రాంతం హైదరాబాదేనన్నారు. ఈ సమావేశంలో టిఎల్ఎస్ఎఫ్ కొత్త సీఈఓ సర్వేష్ సింగ్‌ను పరిచయం చేశారు.

# కరీంనగర్ జ్యుయెలరీ దోపిడి గోల్డెన్ థీఫ్ ముఠా పనే

### బీహార్ జైలు నుంచి సుబోధ్‌సింగ్ స్కెచ్

### ఆయుధాలు, ఆభరణాలు దొరకలేదు..

### కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్‌ఆలం




**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరీంనగర్ పిఎంజె జ్యువెలరీ దోపిడీ కేసుది గోల్డెన్ థీఫ్ గ్యాంగ్ పనేననికరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్పష్టం చేశారు..ఈ దోపిడి ముఠాకు ప్రధాన సూత్రధారి అంతర్రాష్ట్ర నేరస్తుడు, బీహార్ జైలులో ఉన్న సుభోద్ సింగ్ (ది గోల్డెన్ థీఫ్) గ్యాంగ్ అని తెలిపారు.గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అస్త్ర కన్వెన్షన్ హాల్లో మీడియా సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు.ఈ కేసులో కమిషనరేట్ పోలీసులు ఇద్దరు నిందితులతో పాటు వారికి సిమ్ కార్డులు సరఫరా చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పిఎంజె జ్యువెలరీ షాపులో ఈనెల 3న గుర్తు తెలియని దుండగులు ఆయుధాలతో వచ్చి దోపిడీకి పాల్పడ్డారు.ఈ దోపిడీలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి మొత్తం రూ.82,02,000/ విలువైన ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు: దర్యాప్తులో ఈ ఆపరేషన్‌ను ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న అంతర్రాష్ట్ర గ్యాంగ్ హ్యాండ్లర్ "ది గోల్డెన్ థీఫ్" గా పేరొందిన సుభోద్ సింగ్ ప్రణాళికా రచించి నిర్వహించినట్లు గుర్తించడం జరిగింది.ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో వెలిచాల ఎక్స్ రోడ్ వద్ద అరెస్ట్ చేశామన్నారు.మరో ఇద్దరు నిందితులు రవిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను(సిమ్ కార్డులు సరఫరా చేసిన వ్యక్తి) బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకురావడం జరిగింది. అనంతరం నిందితుడురఘునాథ్ కర్మాకర్ విచారణలో"ది గోల్డెన్ థీఫ్"గా పేరొందిన సుభోద్ సింగ్ నాయకత్వంలో ఈ గ్యాంగ్ ఏర్పడినట్లు తేలింది. ఈ ముఠా ముందస్తుగా రెక్కీ నిర్వహించడం, నేరము చేసిన తరువాత తప్పించుకునే మార్గాలను గుర్తించడం, నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు ఉపయోగించడం, తప్పుడు పేర్లతో లాడ్జిలలో ఉండడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం వంటి పద్ధతులతో ఆయుధాలతో దోపిడీలు నిర్వహించేది.సుభోద్ సింగ్,అతని అనుచరుల ప్రణాళిక ప్రకారమే నిందితులు రఘునాథ్ కర్మాకర్, రవిష్ కుమార్,రాధే అలియాస్ అభయ్ అలియాస్ ప్రమోద్ గోస్వామి,మిశ్రా,సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ లు 2నెలల ముందే తెలంగాణకు వచ్చారు.తెలంగాణలోకి ప్రవేశించే ముందు జార్ఖండ్‌పశ్చిమ బెంగాల్ సరిహద్దులో మెహతాబ్ ఖాన్ వద్ద ఒక్కో సిమ్ కార్డును రూ.10,000 చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం వీరు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ జ్యువెలరీ షాపులు, బ్యాంకుల పై రెక్కీ నిర్వహించారు. చివరకు కరీంనగర్‌లోని పిఎంజె జ్యువెలరీ షాప్‌ను లక్ష్యంగా ఎంచుకుని పెద్దపల్లిలోని ఒక లాడ్జ్ లో బస చేశారు. మే 1న ధర్మపురిలోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌కు మారి దోపిడీకి సిద్ధమయ్యారు. సుభోద్ సింగ్ అనుచరుల సమాచారంతో రఘునాథ్ కర్మాకర్ మంచిర్యాలకు వెళ్లి రైలులో చంద్రపూర్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మే 2న గడ్‌చందూర్ పరిసరాల్లో ఆరు పిస్టల్స్ మ్యాగజైన్లు అందజేశారు. అనంతరం రఘునాథ్ కర్మాకర్ ఆయుధాలతో ధర్మపురికి తిరిగి వచ్చాడు.3న ఉదయం ఐదుగురు నిందితులు ధర్మపురిలో వారు ఉన్న లాడ్జ్ ఖాళీ చేసి రెండు బైక్‌ల పై బయలుదేరారు. బ్యాగులను కొండ ప్రాంతంలో దాచిపెట్టి, అక్కడే వారి బైక్ నంబర్ ప్లేట్లు మార్చి, వెలిచాల ఎక్స్ రోడ్ వద్దకి చేరుకొని అక్కడ టిఫిన్ చేసి, దోపిడీ ప్రణాళికను మరోసారి చర్చించారు.ఉదయం 10:50 గంటల సమయంలో జ్యువెలరీ షాప్‌కు చేరుకున్నారు. ప్రణాళిక ప్రకారం రాధే అలియాస్ అభయ్ కస్టమర్‌లా షాప్‌లోకి వెళ్లి పరిస్థితిని గమనించాడు. రాధే మెస్సేజ్ ఇచ్చిన తర్వాత మిగతా నిందితులు లోపలికి ప్రవేశించి సిబ్బందిని ఆయుధాలతో బెదిరించారు. నగలు దోచుకుంటుండగా స్టాఫ్ ప్రతిఘటించడంతో నిందితులు వారి వద్ద ఉన్న ఆయుదాలతో స్టాఫ్ పై కాల్పులు జరిపారు.నిందితులు షాప్ నుండి పారిపోతూ వారు షాపులో దోచుకున్న ఒక ఆభరణాల బ్యాగ్‌ను తీసుకుని పారిపోయారు. హడావుడిలో మరో బ్యాగ్‌ను షాప్‌లోనే వదిలివేశారు. ముందుగా నిర్ణయించిన మార్గంలో ధర్మపురికి చేరుకున్నారు.సనోజ్, రాధే అలియాస్ అభయ్, ప్రద్యుమన్ గోదావరి నది ఒడ్డున పల్సర్ బైక్‌ను వదిలి నడుచుకుంటూ నది దాటి మంచిర్యాల నుంచి రైలులో పరారయ్యారు.మరోవైపు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్ , మిశ్రా ఆభరణాల బ్యాగ్‌తో అపాచీ బైక్‌పై గుండాల అడవి ప్రాంతానికి వెళ్లారు. అక్కడ తెలుపు రంగు క్రెటా కారులో వచ్చిన వ్యక్తులకు బ్యాగ్ , బైక్ అప్పగించి సమీప రైల్వే స్టేషన్ ద్వారా బీహార్‌కు పారిపోయారు.నగల దుకాణం నుండి అపహరించిన సొమ్ము చేతులు మారిందని, అయితే విక్రయించే చోటు కనుగొన్నప్పటికీ సమాచారం లీక్ అయి ఎప్పటిలాగే కొనుగోలుచేసే వ్యాపారి జాగ్రత్తపడ్డాడని మిగతా నిందితులను,చోరీ సొమ్మును త్వరలోనే పట్టుకుంటామని సిపి స్పష్టం చేశారు. సాంకేతిక నిఘా ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 13 మంది నిందితులను గుర్తించాయి. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులు, రూ.51,000 ల నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు, దోచుకెళ్లిన ఆభరణాల కోసం ఐదు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. నిందితుల నుండి రూ. 51,000 నగదు,2 ఫోన్‌లు, 2 సిమ్‌కార్డులు,నకిలీ ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు సిపి వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితులుసుభోద్‌సింగ్ (గ్యాంగ్ లీడర్),రాధే మిశ్రా అలియాస్ అభయ్ అలియాస్ ప్రమోద్ గోస్వామిమిశ్రా, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్‌లతో పాటు ఈ నేరంలో పాల్గొన్న వారిని శాస్త్రీయ ఆధారాలు, సీసీ ఫుటేజ్, సాంకేతిక విశ్లేషణతో గుర్తించి, అంతర్రాష్ట్ర పోలీసుల సమన్వయంతో అరెస్ట్ చేస్తామని తెలిపారు.

## మార్క్సిజం అజేయం.. దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతుంది

### సిపిఎం కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్ (చిక్కడపల్లి) మే 14, ప్రభాతవార్త :** మార్క్సిస్టు సిద్ధాంతం అజేయమైనదని, ప్రతి ఎదురుదెబ్బ తర్వాత మరింత బలంగా ముందుకు సాగుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులను పార్టీ సీనియర్ నాయకుడు సారంపెల్లి మల్లారెడ్డి జెండా ఆవిష్కరణతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం ఆటంకంగా మారినప్పుడు సామాజిక విప్లవం ద్వారా సోషలిస్టు వ్యవస్థకు మార్పు అనివార్యమని మార్క్స్ శాస్త్రీయంగా రూపించాడన్నారు. మార్క్సిజం స్థిరమైన సిద్ధాంతం కాదని, కాలానుగుణ మార్పులతో అది అభివృద్ధి చెందుతూనే ఉంటుందని పేర్కొన్నారు. ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలో ఎన్నో ఎదురుదెబ్బలు వచ్చినప్పటికీ ఉద్యమం తిరిగి పుంజుకుని ముందుకు సాగిందన్నారు. కార్యక్రమానికి సీపీఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎండి అబ్బాస్, జి నాగయ్య పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం, సిరిసిల్ల
జిల్లా : రాజన్న సిరిసిల్ల
No.E1/SRCL/E-PROC.03/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన తేది: 14.05.2026
పురపాలక సంఘం, సిరిసిల్ల కమిషనర్ గారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫాం ద్వారా నర్సరీ మెయింటెనెన్స్ పరికరాలు కొనుగోలు చేయుటకుగాను ఆన్‌లైన్ టెండర్ ద్వారా పిలువడం జరిగినది. మొత్తం పనులు : (1). మొత్తం పనుల విలువ : రూ.5.00 లక్షలు. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం: తేది: 14.05.2026 సా.4.00గం. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది & సమయం: తేది: 21.05.2026 సా.4.00గం. ఇతర వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్ సైట్‌ను సంప్రదించగలరు.
సం/-. కమిషనర్, పురపాలక సంఘం, సిరిసిల్ల.
DIPR.NO. 2389-PP/CL/ADVT/1/2026-27 తేది: 14.05.2026

# ఉన్నతాధికారుల్లో బాధ్యతారాహిత్యం పెరిగిపోతోంది: సిఎం చంద్రబాబు అసహనం



విజయవాడ,మే 14,ప్రభాతవార్తప్రతినిధి: ఉన్నత స్థాయి అధికారుల్లో బాధ్యతారాహిత్యం పెరిగిపోతుందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఈ వైఖరి మారకుంటే తీవ్ర స్థాయిలో చర్యలుంటాయని హెచ్చరించారు.సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశానికి కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశానికి కార్యదర్శిలు సకాలంలో రాకపోవటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు. సమయానికి రాని అధికారుల నుంచి వివరణ తీసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. ఇంధన పొదుపుపై చర్చించేందుకు అధికారులు గైర్హాజరు కావడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు.సమావేశానికి కార్యదర్శులు సకాలంలో హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో జరిగిన సమావేశంలో అజెండా అంశాలు ముగిసిన అనంతరం తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు. ఇంధన పొదుపుపై చర్చించేందుకు మొదటి అజెండాగా పెట్టాలని గత రాత్రే సీఎం సీఎస్ కె. విజయానంద్‌కు స్పష్టం చేశారు. అయితే సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో సీఎం అసహనం వ్యక్తం చేశారు. అధికారులు లేకపోవడంతో వారికి ఖిసమాచారం సరిగ్గా ఇవ్వలేదా? అని విజయానంద్‌ను ప్రశ్నించారు. సమాచారం ఇచ్చానని విజయానంద్ బదులిచ్చారు.సమయపాలన పాటించని అధికారుల తీరుపై సీఎం మండిపడ్డారు. సమయానికి రాని అధికారుల నుంచి వెంటనే వివరణ తీసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై జరిగే సమావేశాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.

# కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యంతో 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరం

## - సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు

తిరుపతి,మే 14ప్రభాత వార్త ప్రతినిధి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరక్ష ్యల్ల కారణం గానే దేశంలో నీట్ పరీక్ష రాసిన 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు, మానసిక పరిస్థితి గందరగోళంగా మారిందని సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీ పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని మోడీ ఈవెంట్లు నిర్వహించడంలో అందవేసిన చేయని ఎద్దేవా చేశారు. పరీక్షలకు ముందు విద్యార్థులను పిలిపించుకుని ఏకాగ్రతతో చదవాలని, ఆత్మ స్థైర్యంతో పరీక్షలు రాయాలని విద్యార్థుల భుజం తట్టి చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. అయితే దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు రాసిన నీట్‌పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాకుండా ఆపడం కేంద్రానికి చేతకాలేదన్నారు. నీట్ ప్రశ్నాపత్రాలు లీక్ అవడం వెనుక బిజెపి యువమోర్చా నేతల ప్రధాన భాగస్వామ్యం ఉందని ప్రచార మాధ్యమాల ద్వారా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. బుధవారం తిరుపతిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు 89 సార్లు ప్రశ్నాపత్రాలు బయలకు వచ్చాయని ఆయన మండిపడ్డారు. ఇందులో 48 సార్లు ప్రశ్నాపత్రాలను తిరిగి ముద్రించి పరీక్షలు నిర్వహించారన్నారు. గతంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో ఎంతో పగడ్బందీగా నీట్ పరీక్షలు జరిగేవని ఆయన చెప్పారు. అలా కాకుండా ప్రైవేట్ ఏజెన్సీకి నీట్ పరీక్షలు నిర్వహణ బాధ్యతలు అప్పగించడంతో 140 ప్రశ్నలకు గాను 130 ప్రశ్నలు లీకయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. 2024 లో నీట్ పరీక్షలకు డైరెక్టర్ జనరల్ గా వ్యవహారించి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని వ్యక్తిని చత్తీస్గఢ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారంటే అక్రమార్కులకు బిజెపి ఎంత అండగా నిలుస్తుందో అర్థమవుతోందన్నారు.



ఇప్పటికైనా నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ఇందుకు కారణమైన అసలు దోషులను పట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, పిసిసి కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు,నెల్లూరు ఇన్‌ఛార్జి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి, పుంగు నూరు నియో జకవర్గం ఇంచార్జ్ మురళి మోహన్ యాదవ్,,చంద్రగిరి నియోజకవర్గం ఇంచార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీ

## - ఆంధ్రప్రదేశ్ సినీ రాజధానిగా తిరుపతి



తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతిలో ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీ నిర్మాణానికి పారడాక్స్ పిక్చర్స్ స్టూడియోస్ చేస్తున్న కృషిని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ అభినందించారు. పారడాక్స్ పిక్చర్స్ వ్యవస్థాపకురాలు,సినీ నిర్మాత కావ్య, సినీ నటుడు జయంత్ కలిసి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధి విస్తరణపై విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. నిర్మాతగా మారిన కావ్య, ఆంధ్రప్రదేశ్‌లోనే భారీ స్థాయిలో తెలుగు పాన్ఇండియా చిత్రాలను నిర్మించడంతో బాటు, రాష్ట్రవ్యాప్తంగా ప్రపంచ స్థాయి సినీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పారడాక్స్ పిక్చర్స్ రూపొందించిన దీర్ఘకాలిక విజన్‌ను మంత్రికి వివరించారు. ఈ విజన్‌లో భాగంగా జయకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తమ పాన్ఇండియా చిత్ర వివరాలను ఆమె పంచుకున్నారు. ఈ చిత్రం పూర్తిగా తిరుపతిలోనే నిర్మితమవుతోందని, ఇందులో బల్గేరియా, జింబాబ్వే, జపాన్, టోగో, ఆఫ్రికా తదితర దేశాలకు చెందిన నటీనటులు , కళాకారులు పాల్గొంటున్నారని నిర్మాత కావ్య తెలిపారు. అంతర్జాతీయ సినీ సహకారాలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావాలనే తమ నిర్మాణ సంస్థ లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తోందని ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖ వ్యక్తి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న మరో ప్రతిష్టాత్మక బయోపిక్ చిత్రం కూడా తిరుపతిలో విస్తృతంగా చిత్రీకరణ జరుపుకుంటోందని మంత్రికి వివరించారు. నిర్మాత కావ్య మాట్లాడుతూ పారడాక్స్ పిక్చర్స్ ఇప్పటికే తిరుపతిలో పూర్తిస్థాయి సినీ మౌలిక సదుపాయాలతో కూడిన ఫీచర్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థగా ఏర్పాటైందని తెలిపారు. దర్శకులు, సినిమాటోగ్రాఫర్లు, ప్రొడక్షన్ డిజైనర్లు, సెట్ డిజైనర్లు, ఎక్విప్‌మెంట్ రెంటల్ ఏజెన్సీలు, సాంకేతిక నిపుణులు, కొరియోగ్రాఫర్లు, జూనియర్ ఆర్టిస్ట్స్, చైల్డ్ ఆర్టిస్ట్స్, కాస్ట్యూమ్ డిజైనర్స్ , మేకప్ ఆర్టిస్ట్స్ మరియు ఫిల్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన విభిన్న విభాగాలను తిరుపతిలో ఒకే వేదికపైకి తీసుకువచ్చామని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా ఫిల్మ్ సిటీస్, ఫిల్మ్ స్టూడియోలు, ప్రొడక్షన్ సౌకర్యాలు, పోస్ట్‌ప్రొడక్షన్ ఎకోసిస్టమ్స్, శిక్షణా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటు పై కూడా చర్చలు జరిగాయి. యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడం, సినీ మౌలిక సదుపాయాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించారు.

# పొదుపు చర్యలు దశలవారీగా అమలు



## కేబినెట్‌లో డి.సిఎం పవన్ సూచనకు సిఎం చంద్రబాబు సానుకూల స్పందన

విజయవాడ, మే14,ప్రభాతవార్తప్రతినిధి:ప్రధాని నరేంద్రమోడీ సూచించిన పొదుపు సూత్రాలను పాటించడం తప్పని సరని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.ఈ విషయంలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో ప్రధాని సూచించిన పొదుపు చర్యలపై జరిగిన చర్చలో డిసీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఇంధనం విషయంలో తొలుత దేశం గురించి ఆలోచించాలి. పొదుపు చర్యలతో ఆదాయం తగ్గినా భరించేందుకు సిద్ధం. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజారవాణాను ప్రోత్సహించాలి. ప్రజాప్రతినిధులు తమ వాహనాలు తగ్గించుకోవాలి. వారానికి ఒకరోజు నో వెహికల్ డేగా పాటించాలి. ఇంధన వినియోగం తగ్గించుకోవాలని ఆర్టీసీని కోరాం. నేతలు, అధికారులు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని కోరాం. బంగారం కొనుగోళ్లు తగ్గించాలని సీఎం చేసిన ప్రతి సూచనను పాటించాలన్నారు. బంగారం కొనడం తగ్గిస్తే విదేశీమారక ద్రవ్యం పెంచుకోవచ్చునన్నారు,అయితే పొదుపు చర్యలు ఒక్కసారిగా ప్రజల్ని భయపెట్టే విధంగా కాకుండా దశల వారీగా చేపడదామని సూచించారు. పవన్ సూచనలకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ప్రతీ నిర్ణయానికి 48గంటల ముందు ప్రజల్ని సన్నద్ధం చేసి సమయం తీసుకుని ప్రకటన చేద్దామని సీఎం అన్నారు. తమ తమ శాఖల పరిధిలో పొదుపు చర్యలు, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలపై అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించాలని కార్యదర్శులకు ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్ మెంట్ ప్లాన్ కింద లక్ష కోట్ల ఖర్చు ప్రణాళికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాన్వాయ్ సగానికి కుదించుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలన్న ప్రధాని మోదీ సూచన మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను కుదించాలని భద్రతా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. జిల్లా పర్యటనల్లోనూ వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని నిర్ణయించారు.

# తడ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా



తిరుపతి,మే 14ప్రభాత వార్తప్రతినిధి: తిరుపతి జిల్లాలోని తడ శివాలయం సమీపంలో జాతీయ రహదారి రక్షణ గోడను ప్రైవేట్ బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో ప్రైవేటు బస్సు బోల్తా పడింది. శ్రీసిటీకి కార్మికులు, శిక్షణ విద్యార్థులతో వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దొరవారిసత్రం నుండి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు బయలుదేరిన ఈ బస్సులో దాదాపు 30 మంది ప్రయాణిస్తున్నారు. చీరాల ఇంజినీరింగ్ కాలేజీ, ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన డిప్లొమా విద్యార్థులు టీవీఎస్ పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ కోసం వెళ్తున్నారు.

ఈ ఘటనలో కృష్ణతేజ, రక్షి తశ్రీ, మనోజ్, హర్షద్, అఖిల తీవ్రంగా గాయపడ్డారు. స్వల్ప గాయాలైన వారిని స్థానికంగా చికిత్స అందించగా, తీవ్రంగా గాయపడిన రక్షి తశ్రీని సూళ్లూరుపేటకు తరలించారు.

# తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలో రూ.1.57 కోట్లతో 68 జల సంరక్షణ పనులు

## - నీటి సంరక్షణ పనులతో 3,612 ఎకరాలకు సాగునీరు

తిరుపతి,మే 14ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం మండలంలో 1.57కోట్ల రూపాయలతో 68 జల సంరక్షణ పనులు మొదలయ్యాయి. నీటీ సంరక్షణ పనులతో 3,612 ఎకరాలకు సాగునీరు అందనుంది. మండలంలోని వేంబాకం, కొట్టాకాడు, నాగలాపురం, రాజుల కండ్రిగ, సదాశివ శంకరాపురం పంచాయతీ రైతులకు సాగునీటి ప్రయోజనం చేకూరుతుంది. జలధార-జలహారతితో రైతులకు రెట్టింపు ప్రయోజనం కలిగే ఈపనులు చేపడుతున్నారు. పూడికతీతతో మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్న కాలువలు, నిండుకుండలా మారే చెరువులు, పెరుగుతున్న భూగర్భ జలాలు రైతు జీవితాల్లో కొత్త ఆశల విత్తనాలు నాటుతున్నాయి. ప్రతి నీటి బొట్టును భవిష్యత్తుకు భద్రపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు గ్రామీణ ప్రాంతాలకు సాగునీరు, ఉపాధి, ఆనందాన్ని ఒకేసారి అందిస్తున్నాయి.

# టిటిడిలో పొదుపుమంత్రం అమలయ్యేనా? పదుల సంఖ్యలో వాహనాలు సొంతపనులకే!

## - ఒకటి దాటితే వాహనాలు వెనక్కిచ్చేస్తారా?

తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో వాహనాల వినియోగంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పొదుపుమంత్రం అమలవుతుందా?అనే సందిగ్ధ ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కొందరు అధికారులు ఏకంగా టిటిడి వాహనాలను తమతమ కుటుంబసభ్యులకు, సొంత పనులకు వాడుకుంటున్నారనే ప్రచారం ఉంది. టిటిడిలో రవాణావిభాగం నిర్వహిస్తున్న రికార్డుల్లో కూడా కొంతమంది లెక్కకు మించి వాహనాలను వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పొదుపు సూచనలపై ఆయన స్పందించారు. పిఎం మోదీ సూచనలతో రాష్ట్రంలోనూ మంత్రులు,ఉన్నతాదికారులు, ప్రజాప్రతినిధులు వినియోగిస్తున్న వాహనాల సంఖ్యను భారీగా కుదించి వారంలో ఒకరోజు ప్రభుత్వ ప్రజారవాణా బస్సుల్లో, మెట్రోల్లో వెళ్లాలని సూచించారు. ఇదే క్రమంలో సిఎం, డిసిఎం, మంత్రులు కొందరు తమ వాహనాల శ్రేణిని బాగా కుదించేసుకున్నారు. ఈ పొదుపు మంత్రం టిటిడిలో అమలుచేస్తారా అనేది సందిగ్ధత చర్చ మొదలైంది. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలని,దీని వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని సిఎం తెలిపారు. ఇంటి నుంచే పనిచేసే పరిస్థితి వస్తుందని,దీనిని ప్రోత్సహించాలని సూచించారు. అయితే టిటిడిలో ఈ వాహనాల దుబారాను ఎంతవరకు కట్టడిచేయగలరనేది ఇప్పుడు ఉద్యోగవర్గాల్లో ప్రధాన చర్చ జరుగుతోంది. టిటిడిలో రవాణావిభాగం కూడా ఒకకీలకం.సూపరింటెండెంట్ స్థాయి నుండి ఉన్నతస్థాయిలో ఇఒ,అదనపు ఇఒలు,జెఇఒలు,డిప్యూటీ ఇఒల వరకు టిటిడి వాహనాలను కేటాయించింది. ఇప్పటికే తక్కువశాతంలో విద్యుత్‌తో నడిచే వాహనాలను యాత్రికులను చేరవేసేందుకు ఉచిత ధర్మరథాలు, కొందరు కార్లు వినియోగిస్తున్నారు. సుమారుగా 350వరకు పలు రకాల వాహనాలు ఉన్నాయి. ఇందులో ఇఒకు మూడు కార్లు కేటాయించారు.ఒక వాహనం ఇఒ వినియోగించుకొంటుండగా మరో రెండు వాహనాల్లో ఒకటి కుటుంబసభ్యులకు మరొకటి రిజర్వులో ఉంటుంది. ఇక అదనపు ఇఒ అధికారికి ఇదే రీతిలో వాహనాలు ఉంటాయి. జెఇఒలకు ఒక్కో వాహనం కేటాయించారు. డిప్యూటీ ఇఒ హోదా అధికారులకు 15మంది వరకు ఉండగా ఒక్కొక్కరికి ఒక్కో వాహనం విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారు. కొన్ని విభాగాల్లో ఎఇఒలు, సూపరింటెండెంట్ స్థాయి అధికారులకు వాహనాలు కేటాయించారు. ఇంజనీరింగ్ విభాగంలో సిఇ,ఎస్ఇల నుండి డిఇఇలు, డిఇల వరకు లెక్కకు మించి వాహనాల వినియోగం ఉందనేది టిటిడిలో పెద్ద దుమారం. టిటిడి ఛైర్మన్ వినియోగించే కారు ఒక్కటే.

# సత్యసాయి స్కీంను బోర్డు ద్వారానే కొనసాగించాలి: సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

## - జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం స్పందించకపోతే మే 18న కలెక్టర్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం, మే 14 ప్రభాతవార్త బ్యూరో సత్యసాయి త్రాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి 5 నెలల బకాయి వేతనాలు, గ్రాట్యుటీ చెల్లించాలని, అలాగే స్కీంను బోర్డు ద్వారానే కొనసాగించాలని కోరుతూ గురువారం అనంతపురంలోని గణేనాయక భవన్‌లో నిర్వహించిన కార్మిక, రైతు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1998 సంవత్సరంలో ప్రారంభమైన శ్రీ సత్యసాయి బాబా వాటర్ సప్లై స్కీమ్ ద్వారా సుమారు 9 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు అందుతోంది. 850 గ్రామాలకు సేవలు అందిస్తున్న ఈ పథకంలో 543 మంది కార్మికులు రాత్రింబవళ్ల కష్టపడి పనిచేస్తున్నారు. కరోనా కాలంలో కూడా తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోకుండా సేవలందించిన కార్మికులకు నేడు వేతనాలు, గ్రాట్యుటీ బకాయిలు పేరుకుపోవడం దురదృష్టకరమని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది.2021 సంవత్సరం నుంచి స్కీం నిర్వహణను టెండర్ విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించడం, ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యం, లబ్ధిదారుల నుంచి 30 శాతం నిధులు వసూలు చేసే నిబంధన అమలు కాకపోవడం వల్ల ప్రతి ఏడాది కార్మికులు తమ హక్కుల కోసం సమ్మెలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని సమావేశం పేర్కొంది.సత్య వాటర్ స్కీం నిర్వహణకు ప్రతి సంవత్సరం కరెంట్ బిల్లులు, రిపేర్లు, కార్మికుల వేతనాలు తదితర ఖర్చులతో కలిపి సుమారు రూ.100 కోట్లు అవసరమవుతున్నాయని సమావేశంలో పలువురు నేతలు, కార్మికులు వివరించారు. 1998లో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ వ్యవస్థ ప్రస్తుతం పూర్తిగా పాడైపోయే స్థితికి చేరుకుందని, దానిని పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పది నియోజకవర్గాలకు సురక్షితమైన త్రాగునీరు అందిస్తున్న ఈ కీలకమైన పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు.ఇప్పటికే పంచాయతీల వద్ద తగిన నిధులు లేక కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉన్నందున, ఈ స్కీంను జిల్లా పరిషత్ లేదా పంచాయతీలకు అప్పగించడం అంటే పథకాన్ని నిర్వీర్యం చేయడమే అవుతుందని సమావేశం హెచ్చరించింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల బకాయి వేతనాలు, గ్రాట్యుటీ వెంటనే చెల్లించి సమ్మెను పరిష్కరించాలని, లేనిపక్షంలో 18వ తేదీ భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

# తిరుమల సమాచారం

## టిటిడి ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు రూ.1.51 కోట్లు విరాళం



తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. అన్ని పథకాలకు దాతలు ఇతోదికంగా విరాళాలందించగా ప్రస్తుతం ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు మరిన్ని నిదులు సేకరించే దిశగా టిటిడి పాలకమండలి, టిటిడి అదికారులు దాతలను ప్రోత్సహిస్తున్నారు. గురువారం ఉదయం రిలయన్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.ఎం.ఎస్ ప్రసాద్ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 1.51 కోట్లు రూపాయలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ పేష్కార్ రామకృష్ణకు విరాళం డిడిని అందజేశారు.

## తిరుమలలో అమలుకాని పేపర్‌కప్స్ నిషేధం

### - యధేచ్ఛగా మఠాల్లో అనుమతి



తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలను పర్యావరణ పరిరక్షణ దిశగా, కాలుష్య నియంత్రణకు టిటిడి కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే గత ఆరేళ్ళుగా ప్లాస్టిక్ నీళ్ళ సీసాలు, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. అదేగాక కొండపై టీ దుకాణాల్లోనూ, ఇతరత్రా హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లోనూ ప్లాస్టిక్ నీళ్ళసీసాలు నిషేదించి ఆ స్థానంలో గాజుసీసాలో నీళ్లను అందిస్తున్నారు. టీ,కాఫీ, పాలు వంటి ద్రవపదార్థాలు వినియోగానికి పేపర్‌కప్పులు బదులు గాజు,స్టీల్ గ్లాసులు వినియోగిస్తున్నారు. తిరుమలలో పేపర్‌కప్పులు కూడా ఆరోగ్యశాఖ నిషేధించింది. అయితే పలు రకాలుగా ప్రైవేట్ ఫంక్షన్‌లు జరుపుకునే మఠాలు, టిటిడి కాటేజీల వద్ద ఈ పేపర్‌కప్పులు కనిపిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. కళ్యాణం మండపాలు, వివాహ వేదికల్లో యధేచ్ఛగా పేపర్‌కప్పులు వాడకం ఉంటుందని చెబుతున్నారు. యాత్రికుల శ్రేయస్సు కోసం వేడి పానియాలైన టీ, కాఫీ ,పాలు లాంటి వేడి పానియాలు పేపర్ కఫ్ ద్వారా అందించరాదని ఆదేశాలు జారీ చేసి అందుకు అనుగుణంగా సంబంధిత దుకాణాల్లో గాజు, స్టీల్ గ్లాసు గాకుండా పేపర్ కఫ్ వాడితే వారికి జరిమానాలు విధిస్తున్నారు. శుభ కార్యాలలో తిరుమలలో ఇలా వందలు, వేల సంఖ్యలో వీటి వినియోగం ఉంటున్నా ఆరోగ్యశాఖ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వెలిబుస్తున్నారు.

## 28 నుండి నారాయణవనం కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలో కొలువైన పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుండి జూన్ 5వ తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. మే 27న సాంప్రదాయబద్ధంగా అంకురార్పణ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.ఆకాశరాజు నిర్మించిన ఈ పుణ్యక్షేత్రం పద్మావతీ దేవి అవతరించిన పవిత్ర స్థలంగా నారాయణవనం ప్రసిద్ధి చెందింది. ఆకాశరాజు పుత్రకామేష్టి యాగ సమయంలో స్వర్ణహలంతో భూమిని దున్నుతుండగా పద్మంపై వెలసిన దివ్య శిశువును కనుగొని"పద్మావతి" అని నామకరణం చేశారు. అనంతరం శ్రీనివాసుడు వేటకు విచ్చేసిన సందర్భంలో పద్మావతీదేవిని దర్శించి, ఆకాశరాజు అనుమతితో సకల దేవతల సమక్షంలో వివాహం జరిగింది. ఆ దివ్య కల్యాణ ఘట్టానికి చిరస్మరణగా ఆకాశరాజు నారాయణవనంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి వక్షస్థలంలో మహాలక్షీ ్మదేవి కొలువై ఉండగా, ఆలయ ప్రాంగణంలో పద్మావతి అమ్మవారు, గోదాదేవి అమ్మవార్ల సన్నిధులు భక్తులకు దర్శనమిస్తాయి. అలాగే కోదండరామస్వామి, రంగనాథస్వామి,రాజమన్నార్‌స్వామి ఉపాలయాలు ఈ క్షేత్ర మహిమను మరింత పెంచుతున్నాయి. కాగా బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయంలో మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర ద్రావణాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయనున్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలపై స్వామి, అమ్మవారు విహరించి భక్తులను ఆశీర్వదించనున్నారు.

## 26న ఖాళీ గోనె సంచుల ఇ-వేలం

తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో వినియోగించిన ఖాళీ గోనె సంచులను 2026-27 సంవత్సరానికి ఈనెల26న ఈ వేలం ద్వారా విక్రయించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన వాళ్ళు మే 25 మధ్యాహ్నంలోపు ఆన్‌లైన్‌లో 75వేల రూపాయలు ఇఎండీ చెల్లించాలి. ఇతర వివరాలకు టిటిడి మార్కెటింగ్ కార్యాలయం, తిరుపతిని కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చు.

## తిరుపతిలోనూ వేలాదిమంది భక్తులకు టిటిడి వసతికల్పన

### - విశ్రాంతి సముదాయాల్లో లాకర్, విశ్రాంతి, అన్నప్రసాదాలు సేవలు





తిరుమల,మే 14ప్రభాతవార్తప్రతినిధి: దేశవిదేశాల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు తిరుపతిలో కూడా టిటిడి వసతికల్పన చేస్తోంది.ఇందుకోసం తిరుపతిలోని శ్రీనివాసం, మాదవం, విష్ణునివాసం, ఎస్వీవిశ్రాంతి భవనం, రేణిగుంట సమాచార కేంద్రంలో భక్తులకు వసతి సదుపాయం ఉంది. అన్ని విశ్రాంతి సముదాయాల్లోనూ సామాన్యభక్తులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ టిటిడి లాకర్లు, విశ్రాంతి హాళ్ళు, అన్నప్రసాదం ఉచితంగా అందిస్తోంది. టిటిడి నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం అమలుచేస్తోంది.తిరుమలేశుని దర్శనం కోసం ప్రతిరోజూ దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం, వైద్య తదితర సౌకర్యాలను టిటిడి అందుబాటులో ఉంచింది. భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, మాధవం, ఎస్వీ గెస్ట్ హౌస్, పద్మావతీ గెస్ట్ హౌస్, తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్ వంటి వసతి సముదాయాలను టిటిడినిర్వహిస్తోంది. వీటితో పాటు డార్మిటరీలు, ఉచిత లాకర్లు, మరుగుదొడ్లు, స్నాన పుగదులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీ గదులను ఆన్ లైన్ , రొటేషన్ విధానంలో భక్తులకు కేటాయిస్తున్నారు. నాన్ ఏసీ గదులను ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన కేటాయిస్తున్నారు. 2011లో ప్రారంభించి ,408 గదులు, 09 హాళ్లు, 706 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీ గదులను ఆన్‌లైన్ ,రొటేషన్ విధానంలో భక్తులకు కేటాయిస్తున్నారు.శ్రీనివాసం కాంప్లెక్స్ 2003లో ప్రారంభమైంది. ఇందులో 552 గదులు, 09 డార్మిటరీలు, 1,038 లాకర్లు ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీ, డీలక్స్ గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి.మాధవం గెస్ట్ హౌస్ 2009లో ప్రారంభించారు. ఈ విశ్రాంతి గృహంలో164 ఏసీ గదులు, డీలక్స్ సూట్లు ఉన్నాయి. ఎస్వీ గెస్ట్ హౌస్ 1955లో నిర్మించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌కు సమీపంలోనే ఉన్న ఈ విశ్రాంతి భవనంలో ఏసీ, నాన్ ఏసీ కలిపి 31 గదులను భక్తులకు కేటాయిస్తున్నారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన గదులను కేటాయిస్తున్నారు. ఇక రేణిగుంట సమాచార కేంద్రంలో 4 గదులు, ఒక డార్మిటరీ, 18 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. 2002లో ప్రారంభమైన అలిపిరి భూదేవి కాంప్లెక్స్ లో ఒక డార్మిటరీ, 100 లాకర్లు ఉన్నాయి. తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్‌లోని గెస్ట్ హౌస్ 1982లో భక్తులకు అందుబాటులోకి రాగా, అందులో 30 గదులను ఆన్ లైన్ లో నిబంధనల ప్రకారం బుకింగ్ చేసుకోవచ్చు. తిరుపతి పద్మావతీ విశ్రాంతి భవనం 1979లో భక్తులకు అందుబాటులోకి రాగా, అందులో ఉన్న 35 గదులు ప్రోటోకాల్ ప్రతినిధులకు కేటాయించబడుతున్నాయి. విష్ణునివాసం, శ్రీనివాసం, తోళ్లప్ప గార్డెన్స్‌లలో అన్నప్రసాదం సౌకర్యం కూడా భక్తులకు అందుబాటులో ఉంది. తిరుపతిలోని విష్ణునివాసంలో పరిమిత సంఖ్యలో గదుల కేటాయింపు కరెంట్ బుకింగ్ లో మినహా, తిరుపతిలోని మిగిలిన అన్ని చోట్ల నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి.ఇన్" వెబ్ సైట్ లో ముందస్తుగా భక్తులు బుక్ చేసుకోవాలి. ఒంటరి ,అవివాహిత స్త్రీ, పురుష జంటలకు గదులు కేటాయించబడవు.

# వేడిని తరిమే డ్రింక్



ఎండలు మండిపోతున్నాయ్ ! ఈ తరుణంలో వేడిని తరిమికొట్టి, శరీరానికి చలువనిచ్చే ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవడం మామూలే. మరి, డ్రింక్స్ విషయానికొస్తే.. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకురసం.. వంటివి తీసుకుంటుంటాం. అయితే వీటితోపాటు ఇంట్లోనే సులభంగా తయారుచేసుకోగలిగే, తక్షణమే శరీరానికి చల్లదనాన్ని అందించే పుదీనా జల్ జీరా డ్రింక్‌ని మీరెప్పుడైనా ట్రై చేశారా? మరింకెందుకాలస్యం..

**కావాల్సినవి :** పుదీనా ఆకులు-అర కప్పు, నిమ్మరసం-6 టేబుల్ స్పూన్లు, నల్ల ఉప్పు-2 టీ స్పూన్లు, నీళ్లు-8 కప్పులు, జీలకర్ర-2 టేబుల్ స్పూన్లు , కొత్తిమీర - అర కప్పు, అల్లం తురుము- 2 టేబుల్ స్పూన్లు, చక్కెర-4 టేబుల్ స్పూన్లు, చింత పండు గుజ్జు - 2 టేబుల్ స్పూన్లు , ఉప్పు- టీ స్పూన్, ఐసు ముక్కలు - సర్వింగ్స్‌కి సరిపడా

**తయారీ :** ముందుగా పుదీనా, కొత్తిమీర శుభ్రంగా కడిగి, సన్నగా తరుక్కోవాలి. వీటన్నింటినీ ఒక బౌల్‌లోకి తీసుకొని, అందులో చింతపండు గుజ్జు, వేయించిన జీలకర్ర, అల్లం తురుము వేసి బాగా కలుపుకోవాలి. వీటిని మిక్సీ జార్‌లోకి తీసుకొని, అందులో ఉప్పు, నల్ల ఉప్పు, చక్కెర, నిమ్మరసం, నాలుగు కప్పుల నీళ్లు పోసి పదార్థాలన్నీ బాగా బ్లెండ్ అయ్యేలా..జ్యూస్ లాగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వడకట్టుకొని మిగిలిన పిప్పిని పడేయాలి. ఈ రసంలో మిగతా నాలుగు కప్పుల నీళ్లు కూడా పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసుల్లో పోసుకొని.. ఐస్ క్యూబ్స్ వేసి, నిమ్మచెక్కలు-పుదీనాతో గార్నిష్ చేసుకొని, సర్వ్ చేస్తే ఎంతో రుచిగా, చల్లచల్లగా ఉండే పుదీనా జల్ జీరా డ్రింక్ సిద్ధం.

# వంటగది అందంగా !



**ఇంటి అలంకరణ అంటే..** హాలు, వరండా, పడకగది బాల్కనీ మాత్రమే కాదు.. వంటగది కూడా. ఎందుకంటే ఆడవాళ్లు ఎక్కువ సేపు గడిపేది అక్కడే. కాస్త ఆలోచిస్తే అందంగానే కాదు, సౌకర్యకంగానూ మార్చుకోవచ్చు. అప్పుడే వంట శుచిగా, శుభ్రంగానే కాదు.. మనమూ ఆరోగ్యంగా ఉండొచ్చు. వంటగదిలో గోడల రంగుల గురించి పెద్దగా పట్టించుకోం. కానీ, గ్రాస్‌గ్రీన్, పసుపు, గ్రే, బ్రీజీ బ్లూ, సాఫ్ట్‌గ్రే వంటిల్లు పొందిగ్గా వంటివి ఎంచుకుంటే.. మనసుకి ఉత్తేజాన్ని కలిగిస్తాయి.

గది చిన్నగా ఉన్నా విశాలంగా అనిపిస్తుంది. ఇక్కడ వాల్ ఆర్ట్ అంతగా నప్పదు. వంట సామాన్లు ఎన్ని ఉన్నా.. అవసరానికి ఏదో వెలితిగానే అనిపిస్తుంది. అలాగని ఇల్లంతా వస్తువులతో నింపేయకండి. ఎప్పుడో ఒకసారి వాడే పాత్రల్ని అక్కడి నుంచి తరలించి మరో చోట సర్దండి. పారదర్శకంగా ఉండే కంటైనర్లలో పోస్తే ఏ పప్పు ఎక్కడుందో ఇట్టే తీసుకోవచ్చు. అలానే మీరు వినియోగించే పదార్థాల పరిమాణాన్ని బట్టి వాటికి అవసరమైన డబ్బాలను ఎంచుకుంటే స్థలం సరిపోవడం లేదనే సమస్య ఉండదు. ఇక, ఇప్పుడు పనిని సులువు చేసే మార్గాలెన్నో ఉన్నాయి. ఇందుకోసం గ్యాసు వెనక గోడపై జిడ్డు చేరకుండా లింట్ ఫ్రీ షీట్స్ దొరుకుతున్నాయి. వాటిని వేసుకుంటే త్వరగా శుభ్రం చేసేయొచ్చు. అలానే షెల్ఫ్ ర్యాకుల్లో వేసుకునేందుకు, ఆయిల్, వాటర్ ఫ్రీ, పేపర్స్‌ని ఎంచుకోండి. ఇవి అందంగా కనిపించడమే కాదు.. తరచూ మార్చాల్సిన అవసరమూ ఉండదు. టీ, కాఫీ పొడులూ, పంచదార వంటివాటితో పాటు పచ్చళ్లు, మసాలాలు వంటివాటిని వేడివేడిగా పెట్టే బదులు ఆర్గనైజింగ్ ట్రేల్లో పెట్టేస్తే సరి. అవసరమైనప్పుడు అన్నీ ఒకే చోట దొరికేస్తాయి. ఒద్దికగానూ ఉంటాయి. వంట గదికి అనుకుని బాల్కనీ ఉంటే. అక్కడ చిన్న చిన్న కుండీల్లో మనకు కావాల్సిన కొత్తిమీర, పాలకూర, పుదీనా వంటి మొక్కల్నీ పెంచుకోవచ్చు. ఇవి వేగంగా పెరుగుతాయి. తాజా ఆకులు వంటకాలకు రుచినీ పెంచుతాయి.

# ఈ కాలంలో మేకప్ చెదిరి పోకుండా..



చెమట, ఉక్కపోత, వీటిని తట్టుకుంటూ అందాన్ని సంరక్షించుకోవడం అంత ఈజీ కాదు. ఇక మేకప్ వేసుకునే వారికి ఇది మరింత సవాలు! అయితే కొన్ని చిట్కాలు పాటించడం వల్ల ఈ కాలంలోనూ మేకప్ చెదిరిపోకుండా, ఎక్కువ సమయం నిలిచి ఉండేలా కాపాడుకోవచ్చు.

వేసవిలో ఎంత లైట్‌గా మేకప్ వేసుకుంటే అంత మంచిది. అది కూడా జెల్ లేదా నీటి ఆధారిత మేకప్ ఉత్పత్తులు ఉపయోగించడం వల్ల ఎంత వేడికి కరిగి పోకుండా జాగ్రత్తపడచ్చు.మేకప్ వేసుకోవడానికి అరగంట ముందు ఐస్‌క్యూబ్‌తో మర్దన చేసుకోవడం మంచిది. ఈ క్రమంలో ఒక మస్లిన్ క్లాత్‌లో ఐస్‌క్యూబ్‌ను చుట్టి.. ముఖంపై నెమ్మదిగా రుద్దుకోవాలి. ఇది అధిక చెమటను తగ్గించి మేకప్ చెదిరిపోకుండా చేస్తుంది. ఎండ వేడికి ఫౌండేషన్ త్వరగా కరిగిపోతుంది. కాబట్టి దీనికి బదులు సిసి క్రీమ్ ఉపయోగించడం మేలు. ప్రైమర్ కూడా వేడికి మేకప్ కరిగిపోకుండా కాపాడుతుంది. అయితే వీటిలోనూ నీటి ఆధారిత ఉత్పత్తుల్ని ఎంచుకోవడం మంచిది. ప్రస్తుతం ఇవి స్ప్రే రూపంలో కూడా లభిస్తున్నాయి. ఈ కాలంలో కంటి మేకప్ విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కాటుకకు బదులు వాటర్‌ప్రూఫ్ లిక్విడ్ లైనర్, మ్యాట్ తరహా ఐషాడో ప్రైమర్.. వంటివి ఎంచుకుంటే వేడికి కరిగిపోకుండా జాగ్రత్త పడవచ్చు.మేకప్ వేసుకున్నా వేసుకోకపోయినా ఈ కాలంలో సన్‌స్క్రీన్ మాత్రం తప్పనిసరి. అయితే మేకప్ వేసుకునే వారు దీన్ని అప్లై చేసుకోవాలనుకుంటే స్ప్రే తరహాది ఎంచుకోవడం మంచిది. ఈ క్రమంలో మేకప్ పూర్తయ్యాక సన్‌స్క్రీన్‌ను స్ప్రే చేసుకోవాలి. వేసవిలో టి-జోన్ (నుదురు, ముక్కును కలిపే ప్రాంతం) ఎక్కువ జిడ్డుగా కనిపిస్తుంటుంది. కాబట్టి మేకప్ పూర్తయ్యాక ఈ భాగంలో మరోసారి పౌడర్‌తో టచప్ ఇవ్వడం మర్చిపోవద్దు. ఈ కాలంలో షిమ్మర్ (మెరుపు ఆధారిత) మేకప్ ఉత్పత్తులకు దూరంగా ఉంటేనే సహజసిద్ధమైన లుక్‌ని సొంతం చేసుకోవచ్చు. ఇక మేకప్ పూర్తయ్యాక సెట్టింగ్ స్ప్రేను ఉపయోగిస్తే.. మేకప్ ఎక్కువ సమయం నిలిచి ఉండడంతో పాటు తాజా లుక్ మీ సొంతమవుతుంది.



# పిలిస్తే పలికే జగన్నాథుడు

పాండవులను అవమానించాలనుకున్న దుర్యోధనుడు వారి వద్దకు దుర్వాస మునిని పంపాడు. శిష్యులతో సహా వెళ్లిన ముని తాము ఆకలితో వచ్చామని చెప్పాడు. అది విన్న ధర్మజుడు మీరాకతో మా పర్ణశాల పావనమైంది. స్నానంచేసి రండి, భోజనం సిద్ధం చేస్తా అన్నాడు. అందరికి ఎలా వడ్డిస్తాడో చూద్దాం అనుకున్నాడు దుర్వాసముని. అక్షయపాత్ర నుంచి రోజుకొక్కసారే ఆహారం లభిస్తుంది. ఇప్పుడేం చెయ్యాలి? అనుకుంది ద్రౌపది. భక్తితో కృష్ణుణ్ణి స్మరించి నిండుసభలో నన్ను దుశ్శాసనుడు అవమానించగా ఆదుకున్నావు! ఇప్పుడు మహర్షి గణానికి అతిథ్యమివ్వడంలో భంగం కలగనివ్వకు కృష్ణ అంటూ వేడుకుంది. శ్రీకృష్ణుడు క్షణాల్లో ప్రత్యక్షమై, బాగా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఇవ్వమ్మా అన్నాడు. నువ్వు కూడా నన్ను పరీక్షిస్తున్నావా? అంటూ బిక్కమొహం పెట్టి సమస్యను వివరించింది ద్రౌపది. కృష్ణుడు నవ్వి అక్షయపాత్రను తెమ్మని చెప్పాడు. అక్షయపాత్ర అడుగున అతుక్కుని ఉన్న మెతుకును చూపి దీనిని పెట్టామన్నాడు. ద్రౌపతి అలానే చేసింది. అది తిని, దుర్వాసుడు ఆశీర్వదించి వెళ్లాడు, దిగులు పడకు అన్నాడు. ముని బృందానికి అక్షయపాత్రలోంచి వడ్డించగా అందరూ తృప్తిగా తిన్నారు. కృష్ణుడి మహత్తుకు ద్రౌపదితో బాటు పాండవులంతా సంతోషించారు. భక్తుల పట్ల భగవంతుడికి ఎంత కరుణో చూడండి. పిలిచిన క్షణమే వచ్చి ఆదుకున్నాడు అన్నాడు దుర్వాసుడు తన శిష్యులతో.

# చంటి పిల్లల్లో సమస్య..



**చంటి పిల్లల్లో తరచూ ఎదురయ్యే సమస్య మలబద్ధకం.** పిల్లలు చురుగ్గా ఉంటే మనకే బాధా ఉండదు. కానీ ఇలాంటి సమస్యలు ఎదురవ్వగానే కంగారుపడి డాక్టర్ దగ్గరికి పరుగుపెడతాం. అలా చేయడం మంచిదే అయినా, ఈ చిట్కాలు పాటించి చూడండి. ఫలితం ఉంటుంది. చిన్నపిల్లలకి వ్యాయామాలేంటి అనుకుంటున్నారా? ఇది తేలిక పాటి వ్యాయామం. బుజ్జాయిని వెల్లకిలా పడుకోబెట్టి, కాళ్లను సైకిల్ తొక్కిన మాదిరిగా చేయాలి. అలా కాసేపు చేస్తే పేగుల్లో కదలిక జరిగి మలబద్ధకం తొలగిపోతుంది. వేడినీటితో స్నానం చేయించాలి. దీని వల్ల వారి శరీరానికి చక్కని ఉపశమనం లభిస్తుంది. శరీర భాగాలన్నీ చురుగ్గా మారతాయి. బుజ్జాయి పొట్ట ఖాళీ అవుతుంది. బుజ్జిపొట్టపై కొబ్బరినూనె రాసి చేత్తో సున్నితంగా వృత్తాకారంలో మసాజ్ చేయండి. దీని వల్ల పేగు కదలికలు మెరుగు వుతాయి. సమయానికి పాలు పట్టాలి. అలాగే ఏడాది దాటిన చిన్నారులకి సమయానుగుణంగా కొద్దిగా మంచి నీటిని కూడా తాగించాలి. ఘనాహారం పెడుతుంటే. మెత్తగా ఉడికించిన బార్లీ, గోధుమ ఓట్స్ వంటి పీచు ఉండే ఆహారపదార్థాలను పెట్టాలి. ఇవి మలబద్ధకాన్ని తగ్గిస్తాయి.

# సంతోషాన్నిచ్చే సబ్బు బుడగలు !



**సాధారణంగా ఒత్తిడి పెద్దల్లోనే** ఉంటుందనుకుంటాం. కానీ, పిల్లల్లోనూ ఎక్కువే అంటున్నాయి పలు అధ్యయనాలు. దీన్ని తగ్గించడానికి పనిచేస్తుందో సరదా ఆట. అదే సోప్ బబుల్ గేమ్. విన్నట్లే ఉంది కదూ! చిన్నప్పుడు మనం నీళ్లల్లో కాస్త సర్ఫ్ కలిపి బొప్పాయి ఆకుల గొట్టల సాయంతో బుడగల్ని సృష్టించి సంబరపడిపోయేవాళ్లం. ఇప్పుడు దాన్నే మీ చిన్నారికీ నేర్పించండి. ఇందుకోసం మూడు వంతుల నీళ్లు, ఒక వంతు సర్ఫ్ తీసుకోండి అందులోనే ఓ చెంచా గ్లిజరిన్ కూడా చేర్చి బాగా గిలకొట్టండి. అందులో రింగులాంటిదాన్నో, బొప్పాయి ఆకు కాడనో ముంచి తీసి వారిని బలంగా ఊదమనండి ఎన్ని బుడగలు వస్తాయో! గాల్లోకి ఎగిరే ఆ బబుల్స్‌ని పట్టుకోవడానికి ప్రయత్నించడంలో వారెంతో సంతోషపడిపోతారు. ఇలా ఉదయమో, సాయంత్రమో ఆరుబయటఆడితే.. బబుల్స్‌కాస్తా కాంతి పరావర్తనం కారణంగా రంగుల్లోకి మారి ఆకట్టుకుంటాయి. మెదడుకీ తగినంత ఆక్సిజన్ అంది చురుగ్గా పనిచేస్తుంది. ఒంట్లో రక్త సరఫరా సక్రమంగా జరుగుతుంది. ముఖ్యంగా ఈ ఆట వల్ల ఆనందాన్ని కలిగించే హార్మోన్లు విడుదలై ఒత్తిడినీ తగ్గిస్తాయి.

# ప్రేక్షకుల ముందుకు 'దూరదర్శని'



'సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ దూరదర్శని. కలిపింది ఇద్దరిని ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి.ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేట్రికల్‌గా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్న ఈ సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో ప్రియదర్శి, రాజు వెడ్స్ రాంబాయ్ చిత్ర దర్శకుడు సాయి కంపాటి హాజరయ్యారు. దర్శకులు సాయిలు కంపాటి మాట్లాడుతూ టైటిల్ బాగుంది. 90వ దశకంలో పుట్టిన అందరికి కనెక్ట్ అవుతుంది. తప్పకుండా సినిమా అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నాను అన్నారు ప్రియదర్శి మాట్లాడుతూ ఇలాంటి కొత్త సినిమాను సపోర్ట్ చేయాలని ఉంది. ఈ సినిమా ట్రైలర్ చూడగానే నా చిన్నప్పటి రోజులు గుర్తొచ్చాయి. ఆ రోజుల్లో అందరికి ప్రపంచాన్ని పరిచయం చేసింది దూరదర్శని. నేను కూడా చిన్నప్పుడు దూరదర్శనిలో సినిమాలు చూసి ఇన్‌స్పైర్ అయ్యి నటుడిగా మారాను జెమిని సురేష్ మాట్లాడుతూ నాలోని నటుడిని చూసుకునే అవకాశం దూరదర్శని సినిమా ద్వారా కలిగింది. ఈ సినిమాలో నటించడం నాకెంతో సంతోషానిచ్చింది. చిత్ర దర్శకుడు కార్తీకేయ కొమ్మి మాట్లాడుతూ ఖిఖిఅందరికి చిన్న సినిమాలా కనిపిస్తున్న ఈ సినిమా విడుదల తరువాత ఆ ఫీల్ పోతుంది. హీరో, హీరోయిన్‌ల పర్‌ఫార్మెన్స్ ఈ చిత్రానికి హైలైట్‌గా ఉంటుంది. సినిమాలో ఉన్న ఎమోషన్ అందరి హృదయాలకు హత్తుకుంటుంది అన్నారు.

## తెర

# 'పెద్ది' ముంబైలో మ్యాసివ్ ట్రైలర్ లాంచ్



'పెద్ది' గ్రాండ్ పాన్ ఇండియా ప్రమోషన్స్ ముంబైలో మ్యాసీవ్ ట్రైలర్ లాంచ్, భోపాల్‌లో ఏఆర్ రెహమాన్ లైవ్‌లో మెగా సాంగ్ పెర్ఫార్మెన్స్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన మచ్ అవైటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'తో బాక్సాఫీస్ తుఫాన్ సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్సెస్‌లో చరణ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచాయి. ఇప్పుడు ఈ చిత్రానికి పాన్ ఇండియా స్థాయిలో మ్యాసీవ్ ప్రమోషన్స్ ప్రారంభమవుతున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై 'పెద్ది'ని భారతీయ సినిమాకు కొత్త అనుభూతిని ఇచ్చే విజువల్ స్పెక్టకిల్‌గా రూపొందించారు. ఇప్పుడు ఆ ఎక్సయిట్మెంట్ మరింత పెంచుతూ ముంబై, భోపాల్ నగరాల్లో రెండు భారీ ఈవెంట్స్ ప్లాన్ చేశారు. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ఈవెంట్ ద్వారా సినిమా భారీ కాన్వాస్‌ను జాతీయ మీడియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. ముంబై ట్రైలర్ లాంచ్ తర్వాత, చిత్ర బృందం ఈ కథ మూలాలను సెలబ్రేట్ చేయడానికి హార్ట్ ఆఫ్ ఇండియాగా పిలిచే భోపాల్‌కు వెళ్లనుంది. మే 23న అక్కడ స్పెషల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు.

# డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు సమస్యలు ఉన్నాయి !



ఎగ్జిబిటర్లకు మాత్రమే కాదు.. డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు కూడా సమస్యలు ఉన్నాయని తెలుగు సినీ నిర్మాతలు అన్నారు. తాము ఇబ్బందు ల్లో ఉన్నామని, పర్సెంటేజ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎగ్జిబిటర్లు ఇటీవల ప్రెస్ మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తెలుగు నిర్మాతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్‌లో నిర్మాతలు యలమంచిలి రవిశంకర్, సూర్యదేవర నాగవంశీ, సాహుగారపాటి, సుధాకర్ చెరుకూరి, వెంకట సతీష్ కిలారు తదితరులు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్లు ఏక పక్షంగా ప్రెస్ మీట్ నిర్వహించి బెదిరించినట్టుగా మాట్లాడటం సరికాదని, అందరం కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని నిర్మాతలు అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యను పరిష్కరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, అదే సమయంలో తమ సమస్యలకు కూడా పరిష్కారం కావాలని నిర్మాతలు అన్నారు. నిర్మాత యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ.. ఈ ప్రెస్ మీట్ ముఖ్య ఉద్దేశం ఏంటంటే, నిన్న ఎగ్జిబిటర్స్ ప్రెస్ మీట్ నిర్వహించి వారికి అన్యాయం జరుగుతుందని చెప్పడం జరిగింది. ఈ అంశంపై నిర్మాతల కోణం కూడా తెలియజేయాలని, నిజానిజాలు తెలపాలనే ఉద్దేశంతో ఈ ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నాము. ఎగ్జిబిటర్లు బాగా ఇబ్బందులు పడుతున్నారు, అందుకే పర్సెంటేజ్ విధానానికి రావాలి అనుకుంటున్నామని తెలిపారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "ఎకో సిస్టమ్ లో ఒకరు బాగోకపోతే ముగ్గురూ బాగోరు. ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ ముగ్గురూ బాలేదు. ప్రెస్ మీట్ పెట్టి ఎగ్జిబిటర్ల పరిస్థితి బాలేదని చెప్పారు. కానీ, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల పరిస్థితి కూడా అలాగే ఉంది. కొన్ని నెలల నుంచి చూస్తూనే ఉన్నాం. కంటెంట్ లేక శ్రీరాములు లాంటి థియేటర్‌ను మూసేయాల్సి వచ్చిందని వాళ్ళే చెప్పారు.

# 'రాజా ది రాజా' టీజర్ లాంచ్



'రాజా ది రాజా'తో తను ప్రేక్షకులని అలరించాలని కోరుకుంటున్నాను: టీజర్ లాంచ్ ఈవెంట్ లో విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ 'రాజా ది రాజా'చాలా పాషన్ తో చేసిన సినిమా. ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను: హీరో రుత్విక్ విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ లాంచ్ చేసి, రుత్విక్, అనిల్ బోయిడపు, వృందావన్ క్రియేషన్స్ 'రాజా ది రాజా' ఎంటర్టైనింగ్ టీజర్ మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రుత్విక్‌ను హీరోగా పరిచయం చేస్తూ వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కె.నిహారిక దాసరి చిత్రం రాజా ది రాజా. యువత తమ కలల కోసం పరుగులు తీయడం, తల్లిదండ్రులు తమ ఆశయాలను పిల్లలపై రుద్దడం వంటి నేటి తరానికి కనెక్ట్ ఎలిమెంట్స్, అందమైన ప్రేమకథతో మేళవిస్తూ ఈ చిత్రం తెరకెక్కుతోంది.విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తాజాగా ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేశారు. దర్శకుడు , అనిల్ బోయిడపు విజన్ మొదటి ఫ్రేం నుంచే ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో వీకే నరేష్, రుత్విక్ తండ్రి పాత్రలో కనిపిస్తారు. తండ్రి-కొడుకుల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని టీజర్ హత్తుకునేలా చూపించింది. హీరో హీరోయిన్ల మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, యూత్‌ఫుల్ కాన్సెప్ట్, ఉన్నత స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ బ్రిలియన్స్ టీజర్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాస్యం, ప్రేమ, యాక్షన్, హీరో కలలు.. ఇలా అన్ని భావోద్వేగాలను దర్శకుడు ఎంతో చక్కగా హ్యాండిల్ చేశారని టీజర్ ద్వారా తెలుస్తోంది. రవికిరణ్ బోయిడాపు సినిమాటోగ్రఫీ, మార్క్ కె రాబిన్ సంగీతం ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ అద్భుతమైన టీజర్‌తో మేకర్స్ ఒకేసారి టాలెంటెడ్ యంగ్ హీరోను, మంచి కంటెంట్ ఉన్న సినిమాను ప్రేక్షకులకు పరిచయం చేసినట్లైంది.

# 'వర్క్ ఫ్రమ్ హోమ్' ట్రైలర్ విడుదల

'వర్క్ ఫ్రమ్ హోమ్' చేయమని చెప్పడం మా సినిమాకి మరింత బలాన్ని ఇచ్చింది. ఇది పర్ఫెక్ట్ సమ్మర్ ఎంటర్‌టైనర్. ఖచ్చితంగా ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేస్తారు: ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' టీమ్‌ఈషా ఫేం త్రిగుణ్, పాపం ప్రతాప్ ఫేం పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో చేస్తున్న హోల్సమ్ ఎంటర్టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సిహెచ్‌విఎస్ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై అరవింద్ మండెం నిర్మించారు. ఈ సినిమా టీజర్, పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ వెంకట సాయి ఫిలిమ్స్ ద్వారా ముత్యాల రామ్ దాస్ ఈ చిత్రాన్ని వరల్డ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. మే 15న సినిమా గ్రాండ్‌గా థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో త్రిగుణ్ మాట్లాడుతూ.. 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' ఈ సమ్మర్‌లో ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే మంచి ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్. ట్రైలర్ చెప్పినట్టుగా మార్నింగ్ షో విషయం ఏంటో తెలియదు గానీ, టాక్ బయటకు వస్తే సినిమా గురించి మీకే తెలుస్తుంది. మొన్ననే ప్రధాని మోదీ 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేయమని మళ్లీ ట్రెండ్ మొదలుపెట్టారు. ఆ రకంగా ఈ సినిమా మంచి ట్రెండ్‌లో వస్తోంది



# 'ఏదైనా సాధ్యమే' టైటిల్ ఆవిష్కరణ



ఆధ్యాత్మికతను, మానవ సంబంధాలను మేళవిస్తూ శ్రీ ఆది లక్ష్మి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సరికొత్త చిత్రం 'ఏదైనా సాధ్యమే'. ఈ సినిమాకు 'దైవం తోడుంటే.. అనేది ఉపశీర్షిక. ఈ చిత్ర టైటిల్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు మద్దూరి రాజా, నిర్మాత అనిల్ మునగనూరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్. సుబ్రహ్మణ్యం, చిత్ర బృందం పాల్గొన్నారు. ప్రతి మనిషి తన ఇష్ట దైవంతో బలమైన అనుబంధాన్ని పెంచుకోవడం ద్వారా జీవితంలోని దుఃఖాల నుండి, బాధల నుండి ఎలా విముక్తి పొందవచ్చనే అంశాన్ని ఈ సినిమా ద్వారా చూపించను న్నారు. ముఖ్యంగా ఈ చిత్ర నిర్మాణం మొత్తం 'శ్రీ అమ్మ భగవాన్' బోధనల ఆధారంగా రూపొందుతోందని చిత్ర యూనిట్ ప్రకటించింది .సినిమా కథనం ప్రధానంగా శ్రీ అమ్మ భగవాన్ చెప్పిన ఈ ఐదు సూత్రాల చుట్టూ తిరుగుతుందని వెల్లడించారు. నీవు ప్రత్యేకమైన వ్యక్తివి, నీ ఆంతరంగిక ప్రపంచమే బాహ్య ప్రపంచం, వ్యక్తి లేదు, వ్యక్తిత్వాలు మాత్రమే ఉంటాయి, అంతర్గత సత్యము, జీవితమంటేనే బాంధవ్యాలు. ఈ అంశాల ఆధారంగానే సినిమా కథనం ఉంటుందని తెలిపారు.కథ, మాటలు, సాహిత్యాన్ని అందిస్తూ నిర్మిస్తున్న అనిల్ కుమార్ మునగనూరి మాట్లాడుతూ.. దేశానికి యువత ఎంతో ముఖ్యం. కానీ చాలా మంది నిరాశలో, డిప్రెషన్ లో కూరుకు పోతున్నారు.

